RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



27 మార్చ్ 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:254

# ఆ 400 ఎకరాలు HCU భూమి కాదు

## అక్కడ చేరిన గుంటనక్కలకు గుణపాఠం చెప్తాం.

## అసెంబ్లీలో హెచ్చరించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రత్యక్షంగా నిర్వహించినా, పరోక్షంగా ప్రోత్సహించినా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇలాంటి వాటిని నిరోధించడానికి, నిషేధించడానికి పూర్తి స్థాయి అధికారాలతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సభ్యుల నుంచి వచ్చిన ప్రస్తావనపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని, ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్, ఆన్‌లైన్ రమ్మీ వంటి వాటి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

"కేవలం ప్రచారం కల్పించే వారిని విచారించడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. ఈ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల వల్ల ఎంతో మంది బలవుతున్నారు. కేవలం రాష్ట్రంలో చర్యలు తీసుకున్నంత మాత్రాన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. ఇతర రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల నుంచి ఆపరేట్ చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.

వీటిని నిషేధిస్తూ 2017 లో చట్టం చేసినప్పటికీ పకడ్బందీగా అమలు చేయడంలో కొంత నిర్లక్ష్యం జరిగింది. ఈ మధ్య కాలంలో చాలా వేగంగా దుర్వినియోగం జరుగుతోంది. రాష్ట్ర స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు వివిధ రకాల సంస్థలు, వ్యక్తులు, వివిధ దేశాలకు చెందిన నేరగాళ్లు ఇందులో పాల్గొంటున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులకు చట్టంలో కఠినమైన శిక్షలు కూడా లేవు. శిక్షను పెంచుతూ చట్టంలో అవసరమైన మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్, ఆన్ లైన్ రమ్మీ మాత్రమే కాదు. గంజాయి, కొకైన్, కోడి పందాల్లాంటి ఇతర వ్యసనాలకు కూడా తెలంగాణలో తావులేదు. తెలంగాణను ఒక ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నాం. ధరల నియంత్రణలో, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో తెలంగాణ ముందున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తామెక్కడా డాంబికాలకు గొప్పలకు పోకుండా వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టే విధంగా రూపొందించాం. చేసేదే చెప్పాం. చెప్పిందే చేస్తామన్న విధానంలో బడ్జెట్‌ను నియంత్రించాం.

గచ్చిబౌలిలోని భూమి సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోనిది కాదు. యూనివర్సిటీకి ఎలాంటి సంబంధం లేదు. గతంలో ఐఎంజీ భారత్ అనే ఒక బోగస్ కంపెనీకి కేటాయించిన భూమిని 2006 లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. దాదాపు 25 సంవత్సరాల పాటు న్యాయస్థానాల్లో కేసు పెండింగ్‌లో ఉంది. గత ప్రభుత్వంలో ఆ భూమిని వెనక్కి తిరిగి తీసుకోవాలన్న ప్రయత్నాలు చేయలేదు.

తాను అధికారం చేపట్టిన తర్వాత సుప్రీంకోర్టులో పోరాడి ఆ కేసు గెలిచి భూమిని వెనక్కి తీసుకున్నాం. అభివృద్ధిలో భాగంగా ఆ భూమిని టీజీఐఐసీకి కేటాయించాం. అక్కడ ఐటీ కంపెనీలు, ఇతర పరిశ్రమలు రావడానికి ఒక స్పష్టమైన ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి ప్రణాళిక తయారు చేయమన్నాం. రకరకాల ప్రచారాలు చేస్తున్నట్టు అది రిజర్వు ఫారెస్ట్ కాదు.

కాలుష్య కారక ఫార్మా పరిశ్రమలను కాదని, నెట్ జీరో సిటీ చేయాలన్న ఒక మంచి సంకల్పంతో 4 కోట్ల తెలంగాణ ప్రజల కోసం ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం. పరిశ్రమల ఏర్పాటు, ఇతరత్రా భూసేకరణకు సంబంధించి భూమి కోల్పోతున్న వారి బాధను దృష్టిలో ఉంచుకొని వారికి ఏ రకంగా నష్టపరిహారం చెల్లిద్దామన్న విషయంలో సూచనలు ఇవ్వాలి.

భూములను కోల్పోతున్న వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిది. అలాంటి కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిద్దాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

# మీలాగా అడ్డగోలు పనులు చేసి రాష్ట్రాన్ని దోపిడిచేయలేదు

## శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** మేము ఒక బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చాము. మీలాగా బరితెగించి అడ్డగోలుగా రాష్ట్రం మీద పడి దోచుకోడానికి మేము రాజకీయాల్లోకి రాలేదు.

ప్రజలకు మేలు చేయాలని, సేవ చేయాలని ఇక్కడకు వచ్చాము.

మాలాగా అణగారిని వర్గాలు, తడితులు, పీడితులు, బాధితులు, ఇబ్బందుల్లో ఉన్న మధ్యతరగతి ప్రజలు బాధలు పడవద్దని , వారి కోసం ఏదైనా చేయాలనే ఉన్నతమైన ఆశయంతో పని చేస్తున్నాము.

మీలాగా అడ్డగోలు పనులు చేసి రాష్ట్రాన్ని దోపిడి చేసేసి సర్వనాశనం చేసి.. రూ. 8 లక్షల కోట్లను అప్పులు చేసి ప్రజల మీద భారం వేసి వెళ్లే ఆలోచనతో మేము రాజకీయాల్లోకి రాలేదు.

మాట్లాడే ముందు ఒక బాధ్యత, నిబద్దత ఉండాలి. మాట్లాడేముందు ఒళ్లు దగ్గర పెట్టుకుని మనం మాట్లాడేది కరెక్టా? కాదా? అని ఆలోచనతో మాట్లాడాలి.



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి**: బుధవారం సాయంత్రం రాయల్ పాలేస్ సాత్నాల లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న జిల్లా పాలనాధికారి రాజర్షి షా., అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, రెవెన్యు డివిజనల్ అధికారి, తదితరులు

# భద్రాచలంలోని సూపర్ బజార్ సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనం కుప్పకూలింది



**భద్రాచలం కొత్తగూడెం జిల్లా ప్రజాబలం ప్రతినిధి: మార్చి 26** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలంలో విషాదం చోటు చేసుకుంది. భద్రాచలంలోని సూపర్ బజార్ సెంటర్?లో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనం కుప్పకూలింది. పాత భవనంపై ఐదు అంతస్తులు నాసిరకంగా నిర్మాణం చేయడంతో ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు.

అధికారులు చెప్పినా వినకుండా నిర్మాణం భద్రాచలానికి చెందిన ఎస్కే మౌలానా అలియాస్ శ్రీపతి పాత భవనంపై గడచిన రెండేళ్లుగా ఒక్కొక్కటిగా ఐదంతస్తులు నిర్మించాడు. శ్రీపతి సేవ ట్రస్టు ద్వారా విరాళాలు సేకరించి నిర్మాణాన్ని చేపడుతున్నాడు. ఐతే పనులు నాసిరకంగా జరుగుతున్నాయని చుట్టుపక్కల వారు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు ఆపమని చెప్పినప్పటికీ శ్రీపతి అలాగే పనులు చేపట్టాడు. ఈ నేపథ్యంలోనే ఇవాళ మధ్యాహ్నం రెండున్నర గంటలకు భవనం ఒక్కసారిగా కూలింది.

నిర్మాణ పనులు చేస్తున్న కొందరు మృతి చెందారని చుట్టుపక్కల వారు చెబుతున్నారు. భవన శిథిలాల కింద ఒక వ్యక్తి బతికి ఉన్నట్లు సిబ్బంది గుర్తించారు. ఘటనాస్థలికి వైద్య బృందాన్ని రప్పించారు. శిథిలాల కింద సెల్‌ఫోన్, లంచ్ బాక్సు గుర్తించారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. ఐటీసీ నుంచి ప్రత్యేకంగా ప్రొక్లెయిన్లు తీసుకొచ్చి సహాయక చర్యలు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్ పర్యవేక్షిస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘించి కట్టారు! : నిబంధనల ఉల్లంఘిస్తూ బహుళ అంతస్తులతో పాటు నాసిరకంగా నిర్మాణం చేపట్టారని గతంలోనే గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. కొన్ని నెలల పాటు పనులు నిలిపివేసినా తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ విషయంపై వివిధ సంఘాలు, స్థానికులు అనేకసార్లు ఆందోళనకు దిగినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ చట్టాల ప్రకారం బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు లేకున్నా భద్రాచలంలో యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం కూలిన భవనం కూడా. నిబంధనలు ఉల్లంఘించి కట్టారని స్పష్టమవుతోంది.

# మేయర్ ను కలిసిన ఇండియనా ప్రతి నిధుల బృందం




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 26:** జిహెచ్ఎంసి తో అమెరికా దేశానికి చెందిన ఇండియనా స్టేట్ తో 2010 సిస్టర్ సిటీ ఒప్పందం చేసుకున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ఆ చెందిన ప్రతినిధి బృందం హైదరాబాద్ వచ్చిన సందర్భంగా బుధవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్ ను మర్యాదపూర్వకంగా కలిసారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆ బృందాన్ని సాదరంగా ఆహ్వానించి ధన్యవాదాలు తెలిపారు. సిస్టర్ సిటీ ఒప్పందంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఇండియనా ప్రతి నిధులు మేయర్ కు వివరించారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం హైదరాబాద్ గతంలో కంటే అభివృద్ధి చెందినట్లు వారు తెలిపారు.

ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ పరిధిని పెంచి గ్లోబల్ సిటీ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అంతే కాకుండా హైదరాబాద్ చుట్టూ మరొక త్రిబుల్ ఆర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉత్తరం వైపు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ప్రజా పాలన రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసి లో మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణకు రూ. 7032 కోట్లతో రోడ్డు వెడల్పు, ఫ్లై ఓవర్లు నిర్మాణాలు చేపట్టి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు ఇట్టి పనులు పూర్తయితే గ్లోబల్ సిటీ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నగరంలో పాఠశాల విద్యా అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ప్రతినిధులను మేయర్ కోరగా సానుకూలంగా స్పందించి అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తామని వారు మేయర్ కు వివరించారు. ఇండియానా పోలీస్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ డియాగో మోరల్స్, చింతా ల రాజు, చీఫ్ అడ్వైసర్ ఆఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం రాష్ట్ రాష్ట్ర పర్యటనకు మేయర్ ను ఆహ్వానించారుతప్పకుండ మా గెలిగేట్ తో వస్తామని ఆహ్వానించినదుకి మేయర్ %ఎ%ధన్యవాదాలు తెలిపారు.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**రంజాన్ ఉపవాస దీక్షల విరమణ సందర్భంగా బుధవారం బంజారాహిల్స్ రేనోవ హాస్పిటల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గారు పాల్గొన్నారు.ముందుగా జరిగిన ప్రార్ధనలలో పాల్గొన్న మేయర్,అనంతరం పలువురికి ఖర్జూర ఇచ్చి దీక్ష విరమింప చేస్తూ ముస్లిం సోదరులకు రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజాబలం

27 మార్చ్ 2025 గురువారం


## ట్రంప్ గ్రీన్‌ల్యాండ్ ఆరాటం..

గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడం తథ్యం అంటూ ట్రంప్ పదే పదే ప్రకటిస్తున్నాడు. రెండోసారి అధికారం చేపట్టగానే ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపాలని, గాజాను తాము స్వాధీనం చేసుకుంటామని, పనామా జలసంధి పైన ఆధిపత్యాన్ని తామే చేపడతామని ప్రకటించాడు. ఆ యా దేశాల, ప్రజల సార్వభౌమాధికారాన్ని బేఖాతరు చేస్తూ ఇలా ఒక దేశాధినేత ప్రకటించడం అన్ని అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధం. ప్రపంచ శాంతికి, సహజీవనానికి భంగకరం. ఐనప్పటికీ వాటిని పట్టించుకోకుండా ట్రంప్ వ్యవహరించడం వెనుక కారణం ఏమిటి? అమెరికా అన్న దేశం ఏర్పడిందే స్థానిక తెగలను నాశనం చేయడం, ఆక్రమించుకోవడం ద్వారా. బలవంతుడిదే రాజ్యం అన్న ఆటవిక న్యాయం అమలు చేయడం సామ్రాజ్యవాదుల స్వభావం. అయితే అమెరికా దానికొక ముసుగు తొడిగింది. దాని పేరే జాతీయ భద్రత. తాజాగా 2020లో జారీ చేసిన ఇంధన చట్టంలో దేశ భద్రతకు అవసరమైన కీలక ఖనిజాల జాబితాను ప్రకటించారు. అంటే ఆ కీలక ఖనిజాలు ఎక్కడున్నా, ఏ దేశంలో ఉన్నా వాటిని స్వాధీనం చేసుకోవడం అనేది జాతీయ భద్రత పేరుతో సమర్థించుకోడానికి అమెరికా తయారైంది. మనం మామూలుగానైతే మన దేశానికి వెలుపలి నుండి కాని, ఆంతరంగికంగా కాని ప్రమాదం ఎదురైనప్పుడు దానిని భద్రతా సమస్యగా పరిగణిస్తాం. కాని అమెరికా తీరే వేరు. భద్రతా అవసరాల పేరుతో అది ఎప్పుడైనా, ఏ దేశం మీదనైనా దాడి చేయవచ్చు, అక్కడ ఏ సంపదనైనా స్వాధీనం చేసుకోవచ్చు. బైటకు మాత్రం ప్రపంచంలోని ప్రజాస్వామ్యాన్నంతటినీ కాపాడే రక్షకుడిని తానే అన్నట్టు పోజు పెడుతుంది. ఆ పేరుతో కూడా కుట్రలు సాగిస్తుంది.

అమెరికన్ కార్పొరేట్ల పరిశ్రమల ఉత్పత్తులకు కావలసిన 50 రకాల ఖనిజాలను ఆ ఇంధన చట్టంలో పేర్కొన్నారు. వాటిలో కనీసం 12 ఖనిజాలు గ్రీన్‌ల్యాండ్‌లో లభిస్తాయి. రేర్ ఎర్త్స్‌గా పిలిచే ఖనిజాలు టైటానియం, లిథియం వంటివి ఆధునిక పరిశ్రమల్లో ముడి పదార్థాలుగా ఉన్నాయి. ఇవేవీ అమెరికాలో లభించవు. కాబట్టి అవి ఎక్కడ లభిస్తే ఆ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుని వాటిని కొనుగోలు చేయాలి. కాని అమెరికా రూటే వేరు. ఆ దేశాలనే తన నియంత్రణలోకి తెచ్చుకోడానికి, కుదరకపోతే ఆక్రమించుకోడానికి పూనుకుంటుంది. ఇప్పుడు గ్రీన్‌ల్యాండ్, ఉక్రెయిన్‌ల మీద అమెరికా దృష్టి సారించింది ఇందుకే. గ్రీన్‌ల్యాండ్ భూభాగంలో 1.5 శాతం, అంటే 35,000 చదరపు కి.మీ ప్రాంతంలో ఖనిజాల తవ్వకం, అన్వేషణ సాగుతోంది. ఆర్కిటిక్ ధృవ ప్రాంతానికి అతి దగ్గర్లో ఉంది గనుక ఎక్కువ భాగం మంచుతో కప్పబడి వుంటుంది. ధృవ ప్రాంతపు మంచు కరిగిపోవడం అంటే అది పలు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తుంది. అందుకే చాలా పరిమితంగానే అక్కడ ఖనిజాల వెలికితీతకు అనుమతులు ఇస్తున్నారు. గతంలో చమురు, సహజవాయువు నిక్షేపాల అన్వేషణకు అనుమతిచ్చినా, 2021 నుండి అటువంటి అనుమతులను నిలుపుచేశారు. భూతల ఉష్ణోగ్రతలు పెరిగిపోయే ప్రమాదం ఉన్నందువల్ల ఆ విధంగా నిర్ణయించారు. ఇప్పటివరకూ చేసిన అన్వేషణలను బట్టి చూస్తే గ్రీన్‌ల్యాండ్‌లో 4.4 ట్రిలియన్ల డాలర్ల విలువైన కీలక ఖనిజాల నిక్షేపాలు ఉన్నట్టు అంచనా తేలింది. అందులో 1.76 ట్రిలియన్ల విలువైన చమురు, సహజవాయువు నిక్షేపాలు ఉన్నాయి. వాటిని వెలికి తీయకుండా నిలుపు చేశారు. గతంలో అమెరికన్ కంపెనీలైన బిపి. షెవ్రాన్, షెల్ తదితర సంస్థలకు ఖనిజాల అన్వేషణకు అనుమతులు ఇచ్చారు. కాని తర్వాత పర్యావరణ రక్షణ ప్రాధాన్యత రీత్యా వాటిని పునరుద్ధరించడం మానివేశారు. ఇప్పటికీ బ్రిటన్‌కు చెందిన నాలుగు కంపెనీల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. వాటి కాల వ్యవధి 2027తో ముగుస్తుంది. తమ ఇంధన అవసరాలను సౌర విద్యుత్తుతో తీర్చుకోడానికి గ్రీన్‌ల్యాండ్ సిద్ధపడుతోంది. ఇదే ట్రంప్ కంటగింపుకు కారణం అయింది. స్వయంగా గుత్త చమురు సంస్థల యజమాని అయిన ట్రంప్ పర్యావరణ లక్ష్యాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాడు. కాప్ శిఖరాగ్ర సమావేశాన్ని అమెరికా పట్టించుకోలేదు. ప్రపంచంలో ఉన్న సమస్త చమురు నిల్వలనూ తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని ఆరాటపడుతున్నాడు. వాస్తవానికి 1955లో అమెరికా గ్రీన్‌ల్యాండ్‌ను 100 మిలియన్ డాలర్లకు కొనేయడానికి బేరం పెట్టింది. ప్రస్తుత విలువ ప్రకారం అది 1.3 బిలియన్ డాలర్లు. అంటే గ్రీన్‌ల్యాండ్ మీద అమెరికన్ గుత్తాధిపతుల కన్ను అప్పటి నుంచీ పడిందన్నమాట. ఇక ఉక్రెయిన్ మీద అమెరికా ప్రేమకు కారణం అక్కడ అమెరికాకు కావలసిన 'కీలక ఖనిజాలు' చాలా పుష్కలంగా ఉండడమే. టైటానియం, యురేనియం, ఇల్మెనైట్ వంటి విలువైన, అరుదైన ఖనిజాల నిల్వలు ఉక్రెయిన్ భూభాగంలో ఉన్నాయి. వీటి విలువ 14.8 ట్రిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా. ఎలక్ట్రిక్ కార్ల బ్యాటరీల తయారీకి ఉపయోగించే గ్రాఫైట్ నిల్వలు అక్కడ 19 మిలియన్ టన్నులు ఉన్నాయి. 1990 వరకూ ఉక్రెయిన్ రష్యాలో అంతర్భాగంగా ఉండేది కనుక ఆ నిక్షేపాల జోలికి పోవడం సాధ్యం కాలేదు. ఆ తర్వాత రష్యాతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోడానికి పూనుకున్న ప్రభుత్వాన్ని కూలదోసి జెలెన్‌స్కీని అమెరికా, బ్రిటన్ ముందుకు తెచ్చి నిలబెట్టాయి. సామ్రాజ్యవాద దేశాలకు ఉక్రెయిన్‌లో ఉన్న కీలక ఖనిజసంపద తమను దాటి బైటకు పోనివ్వరాదన్న దుగ్ధ ఉంది. అందుకే రష్యాతో ఘర్షణను ఎగదోశాయి. వీళ్ళు ఈ తగువుల్ని రేగ్గొట్టుతూ వుంటే ఇంకోపక్క చైనా చల్లగా ప్రపంచంలోని రేర్ ఎర్త్స్ ఖనిజాల నిల్వలలో 75 శాతంపై తన పట్టు సంపాదించింది. అమెరికా ఆక్రోశం పెరిగిపోడానికి ఇది మరో కారణం. ఉక్రెయిన్–రష్యా యుద్ధం మరికొంత కాలం కొనసాగితే తాము చైనా కన్నా మరింత వెనుకబడి పోతామన్న భయం పట్టుకుంది. అందుకే యుద్ధాన్ని వెంటనే ఆపుచేయాలని జెలెన్‌స్కీని ట్రంప్ ఆదేశించాడు. యుద్ధాన్ని రెచ్చగొట్టడమైతే చేయగలిగారు కాని విరమింపజేయాలంటే అదంత తేలికైన వ్యవహారం కాదు కదా. ఎలాగో ఒకలా ఈ యుద్ధాన్ని త్వరగా ముగించి, ఆ తర్వాత ఉక్రెయిన్‌లోని ఖనిజ సంపదను చేజిక్కించుకోవాలని అమెరికా తొందరపడుతోంది. మరోపక్క బ్రిటన్, జర్మనీ తదితర దేశాలు తమ పొరుగునే ఉన్న ఉక్రెయిన్ నుండి ప్రయోజనాలు వస్తే గిస్తే తమకే ముందు దక్కాలన్న తాపత్రయంలో ఉన్నాయి. ఇంకో పక్క గ్రీన్ ల్యాండ్ జోలికి అమెరికా గనుక వస్తే "అది నాటో కూటమిలో సభ్యులైన దేశాల నడుమ యుద్ధానికి దారి తీస్తుంది" అంటూ డెన్మార్క్ పార్లమెంటు ప్రతినిధి ప్రకటించారు. అంటే యూరోపియన్ సామ్రాజ్యవాద, సంపన్న దేశాలు అమెరికా ఏకపక్ష వైఖరికి తలొగ్గడానికి సిద్ధంగా లేవని కనపడుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో అమెరికా గనుక పైచేయి సాధిస్తే అది మొత్తం మానవాళి మనుగడనే ప్రమాదంలో పడవేస్తుంది. పర్యావరణానికి దిద్దుకోలేనంత హాని జరుగుతుంది. ఒకవేళ యూరప్ లోని అమెరికా మిత్రులు అమెరికా యత్నాలను అడ్డుకుంటే అది సామ్రాజ్యవాద దేశాల నడుమ ఘర్షణలను తీవ్రతరం చేస్తుంది. మొత్తం మీద ఈ వ్యవహారాన్ని ప్రపంచం యావత్తూ శ్రద్ధగా పరిశీలిస్తోంది.

## ముంపు గ్రామాల నిర్వాసితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.

### బిజెపి మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** బుధవారం రోజున వేములవాడ అర్బన్ మండలం భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుని ఆధ్వర్యంలో మిడ్ మానేరు ముంపు గ్రామ నిర్వాసితులకు ప్రభుత్వం ఇస్తానన్న 5,04000/- రూపాయలు వెంటనే ఇవ్వాలని, ముంపు గ్రామాలలో ఇంకా పెండింగ్ లో ఉన్న ఇండ్ల నష్టపరిహారం, పట్టాలు, ప్యాకేజీ ఇచ్చి ముంపు గ్రామ నిర్వాసితులకు ఉపాధి చూపించాలని, వేములవాడ అర్బన్ తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ ద్వారా ప్రభుత్వం దృష్టికి చేరే విధంగా వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, బిజెపి సీనియర్ నాయకులు లింగంపల్లి శంకర్, ఏ రెడ్డి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి ప్రశాంత్, నర్సింగోజు శంకర్, ఉపాధ్యక్షులు బి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఏరు గోక్కుల రమేష్, తిప్పర వేణి రాజు, జింక శ్రీనివాస్, కార్యదర్శి కొలనూరి సంజీవరెడ్డి, కోశాధికారి సోలంకి అరవింద్, అధికార ప్రతినిధులు కర్రె పవన్, విశ్వనాథం శ్రీధర్, దళిత మోర్చా అధ్యక్షుడు గంట మహేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కొమ్మనబోయిన సంతోష్ యాదవ్, కార్యవర్గ సభ్యులు బొల్లు తిరుపతి, తునికి అజయ్, బూత్ అధ్యక్షులు నాగుల సురేష్ గౌడ్, రెడ్డవేని రాజు, బాలకృష్ణ, ఎర్రం లక్ష్మీ నర్సు, బిజెపి నాయకులు గుండెకార్ల లక్ష్మణ్, పోచంపల్లి భాను, చల్లా నర్సయ్య, జ్వాల లక్ష్మారెడ్డి, దామోదర్ రెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, ముడికే రాములు, నాంపల్లి తిరుపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కేకే ఓసిని సందర్శించిన జిఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మార్చి 26:** మందమరి ఏరియా లోని కే.కే ఓ.సి గనిని జి.ఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్ బుధవారం సందర్శించారు అనంతరం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి. దేవేందర్ అధ్యక్షతన జిఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సేఫ్టీ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. మందమర్రి ఏరియాకి సంబంధించిన అన్ని డిపార్ట్మెంట్ల యొక్క సేఫ్టీ రివ్యూ మీటింగ్ కు ఎలక్ట్రికల్ /మెకానికల్/డిపార్ట్మెంట్ ల అధికారులు పాల్గొనగా, గనులకు సంబంధించి తీసుకోవలసిన రక్షణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లప్పుడు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ జి.ఎం రఘు కుమార్, కే.కే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఎస్ ఓ టు జి ఎం విజయ ప్రసాద్, సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, అన్ని గనుల సేఫ్టీ ఆఫీసర్లు, అన్ని గనుల డిపార్ట్మెంట్ ల ఇంజనీర్లు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ బిల్లుకు అవరోధాలు రాకుండా కేంద్రం ఆమోదించేలా పకడ్బందీ వ్యూహాన్ని బీసీలు అనుసరించాలి.

**బీసీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ ఆమోదంలో జాప్యం జరిగితే బీసీ సంఘాల ఉద్యమం ఉధృతం అవుతుంది.**

**త్వరితగతిన బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి వేను వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి.**

**పార్లమెంటులో బీసీ బిల్లు ఆమోదం కై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి.**

**కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షుడు పొలాస నరేందర్.**



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** తెలంగాణ శాసనసభలో ఈ నెల 19వ తేదీన ఏకగ్రీవంగా ఆమోదం పొంది, 42 శాతం బీసీలకు రాజకీయంగా స్థానిక సంస్థలలో, విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు కల్పించుటకై ఆమోదించిన బిల్లుకు కేంద్రంలో ఎలాంటి అవరోధాలు రాకుండా, ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే కేంద్రం అమోదించేలా పకడ్బందీ వ్యూహాన్ని అనుసరించాలని రాష్ట్రంలోని బీసీ సంఘాలను ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ కోరారు.

అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో చట్టబద్ధంగా, శాస్త్రీయంగా, ఆమోదం పొందటానికి గాను, అన్ని బీసీ కుల సంఘాలు, బీసీ సామాజికవేత్తలు, మేధావులు, ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ సంఘాలతో పాటుగా, అన్ని వర్గాలకు చెందిన బీసీలు, రాజకీయాలకు అతీతంగా, సమిష్టిగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేలా కృషి చేయాలని నరేందర్ బీసీ సంఘాలను కోరారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు జయలలిత బి సి రిజర్వేషన్లు సాధించేంతవరకు, పార్లమెంట్ ఆమోదం పొందే వరకు ఢిల్లీలోని ఉన్నారని నరేందర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే తరహాలో అఖిలపక్ష నేతలను వెంటబెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో మకాం పెట్టాలని, ముఖ్యమంత్రికి మద్దతుగా, తెలంగాణ బీసీ సంఘాలు ఎల్లవేళలా ఉంటారని, 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన చట్టాన్ని త్వరితగతిని అమలు చేసేందుకు కృషి చేయాలని బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం త్రికరణ శుద్ధితో పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదం తెలిపి, రాష్ట్రపతిచే ఆమోదముద్ర వేయించి, భవిష్యత్తులో ఎలాంటి చట్ట పరమైన చిక్కులు రాకుండా, శాస్త్రీయంగా, చట్టబద్ధమైన రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వంను కోరారు. బీసీల అభ్యున్నతి కొరకు పదే పదే మాట్లాడుతున్న వివిధ రాజకీయ పార్టీ నాయకులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకునే అవకాశం వచ్చిందని, పార్లమెంట్లో బిల్లు ఆమోదం పొందేలా కృషి చేయాలని, 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా పొందిన వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలో జరిగే జాప్యం వలన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని పొలాస నరేందర్ అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మాధవరం



**కూకట్పల్లి (ప్రజబలం) మార్చ్ 26:** కూకట్పల్లి నియోజకవర్గం లోని పలు సమస్యల పరిష్కారానికి సత్వరం నిధులు మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అసెంబ్లీ లోని ఆయన ఛాంబర్ లో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నూతన రోడ్ల నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ, తాగునీటి నూతన పైప్ లైన్ ల నిర్మాణం, పార్కులు,స్మశాన వాటికల నిర్మాణం (మిగిలిన పనులకు) సుమారుగా 25–30 కోట్ల రూపాయల నిధులను సత్వరం మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా కూకట్పల్లి మండలం పరిధిలోని హైదర్ నగర్ గ్రామం సర్వే నెంబర్ 145,163 లలో నిర్మాణ అనుమతులను నిలిపివేసి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దశాబ్దాల కాలంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా గానీ ప్రభుత్వపరమైన అన్ని అనుమతులను జారీ చేశారని, ఇటీవల కాలంలో అకస్మాత్తుగా నిర్మాణ అనుమతులను నిలిపివేశారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మున్సిపల్ అధికారులు రెవెన్యూ అధికారులపై, రెవెన్యూ అధికారులు మున్సిపల్ అధికారులపై నెపం వేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం వివరించారు. అదేవిధంగా జేఎన్టీయూ వెనుక ఉన్న సాయి నగర్ కాలనీ వాసుల ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలని, 2014 కు ముందు ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు డబ్బులు చెల్లించేందుకు కాలనీ వాసులు సిద్ధంగా ఉన్నారని వారికి న్యాయం చేయాలని కోరారు. అన్ని విషయాలను వివరంగా తెలుసుకున్న ముఖ్యమంత్రి వినతి పత్రాలను సంబంధిత అధికారులకు పంపిస్తానని త్వరలోనే పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

## ధరణిలో పెండింగ్ దరఖాస్తుల సమీక్ష

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 26:** బుధవారం మూడు చింతలపల్లి తహాసీల్దారు కార్యాలయాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి తనిఖీ చేసారు. ధరణిలో పెండింగ్ వివరాలపై అదనపు కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ధరణిలో ఎన్ని పెండింగ్ ఉన్నాయని ఎంఆర్ఓ ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ తొందరగా క్లియర్ చేయాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ నర్సింహారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నీట్ ఫిజిక్స్ కు ఉచిత శిక్షణ




**ఖమ్మం మార్చి 26 (ప్రజాబలం బ్యూరో )**దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షకు ప్రిపేర్ అయ్యే పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఫిజిక్స్ పేపర్ కు 15 రోజులపాటు జమ్మిబండ వెనుక బజార్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వి శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ. దేశవ్యాప్తంగా సుమారు 17 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతారని, ప్రతి సబ్జెక్టులో ప్రావీణ్యత సాధించగలిగితేనే మంచిర్యాంకును పొందగలమన్నారు. కొందరు బైపీసీ విద్యార్థులు సైకలాజికల్ గా గణితం అంటే భయ పడుతుంటారు. అలాంటి విద్యార్థులకు సరైన ప్రాణాలికా సాధనతో 20 రోజులలో 100 మార్కులకు పైగా సాధించవచ్చు అన్నారు. పాఠ్యాంశాలను ఈజీ, మీడియం హార్డ్ గా విభజించుకొని కొద్దిపాటి సాధన తో మంచి మార్కులు సాధించవచ్చు అన్నారు. మే 4న జరిగే నీట్ పరీక్షకు సిద్దమవుతున్న ఖమ్మం విద్యార్థులు నీట్ ఫిజిక్స్ ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 7801023694, 9441481014 లను సంప్రదించాలన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు తీసుకోవలసిన జాగ్రత్తలు

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అగర కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**ప్రజా బలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 26:** జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధ్యక్షతన సరఫరాల జిల్లా మేనేజర్ సుగుణబాయి, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకళ, జిల్లా కోపరేటివ్ అధికారి వెంకట్ రెడ్డి సొసైటీ చైర్మన్లు దాన్ని సేకరణ కేంద్రాల ఇన్చార్జిలు మరియు రైస్ మిల్లుల యజమానులతో జిల్లాలో యాసంగి 2024-25 కాలానికి సంబంధించి ధాన్యం సేకరణ పై సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందుకుగాను రైతులకు వడ్లను తడి, తాలు మరియు దుమ్ము లేకుండా తూర్పార బట్టి, ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావలసిందిగా రైతులను చైతన్య పరచవలసిందిగా అధికారులను ఆదేశించినారు, మరియు వరి కోత సమయంలో వరి మార్పిడి యంత్రాల వారితో మాట్లాడి ఒక క్రమ పద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి వచ్చినట్లు చూసుకోవలసిందిగా కోరినారు. తదుపరి ఇతర రాష్ట్రాల నుండి వచ్చు ధాన్యమును ఎట్టి పరిస్థితులలో మన జిల్లాలోని కొనుగోలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సన్న వడ్లు కొనుగోలు సమయంలో ఒకే కేంద్రంలో సన్న వడ్లకు మరియు దొడ్డ వాడ్లకు ప్రత్యేక విభాగాలు ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని, సన్న వడ్లకు గన్ని బాగుల పైన ఎస్ అని అక్షరంతో పాటుగా జిల్లా మరియు సెంటర్ కోడు ఉండునట్లుగా చూసుకోవాల్సిందిగా సన్న వడ్ల లోడును దొడ్డువడ్ల లోడులను వేరువేరుగా రైస్ మిల్లులకు పంపాలని ఆ మేరకు రిజిస్ట్రేషన్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని ఆయా కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలను ఆదేశించినారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వం నియమాల ప్రకారం అన్ని రకాల ఏర్పాట్లు ఉండునట్లు చూసుకోవలసిందిగా ఆదేశించినారు. రైస్ మిల్లుల యజమానులను సన్న వడ్ల దిగుమతుల సమయంలో తగు జాగ్రత్తలు పాటించి వాటిని ప్రత్యేకంగా లాట్లు వేసి సపరేటు రిజిస్టర్లు పెట్టవలసిందిగా కోరుతూ రైస్ మిల్లుల వద్ద వడ్లు దింపుకొని సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూసుకోవాలని కోరినారు. రైతు తమ ధాన్యం అమ్మిన 48 గంటలలో నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు సమిష్టిగా పనిచేసి జిల్లాకు మరియు ప్రభుత్వానికి ధాన్యం కొనుగోలు విషయంలో మంచి పేరు తీసుకురావాలని కోరడం జరిగింది.

## ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి బీమా చెక్కు అందజేత

## ఏఎంసీ మార్కెట్ చైర్మన్ పుల్లూరు స్వప్న సదానందం



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మార్చి 26** ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు, జమ్మికుంట శాఖ యొక్క ఖాతాదారు అయిన బిజిగిరి షరీఫ్ గ్రామానికి చెందిన ముడుతనపెల్లి రాజు యొక్క కుటుంబ సభ్యులకు 1 లక్ష రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ముడుతనపెల్లి రాజు ఒక ప్రమాదంలో మరణించారు. మృతుడికి ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు యందు గల గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాదబీమా సౌకర్యం ద్వారా అతని తల్లి అయిన ముడుతనపెల్లి సుశీల కు 1లక్ష రూపాయల చెక్కును జమ్మికుంట అగ్రికల్చర్ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం, బ్రాంచి మేనేజర్ ఒద్దుల మహేంధర్ సీనియర్ ఆఫీసర్ పొల్లు ప్రవీణ్ కుమార్ ల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పుల్లూరి స్వప్న-సదానందం మాట్లాడుతూ ఖాతాదారులకు కనీస డిపాజిట్ తోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పేద, మధ్యతరగతి వినియోగదారులకు ప్రమాద భీమా కల్పిస్తూ వారికి అండగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. గాయత్రి బ్యాంకు వినియోగదారుల ఆర్థిక ప్రగతికి సహకారం అందిస్తుందని అభినందించారు. 24 గంటలు ఏటీఎం లలో నగదు అందుబాటులో ఉంచడం ద్వారా జమ్మికుంట మరియు పరిసర ప్రాంత ప్రజల నగదు అవసరాలను తీరుస్తుందని అన్నారు.

అనంతరం బ్రాంచ్ మేనేజర్ ఒద్దుల మహేంధర్ గారు మాట్లాడుతూ వినియోగదారులకు మైక్రో ఎటిఎం, ఏ ఈ పి ఎస్ సేవల ద్వారా వినియోగదారులకు చెల్లింపులు చేయడం జరుగుతుంది. తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపై గ్రాముకు అత్యధికంగా రూ? 5,500/- తో ఋణాలను అందిస్తున్నారని, అలాగే రైతులకు వ్యవసాయ రుణాలను కూడా అందిస్తున్నారని తెలియజేశారు. జమ్మికుంట పరిసర గ్రామాలలో 16 బ్యాంకింగ్ కరెస్పాండెంట్లను నియమించారని, తద్వారా పెన్షనర్లు మరియు ఇతర ఖాతాదారులు ఇట్టి బ్యాంకింగ్ కరెస్పాండెంట్ల వద్ద బ్యాంకు లావాదేవీలను నిర్వహించుకోవచ్చని తెలియజేశారు. సేవింగ్ ఖాతాలు ప్రారంభించుటకు కావలసిన ఫోటో, జిరాక్స్ ను బ్యాంకు యందే ఉచితంగా అందిస్తున్నామని, వ్యాపారస్తులకు వ్యాపార వృద్ధికై ఋణాలను అందిస్తున్నామని వినియోగదారులు ఇట్టి సౌకర్యాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు.

## గ్రామాల్లో తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి

- ఉపాధి హామీ కూలీలు కోరిన రోజులు పని కల్పించాలి
- రాజీవ్ యువశక్తి పథకం నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి
నూటికి నూరు శాతం పన్నులు వసూలు చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి (ప్రజాబలంమార్చ్ 26)** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం మర్పల్లి: పంచాయితీలలో ఉన్న ఇంటి పన్నులు, మరియు ఇతర పన్నులు నూటికి నూరు శాతం వసూలు చేయాలని, ఉపాధి హామీ కూలీలు వారు కోరినన్ని రోజులు పని కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం తహసిల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో రాజ మల్లయ్య, ఎంపీ ఓ లక్ష్మీకాంత్, ఏపీవో అంజిరెడ్డి లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ...గ్రామాలల్లో టాక్స్ కలెక్షన్ 100% శాతం వసూలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిలకు ఆదేశించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు శానిటేషన్ శుభ్రం చేయించాలన్నారు.

అంగన్వాడీ సెంటర్లు పర్యవేక్షించి ఎప్పటికప్పుడు నివేదికలు ఉన్నతాధికారులకు పంపాల న్నారు.

అంగన్వాడి సెంటర్ల చుట్టూ శుభ్రంగా ఉండేటట్లు చర్యలుతీసుకోవాలన్నారు.

గ్రామాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలు 100% జర్మినేషన్ వచ్చేలా,మొక్కలు పూర్తిస్థాయిలో ప్రతి జిపి కి 10000 మొలిచేలా చూడాలని,నర్సరీలకు పూర్తిస్థాయిలో షెడ్ నెట్ లు వేయించాలన్నారు.గ్రామాలలో తాగినీటి సమస్య లేకుండా చూడాలినీ నీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని తాగునీటి సమస్యను ముందస్తుగా గుర్తించి వాటిని నివారణ చర్యలు తొందరగా చేపట్టాలని.ఎప్పటికప్పుడు తాగునీటి సమస్యల పరిష్కారం కొరకు మిషన్ భగీరథ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయినాథ్ కు సమాచారం ఇవ్వాలనీ సూచించారు. ఉపాధి హామీ కార్డ్ కలిగివున్న ఉపాధి కూలీలందరికీ వాళ్లు అడిగిన అన్ని పని దినాలను కల్పించాలని ఆదేశించారు ఉపాధి వీళ్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువశక్తి పథకం పై ఉద్యోగులకు అవగాహన కల్పించాలని స్వశక్తితో ఎదిగేందుకు నిరుద్యోగులకు చక్కటి అవకాశం అని దీనిపై విస్తుతస్థాయి ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఆయా గ్రామపంచాయతీ పంచాయతీ కార్యదర్శిలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందించడమే లక్ష్యం

## బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

వేములవాడ, సిరిసిల్లలోని మహాలక్ష్మి వీధి, న్యూ అర్బన్ కాలనీ, ఇందిరా నగర్, గీతా నగర్లో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల పర్యటన



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి -26(ప్రజాబలం ప్రతినిధి)**బీసీ రిజర్వేషన్ ఫలాలు బి.సి. కులంలోని అందరికీ అందించడమే తమ లక్ష్యమని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ స్పష్టం చేశారు.పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మలి తదితర కులాల స్థితిగతులను తెలుసుకునేందుకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు జిల్లా పర్యటనకు విచ్చేసి, ముందుగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేములవాడ మహాలక్ష్మి వీధిలోని దొమ్మరి వారు, న్యూ అర్బన్ కాలనీలోని పిచ్చ గూంట్ల వారు, సిరిసిల్ల మార్కెట్ యార్డ్ సమీపంలో ఇందిరా నగర్ లోని పిచ్చ గూంట్ల వారు, గీతానగర్ సమీపంలోని దొమ్మరి వారితో సమావేశమయ్యారు.అంతకముందు ఉదయం వేములవాడలో తమ్మల కులం బాధ్యులతో మాట్లాడారు.తమ్మల పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వాలి .తమ్మల కులం వారితో బీసీ కమిషన్ బాధ్యులు మాట్లాడారు. తమ్మల కులానికి శూద్ర, నాన్ బ్రాహ్మణ్ పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వడం తో ఆలయాల్లో అర్చక, ఇతర ఉద్యోగాల్లో పొందడంలో ఇబ్బంది పడుతున్నామని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. తమకు తమ్మల పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

దొమ్మరి కులం పేరు మార్చాలి

కులం సర్టిఫికెట్లో తమ కులం పేరు ను గాడే వంశీయులు గా మార్చాలని దొమ్మరి కులం బాధ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వేములవాడ, సిరిసిల్లలోని వారి ఇండ్లు, ఆర్థిక, విద్యా స్థితిగతులను కమిషన్ చైర్మన్, సభ్యులు తిరిగి పరిశీలించారు. వారి ఉపాధి మార్గాలు, ఆదాయ స్థితి,విద్యా స్థితి పై ఆరా తీశారు. కులం పేరు దొమ్మరి ఉండడంతో తాము సమాజంలో ఇబ్బంది పడుతున్నామని వివరించారు.విద్యాలయాలు, ప్రభుత్వ సంస్థల్లో అవమానానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా

కమిషన్ చైర్మన్ మాట్లాడారు. దొమ్మరి కులం పేరు సమస్య పై అధ్యయనం చేసేందుకు ఇక్కడికి వచ్చామని తెలిపారు. విద్యా స్థితి వివరాలపై ఆరా.. అనంతరం వేములవాడ లోని న్యూ అర్బన్ కాలనీ, సిరిసిల్ల ఇందిరానగర్ లోని పిచ్చగూంట్ల (వంశరాజ్), పలువురు ఇండ్లలోకి వెళ్ళి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడారు. వారు చేస్తున్న పని, ఎన్ని కుటుంబాలు ఎందరు ఉన్నారో ఆరా తీశారు. నెలకు ఎంత ఆదాయం వస్తుంది? విద్యా స్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కులం పేరు పిచ్చగూంట్ల ఉండడంతో తాము సమాజంలో ఇబ్బంది పడుతున్నామని వివరించారు. విద్యాలయాలు, ప్రభుత్వ సంస్థల్లో అవమానానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ ఫలాలు కులంలోని అందరికీ అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించే బిల్లు కు శాసన సభలో ఆమోదింపజేసిందని తెలిపారు. కులం పేరిట ఇబ్బంది పడుతున్నవారు ఆత్మ న్యూనతా భావానికి గురికావద్దని పేర్కొన్నారు. పిల్లలను తప్పకుండా చదివించాలని, రిజర్వేషన్ ఫలాలు పొందాలని సూచించారు. ఆయా కులాల పేర్ల మార్పు అంశం వచ్చే నెలలో పరిష్కరిస్తామని తెలిపారు. బీసీ కులాల్లోని అందరికీ రాజ్యాంగ ఫలాలు అందించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల్లో పర్యటించామని గుర్తు చేశారు. త్వరలో మిగతా జిల్లాల్లో పర్యటించి, ఆయా బీసీ కులాల స్థితిగతులను నేరుగా తెలుసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని వివరించారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. బీసీ కులాల బాధ్యులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. తమ సమస్యలు పరిష్కరించాలని పలు కులాల ప్రతినిధులు బీసీ కమిషన్ చైర్మన్ కు విన్నవించారు. రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు పరిష్కరించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు.కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధా భాయ్, తహసీల్దార్లు విజయ్ ప్రకాష్ రావు, మహేష్ కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్ రావు, వివిధ బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందించడమే లక్ష్యం.

## బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్.

వేములవాడ, సిరిసిల్లలోని మహాలక్ష్మి వీధి, న్యూ అర్బన్ కాలనీ, ఇందిరా నగర్, గీత నగర్ లో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల పర్యటన.







**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బీసీ రిజర్వేషన్ ఫలాలు బీసీ కులంలోని అందరికీ అందించడమే తమ లక్ష్యం అని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ స్పష్టం చేశారు. పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మలి తదితర కులాల స్థితిగతులను తెలుసుకునేందుకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు జిల్లా పర్యటనకు విచ్చేసి, ముందుగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేములవాడ మహాలక్ష్మి వీధిలోని దొమ్మరి వారు, న్యూ అర్బన్ కాలనీ లోని పిచ్చకుంట్ల వారు, సిరిసిల్ల మార్కెట్ యాది సమీపంలోని ఇందిరానగర్ లోని పిచ్చగుంట్ల వారు, గీత నగర్ సమీపంలోని దొమ్మరి వారితో సమావేశమయ్యారు.

అంతకుముందు ఉదయం వేములవాడలో తమ్మల కులం బాధ్యులతో మాట్లాడారు.

తమ్మల పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వాలి. తంబల కులం వారితో బీసీ కమిషన్ బాధ్యులు మాట్లాడారు, తమ్మల కులానికి శూద్ర, నాన్ బ్రాహ్మణ్ పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వడంతో ఆలయాల్లో అర్చక, ఇతర ఉద్యోగాలు పొందడంలో ఇబ్బంది పడుతున్నామని కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. తమకు తమ్మల పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వాలని వారు కోరారు. తమ సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

దొమ్మరి కులం పేరు మార్చాలి.

కులం సర్టిఫికెట్ లో తమ కులం పేరును గాడే వంశీలుగా మార్చాలని దొమ్మరి కులం బాధ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వేములవాడ, సిరిసిల్లలోని వారి ఇండ్లు, ఆర్థిక, విద్యా స్థితిగతులను కమిషన్ చైర్మన్, సభ్యులు తిరిగి పరిశీలించారు. వారి ఉపాధి మార్గాలు, ఆదాయస్థితి, విద్యా స్థితిపై ఆరా తీశారు. కులం పేరు దొమ్మరి ఉండడంతో తమ సమాజంలో ఇబ్బంది పడుతున్నామని వివరించారు. విద్యాలయాలు, ప్రభుత్వ సంస్థల్లో అవమానానికి గురి అవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ దొమ్మరి కులం పేరు సమస్యపై అధ్యయనం చేశానికి ఇక్కడికి వచ్చామని వారు తెలిపారు.

విద్యా స్థితి వివరాలపై ఆరా..

అనంతరం వేములవాడలోని న్యూ అర్బన్ కాలనీ, సిరిసిల్ల ఇందిరానగర్ లోని పిచ్చగుంట్ల ( వంశరాజ్ ), పలువురు ఇండ్లలోకి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడారు. వారు చేస్తున్న పని, ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, ఎందరు వ్యక్తులు ఉన్నారు అని ఆరా తీశారు. నెలకు ఎంత ఆదాయం వస్తుంది? విద్యా స్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కులం పేరు పిచ్చగుంట్ల ఉండడంతో తమ సమాజంలో ఇబ్బంది పడుతున్నామని వారికి వివరించారు. విద్యాలయాలు, ప్రభుత్వ సంస్థల అవమానానికి గురవుతున్నమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మీడియాతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ ఫలాలు కులంలోని అందరికీ అందించడమే తమ లక్ష్మాన్ని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించే బిల్లుకు శాసనసభలో ఆమోదింప చేసింది అని తెలిపారు. కులం పేరుట ఇబ్బంది పడుతున్న వారు ఆత్మ న్యూ నత భావానికి గురికా వద్దని, పేర్కొన్నారు. పిల్లలను తప్పకుండా చదివించాలని, రిజర్వేషన్ ఫలాలు పొందాలని సూచించారు. ఆయా కులాల పేర్ల మార్పు అంశం వచ్చే నెలలో పరిష్కరిస్తామని తెలిపారు. బీసీ కులాలలోని అందరికీ రాజ్యాంగ ఫలాలు అందించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలో పర్యటించమని గుర్తు చేశారు. త్వరలో మిగతా జిల్లాలో పర్యటించి, ఆయా బీసీ కులాల స్థితిగతుల నేరుగా తెలుసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టిందని వివరించారు. అర్హత గలవారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ కులాల బాధ్యులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. తమ సమస్యలు పరిష్కరించాలని పలు కులాల ప్రతినిధులు తీసి కమిషన్ చైర్మన్ కు విన్నవించారు. రాజు యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు పరిష్కరించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని చూపించారు.

ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధా బాయ్, తాసిల్దార్ లో విజయ్ ప్రకాష్ రావు, మహేష్ కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజా మనోహర్రావు, వివిధ బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాగబాబు పదవికి బ్రేక్....



విజయవాడ మార్చి 26, జనసేన నేత నాగబాబు మంత్రిపదవికి బ్రేకులు పడినట్లు పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. కొద్దికాలం క్రితం పార్టీ పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని చెప్పారు. ఉగాది రోజున ఆయన మంత్రివర్గంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్న వార్తలు కూడా వచ్చాయి. కానీ అలాంటి వాతావరణం కనిపించకపోవడం ఇప్పుడు పార్టీలోనూ, జనసైనికుల్లోనూ చర్చనీయాంశమైంది. ఉగాదికి ఇంకా వారం రోజులు కూడా సమయం లేదు. దీనికి సంబందించిన అప్ డేట్ ఇంత వరకూ రాకపోవడంతో కొంత జనసైనికుల్లో ఆందోళన నెలకొంది. దీనిపై అధికారిక పర్యటన ఇటీవల కాలంలో కూడా రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. నాగబాబును తొలుత రాజ్యసభకు ఎంపిక చేయాలని భావించినా ఆ ఆలోచనను మానుకుని మంత్రివర్గంలోకి తీసుకుందామని పవన్ కల్యాణ్ డిసైడ్ అయ్యారు. తన సోదరుడు పార్టీకోసం పడిన కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇవ్వాలన్నది ఆయన నిర్ణయం. ఇందులో కుటుంబం, వారసత్వం, కులం వంటివి లేవని, కేవలం పనిచేసిన వారందరికీ వరసగా ప్రాధాన్యత ఇస్తామని చెబుతూ వస్తున్నారు. కానీ పిఠాపురంలో జరిగిన జనసేన ఆవిర్భావ వేడుకల తర్వాత కొంత మారినట్లు కనిపిస్తుంది. ఇద్దరం మంత్రివర్గంలో ఉండే కంటే నాగబాబుకు పార్టీ బాధ్యతలను అప్పగించి జిల్లాల పర్యటనలు చేయించాలన్న ఆలోచనలో పవన్ కల్యాణ్ ఉన్నట్లు చెబుతున్నారు. . తనకు తరచూ ఆరోగ్య సమస్యలు తలెత్తుతుండటంతో పార్టీపై ఫోకస్ పెట్టాలంటే నాగబాబు మంత్రిపదవి లో కంటే పార్టీలో కీలకంగా ఉంటేనే మంచిదన్న భావనలో పవన్ కల్యాణ్ ఉన్నారని చెబుతున్నారు. అందుకే నాగబాబుకు ఈ విషయం చెప్పినట్లు కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. జిల్లాలు తిరుగుతూ పార్టీని బలోపేతం చేయాలని నాగబాబుకు పవన్ కల్యాణ్ సూచించినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ కేబినెట్ లో ఒకటే ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. అందులోనూ నాగబాబు చేరిపోతే ఇక పార్టీని పట్టించుకునే వారు లేరు. నాదెండ్ల కూడా కేబినెట్ లో ఉండటం కూడా ఇందుకు కారణం. మరొకవైపు ఉగాది రోజున చంద్రబాబు ప్రతిష్టాత్మకైన పీ4 పథకం ప్రారంభించేందుకు అట్టహాసంగా పనులు మొదలు పెట్టడంతో ఇక నాగబాబుకు అమాత్య పదవి లేనట్లేనన్న కామెంట్స్ మాత్రం ఎక్కువగా వినిపిస్తున్నాయి.

జనసైనికుల్లో నిరాశలు

కూటమి ప్రభుత్వ హయాంలో జనసైనికులు అవమానాలు ఎదుర్కొంటున్నారా..?

పార్టీకోసం పనిచేస్తున్న నిఖార్సయిన కార్యకర్తల్ని జనసేన పట్టించుకోవడంలేదా..?

అధినేత సైలెంట్ గా ఉండటాన్ని జనసైనికులు జీర్ణించుకోలేకపోతున్నారా..?

ప్రస్తుతం సోషల్ మీడియాలో జనసైనికుల ట్వీట్లు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తోంది. తాజాగా సాయిబాబా అనే జనసైనికుడి ట్విట్టర్ అకౌంట్ లో పోస్ట్ చేసిన ఓ లేఖ వైరల్ గా మారింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ని ఉద్దేశించి సాయిబాబా లేఖ రాశారు. తనలాగే పార్టీలో చాలామంది కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారని సాయిబాబా వివరించారు. మరి ట్విట్టర్లో జనసైనికుడి ఆవేదన జనసేనాని వరకు చేరుతుందో లేదో చూడాలి.అన్న ఎంతో బాధ తో జనసేన పార్టీ పట్ల ప్రేమ తో నా చివరి ప్రయత్నం గా నేను చెప్పాలి అనుకున్నది ఈ లెటర్ లో రాసాను అది మీరు చదివి తగు చెర్యలు చెపడతారు అని ఆశిస్తున్నాను ????.

బరువెక్కిన గుండెలతో పార్టీ కి మరియు ఈ ట్విట్టర్ కి స్వస్తి ????

ఎవర్ని అయినా నా ఈ ప్రయాణం లో బాధించి? కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. కూటమి అంటే ఇక్కడ టీడీపీ, జనసేన, బీజేపీ అని చెప్పుకోవాలి. కానీ క్షేత్ర స్థాయిలో కూటమి అంటే టీడీపీ ప్రభుత్వం మాత్రమే అనే అర్థం ఉందని ముఖ్యంగా జనసైనికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు జనసేన అధికార పార్టీనా, ప్రతిపక్షమా అనేది అర్థం కావడంలేదని అంటున్నారు. ఎన్నికలకు ముందు ఎన్నో అవమానాలు భరించామని, ఎన్నికల తర్వాత కూటమి అధికారంలోకి వచ్చాక కూడా జనసైనికుల తలరాత మారలేదని వారు ఆరోపిస్తున్నారు.అసలు జనసేన ఎదుగుదలను పవన్ కల్యాణ్ పట్టించుకుంటున్నారో లేదో అనే అనుమానం వస్తోందని తన లేఖలో ప్రస్తావించారు సాయిబాబా అనే జనసైనికుడు. ఇటీవల తిరువూరు నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ ను వివరణ కోరుతూ జనసేన ఒక బహిరంగ నోటీసు ఇచ్చింది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో తనకు ప్రాణహాని ఉందని మీడియాతో చెప్పినందుకు వివరణ కోరింది. అలాంటి వ్యవహారం ఏదైనా ఉంటే ముందు పార్టీ దృష్టికి తీసుకురావాలి కానీ, మీడియాకెక్కడం మంచిది కాదని సూచించారు నేతలు. అదే సమయంలో 48 గంటల్లోగా ఎక్స్ ప్లెనేషన్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ ఆదేశాలను కూడా సాయిబాబా పరోక్షంగా తన లేఖలో ప్రస్తావించారు. అసలు జరిగిందేంటో తెలుసుకోవాలనే ఆలోచన ఉంటే.. సదరు తిరువూరు ఇన్ చార్జ్ ని పిలిపించి మాట్లాడేవారని, కానీ బహిరంగంగా నోటీసులివ్వడం ద్వారా ఆయన్ని చులకన చేశారని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా జనసేన కార్యకర్తల అరెస్ట్ లు ఆగలేదని, అయినా కూడా పార్టీ పట్టించుకోవడంలేదని అంటున్నారు సాయిబాబా. ప్రభుత్వం కేసులు పెట్టినా తమకు పెద్దగా బాధలేదని, అయితే పార్టీ ఆఫీస్ పట్టించుకోకపోవడం అత్యంత దారుణం అని అన్నారు. వైసీపీ వాళ్లు ఎన్ని విమర్శలు చేసినా జనసేన పార్టీ అధికారికంగా ఖండించడం లేదని ఆయన వాపోయారు. అదే సమయంలో కొంతమంది టీడీపీ వాళ్లు కూడా వైసీపీ వారితో చేరి పవన్ కల్యాణ్ పై లేనిపోని ఫేక్ ప్రచారం చేస్తున్నారని అన్నారాయన. తాను జనసేనకు, ట్విట్టర్ కి కూడా గుడ్ బై చెప్పేస్తున్నాని అన్నారు సాయిబాబా.పార్టీని కార్యకర్తలు పట్టించుకున్నంతగా, పార్టీ కార్యకర్తల్ని పట్టించుకోవట్లేదని తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు సాయిబాబా. పార్టీ బాగుంటే సరిపోదని, పార్టీలోని కార్యకర్తలు కూడా బాగుండాలని ఆయన సూచించారు. ఇన్నాళ్లూ పార్టీకోసం సిన్సియర్ గా కష్టపడ్డామని, ఆత్మాభిమానం చంపుకొని ఉండాలంటే తమ వల్ల కావడం లేదని అన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక్కసారయినా పవన్ కల్యాణ్ పార్టీ నాయకులతో, కార్యకర్తలతో మీటింగ్ పెట్టారా అని ప్రశ్నించారు. ఇకనైనా ఆ పని చేయాలని, వారిలోని అసంతృప్తి ఏంటో తెలుసుకోవాలని సూచించారు.సాయిబాబా అనే ట్విట్టర్ అకౌంట్ నుంచి పోస్ట్ అయిన ఈ లెటర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. చాలామంది ఈ లెటర్ పై సానుకూలంగా స్పందిస్తున్నారు. జనసేనలో ప్రస్తుతం ఇదే పరిస్థితి ఉందని, అధిష్టానం కాస్త దృష్టిపెట్టాలని వారు సూచిస్తున్నారు.

# అనంతలో అద్భుతం

అనంతపురం, మార్చి 26, గ్రామాల్లో తరచుగా వింతలు జరుగుతుంటాయి. కలలోకి దేవతలు వచ్చారని, ఫలానా పని చేయాలని కొందరు చెప్తూ ఉంటారు. కొన్నిసార్లు వాళ్లు చెప్పినట్లు చేస్తే ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వస్తాయి. తాజాగా ఏపీలో ఇలాంటి ఘటనే జరిగింది. ఓ యువకుడి కలలోకి అమ్మవారు వచ్చి.. ఫలానా చోట తవ్వితే తన విగ్రహం బయటపడుతుందని చెప్పిందట. గ్రామస్తులంతా కలిసి అమ్మవారు చెప్పిన చోటుకు వెళ్లి గునపాలతో తవ్వారు. ఆశ్చర్యకరంగా అమ్మవారి విగ్రహం బయటపడింది. దీంతో గ్రామస్తులంతా ఆ విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేయడం మొదలు పెట్టారు. ఇంతకీ అసలు ఏం జరిగిందటే..అనంతపురానికి చెందిన అంజి అనే యువకుడు గత కొద్ది రోజులుగా అమ్మవారు ఒంటి మీదికి వచ్చిందంటూ పూనకంతో ఊగిపోతున్నాడు. అంతేకాదు, గంగమ్మ అమ్మవారు తన కలలోకి వచ్చిందని చెప్పాడు. గౌరవ గార్డెన్ వాటర్ ట్యాంక్ సమీపంలో తవ్వితే విగ్రహాలు బయటపడతాయని చెప్పిందంటూ శిగం ఊగాడు. రెండు అడుగుల లోతుతో ఆ విగ్రహాలు ఉన్నాయని అమ్మవారు తనకు చెప్పిందని చుట్టుపక్కల వారితో చెప్పాడు. అతడి మాటలు నమ్మిన స్థానికులు వాటర్ ట్యాంక్ సమీపంలో తవ్వకాలు చేపట్టాలి అనుకున్నారు.తాజాగా స్థానికుల అంతా కలిసి పూజలు చేసి అంజి చెప్పిన ప్రాంతంలో పూజలు చేసి, విగ్రహాల కోసం తవ్వకాలు మొదలుపెట్టారు. చెప్పినట్లుగానే రెండు అడుగులు తవ్వగానే గంగమ్మ అమ్మవారి విగ్రహం బయటపడింది. స్థానికులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. అందరూ కలిసి అమ్మవారి విగ్రహాన్ని నీటితో కడిగి, పసుపు, కుంకుమ రాశారు. పూలు, నిమ్మకాయలు పెట్టి పూజలు చేస్తున్నారు.ఈ విషయం అనంతపురం అంతా వ్యాపించడంతో అమ్మవారిని చూసేందుకు ప్రజలు తరలి వస్తున్నారు. అమ్మవారిని చూసి విగ్రహం మీద పసుపు, కుంకుమ వేసి పూజలు చేస్తున్నారు. అందరినీ చల్లగా చూడాలని కోరుకుంటున్నారు. విగ్రహాలు బయటప పడటంతో అంజి చెప్పిన మాటలు నిజమేనని అందరూ భావిస్తున్నారు. ఆయనకు గంగమ్మ అమ్మవారు ఒంటి మీదికి వస్తున్నట్లు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఘటన అనంతపురంలో హాట్ టాపిక్ గా మారింది. మరోవైపు ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు స్థానికులు అంతా కలిసి అమ్మవారికి ఆలయం కట్టించాలని నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులు మొదలు పెడతామని చెప్తున్నారు. ఈ ఆలయంలో అంజినే పూజారిగా ఉంచాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఆయన మూలంగానే అమ్మవారు బయటకు వచ్చారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్తున్నారు.

# పాస్టర్ ప్రవీణ్ హత్య.. ప్రమాదమా

రాజమండ్రి, మార్చి26, పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. క్రైస్తవ మత ప్రచారకుడిగా, బోధకుడుగా ఆయన రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా సుపరిచితుడు. అలాంటి వ్యక్తి సడన్ గా చనిపోయారనే వార్త క్రైస్తవ సమాజం నమ్మలేకపోతోంది. అదే సమయంలో ఆయనది అనుమానాస్పద మృతిగా తేలడం ఇక్కడ సంచలనంగా మారింది.ప్రవీణ్ పగడాల విజయవాడనుంచి రాజమండ్రి వెళ్లి, రాజమండ్రి నుంచి రాజానగరం వెళ్లేటప్పుడు బుల్లెట్ పై వెళ్తూ రోడ్డుపక్కన చనిపోయి పడి ఉన్నారు. స్థానికులు కొందరు ఆవైపుగా వెళ్తూ ఆయన మృతదేహాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన డెడ్ బాడీ చూసినవారు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆయన్ని ఎవరో చంపి పడివేసి ఉంటారని ఆరోపణలు వినపడుతున్నాయి. ఆయన మృతదేహంపై గాయాలున్నాయని, పెదాలపై కూడా గాయాలున్నాయని, రాడ్డుతో కొట్టినట్టు గాయాలు కనపడుతున్నాయని అంటున్నారు. ప్రవీణ్ పగడాల మృతదేహాన్ని రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించగా అక్కడ క్రైస్తవ సోదరులు ధర్నా చేపట్టారు.ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆయన అభిమానులు, క్రైస్తవులు రాజమండ్రిలో ధర్నా చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మతోన్మాదులు ఆయన్ని చంపి ఉంటారని వారు అంటున్నారు. గంటలతరబడి రోడ్డుపై ఆందోళన చేస్తున్నా.. తమని ఎవరూ పట్టించుకోవట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే స్పందించాలని కోరారు. గతంలో ఆయన్ను చాలామంది బెదిరించేవారని, ఆయనపై దాడి చేస్తామని కూడా హెచ్చరించారని అంటున్నారు. ఇటీవల ప్రవీణ్ పగడాల కూడా తనపై దాడి జరిగే అవకాశం ఉందని అనుమానించారని, దానిపై ఆయనే ఒక వీడియో పోస్ట్ చేశారని చెబుతున్నారు. తనకు ప్రాణ భయం ఉందని ప్రవీణ్ పగడాల చెప్పినా కూడా పోలీసులు ఆయనకు రక్షణ కల్పించలేకపోయారని క్రైస్తవ మత ప్రచారకుడు, పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో సంచలనం రేపుతోంది. రాజమండ్రి దివాన్ చెరువు - కొంతమూరు జాతీయ రహదారిపై ప్రవీణ్ పగడాల మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. పక్కనే బైక్ ఉండటంతో బైక్ ప్రమాదంలో ప్రవీణ్ పగడాల చనిపోయినట్లు తొలుత భావించారు. అయితే ప్రవీణ్ పగడాల శరీరంపై గాయాలు కనిపించాయంటూ.. ఆయన అనుచరులు ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల.. రాజమండ్రికి ఎందుకు వెళ్లారనేదీ తెలియడం లేదు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి బైక్ మీద వెళ్తున్నారంటూ కొన్ని వార్తలు వస్తున్నాయి.బైక్ మీద వెళ్తున్న సమయంలో వెనుక నుంచి ఢీకొట్టి, దాడి చేసి ఉంటారంటూ ప్రవీణ్ పగడాల సన్నిహితులు, అనుచరులు ఆరోపిస్తున్నారు. ప్రవీణ్ పగడాల ఒంటిపై గాయాలు ఉండటంతో సమగ్ర విచారణ జరపాలని స్నేహితులు, అనుచరులు, కొంతమంది పాస్టర్లు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పోలీసులు కూడా పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై దర్యాప్తు జరుపుతున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ఘటనాస్థలికి వరకూ మొత్తం సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. మరోవైపు పాస్టర్ ప్రవీణ్ మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై వస్తున్న అనుమానాలపై విచారణ చేయాలని టీడీపీ నేత, మహాసేన రాజేష్ సైతం డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ప్రవీణ్ పగడాల క్రైస్తవ మత బోధకుడిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అనుచరుల్ని సంపాదించుకున్నారు. కడప జిల్లాతో ఆయనకు అనుబంధం ఉంది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ లో నివశిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బోధనకోసం ఆయ అప్పుడప్పుడు వివిధ ప్రాంతాలకు వస్తుంటారు. ఈ క్రమంలో రాజమండ్రి వద్ద కార్యక్రమాలకు వచ్చిన ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు తెలుస్తోంది.ప్రవీణ్ పగడాల మృతిపై పలువురు క్రైస్తవ మత ప్రచారకులుగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఒకప్పటి సినీ హీరో, ప్రస్తుతం మత ప్రచారకుడిగా ఉన్న రాజా కూడా ప్రవీణ్ పగడాల మృతిపై స్పందించారు. ఆయన ఒక వీడియో విడుదల చేశారు. ప్రవీణ్ మృతి బాధాకరం అని అన్నారు. ఆయన లేని లోటు తీరదని, భౌతికంగా మాత్రమే ఆయన క్రైస్తవ సమాజానికి దూరమయ్యారని చెప్పారు.

ఆయన కుటుంబం కోసం ప్రార్థన చేయాలంటూ పిలుపునిచ్చారు.ప్రవీణ్ పగడాల మరణంపై పోలీసులు ఇంకా క్లారిటీ ఇవ్వలేదు. ఆయన డెడ్ బాడీని స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టమ్ కోసం తరలించారు. ఈ విషయంలో పోలీసుల నుంచి ప్రకటన విడుదలైతే దీనిపై మరింత క్లారిటీ వచ్చే అవకాశముంది. అప్పటి వరకు ప్రవీణ్ పగడాల మృతిని ప్రమాదంగా ధృవీకరించలేం, అదే సమయంలో అది హత్య అనేది కూడా నిర్ధారించలేని పరిస్థితి.

# స్వరూపానందకు వారం రోజులు గడువు

విశాఖపట్టణం, మార్చి 26,విశాఖ శ్రీ శారదా పీఠం వ్యవహారం ఎంతవరకు వచ్చింది? కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్వరూపానంద స్వామి కనిపించడం మానేశారా? స్వామి కబ్జాల వ్యవహారం బయటకు వస్తోందా? బయటకు రావడం కంటే సైలెంట్‌గా ఉండడమే బెటరని అంచనాకు వచ్చారా? మరి జీవీఎంసీ నోటీసులకు స్పందన లేకుంటే కూల్చివేతలు ఖాయమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.వైసీపీ రూలింగ్‌లో రాజభోగం అనుభవించిన వారిలో శ్రీ శారదా పీఠం స్వరూపానంద స్వామి ఒకరు. భక్తుల మాట కాసేపు పక్కనబెడితే ఆయన ఆశీర్వాదం కోసం రాజకీయ నేతలు, అధికారులు తెగ తిరిగేవారు. అయినా స్వామి జగన్, కొందరు మంత్రులకు మాత్రమే కనిపించేవారు. ఆ తర్వాత ప్రత్యేకంగా కొందరితో మాత్రమే మాట్లాడేవారు.వైసీపీ పాలనలో వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను ఆక్రమించుకున్నారని స్వామిపై ఆరోపణలు లేకపోలేదు. దీనికితోడు స్వామికి ప్రత్యేకంగా భద్రత సైతం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు బాగా పరిపాలన చేస్తారంటూ రెండు ముక్కలు మాట్లాడారు. ధనుర్మాసం పూజలంటూ బయటకు వెళ్తానన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో సెటిలవుతానని చెప్పుకొచ్చారు.చివరకు స్వామి పత్తా లేకుండా పోయారు. ఇప్పుడు ఎక్కడ ఉన్నారో తెలీదు. స్వామి కోసం చాలామంది భక్తులు ఎదురు చూస్తున్నారు. స్వామి ఆశీర్వాదం తీసుకుంటే మంచి జరుగుతుందని కొందరు నమ్ముతారు. కూటమి వచ్చాక ఆయన భద్రతను పూర్తిగా తొలగించింది. ఇప్పుడు స్వామి కూడబెట్టిన ఆస్తులపై దృష్టిపెట్టింది.తాజాగా విశాఖ శ్రీ శారదా పీఠానికి గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ నోటీసులు ఇచ్చారు. రెవెన్యూ అధికారుల సర్వేలో 22 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు గుర్తించారు. అందులో శాశ్వత కట్టడాలు నిర్మించారు. వాటిని వారంలోగా తొలగించాలని నోటీసులో ప్రస్తావించారు అధికారులు. లేకుంటే తామే కూల్చివేస్తామని మఠం మేనేజర్‌కి వాటిని అందజేశారు.తొలగింపుకు అయ్యే ఖర్చు శారదాపీఠం నుంచే వసూలు చేస్తామన్నారు. చిన ముషిడివాడలో శ్రీశారదా పీఠం ఉంది. అందులో దాదాపు 22 సెంట్ల భూమి ప్రభుత్వ స్థలం ఉంది. అందులో 203 చదరపు గజాల స్వయం జ్యోతి మండపం ఉంది. 13 గజాల స్థలం సర్వే సంఖ్య 90లో ఉంది. మిగిలిన స్థలం సర్వే సంఖ్య 91/9లో వుడా లేఅవుట్‌కి సంబంధించిన ఓపెన్ స్పేస్‌లో ఉంది.190 చదరపు గజాల ప్రాంతంలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, వుడాకి సంబంధించి ఓపెన్ స్పేస్ ఉంది. ఓవరాల్‌గా చూస్తే శారదా పీఠంలో 9 శాశ్వత కట్టడాలు ఉన్నాయి. అందులో కొంత ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వం నోటీసులపై స్వామి నుంచి ఎలాంటి రియాక్షన్ లేదు. రేపో మాపో స్వరూపానందకు సంబంధించి ఇంకెన్ని కొత్త విషయాలు బయటకు వస్తాయో చూడాలి.

## ఆర్వోబీలతో మహర్ధశ

గుంటూరు, మార్చి 26, ఏపీలో కొత్తగా మరో ఆర్‌వోబీ నిర్మాణం కానుంది. ఏపీలో టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత.. పలు ప్రాజెక్టులకు మోక్షం కలుగుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు లభిస్తు?న్నాయి. ఈ క్రమంలోనే కేంద్రం నుంచి ఏపీకి మరో గుడ్ న్యూస్ అందింది. మంగళగిరిలో ఆర్‌వోబీ నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.129.18 కోట్లతో మంగళగిరి ఆర్వోబీ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఆ మేరకు నిధులు మంజూరు చేస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. మంగళగిరిలో ఆర్‌వోబీ నిర్మాణం చేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైల్వే శాఖను ఇటీవల అభ్యర్థించారు. కేంద్ర మంత్రి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రైల్వే శాఖ.. మంగళగిరిలో నాలుగు వరుసల ఆర్‌వోబీ నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేసింది.గుంటూరులోని గడ్డిపాడు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సైతం రైల్వేశాఖ ఇటీవల నిధులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. గడ్డిపాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 107.79 కోట్లు మంజూరు చేసింది. రైల్వే గేటు కారణంగా ఈ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో విజయవాడవైపు వెళ్లే వారికి నిరీక్షణ తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఆర్‌వోబీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. గుంటూరు-నంబూరు రైల్వేస్టేషన్ల మధ్య గడ్డిపాడు వద్ద నాలుగు వరుసలుగా దీనిని నిర్మిస్తారు. ఈ ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే పేరేచర్ల నుంచి విజయవాడ వెళ్లేవారికి అనుకూలంగా ఉంటుంది.

# స్మార్ట్ మీటర్ స్కాం...

ఏలూరు, మార్చి 25, కర్ణాటక ప్రభుత్వ విద్యుత్ శాఖలో భారీ కుంభకోణం చోటు చేసుకుందా? అంటే తాజాగా బీజేపీ ఆరోపణలను పరిగణలోకి తీసుకుంటే అవుననే అనిపిస్తోంది. అదటుంచి ఈ కుంభకోణం తీరును గమనిస్తే.. గతంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ నేతృత్వలోంని వైసీపీ ప్రభుత్వం ఎలాగైతే స్మార్ట్ మీటర్ల పేరిట భారీ స్కామ్ చేసిందని అప్పటి ప్రతి పక్షం టీడీపీ ఆరోపించిందో.. ఇప్పుడు కర్ణాటకలోనూ అలాగే జరుగుతోంది.కర్ణాటకలో స్మార్ట్ మీటర్ కొనుగోలులో ఏకంగా ?7,500 కోట్ల స్కాం జరిగిందని ప్రతిపక్షం బీజేపీ ఆరోపించింది. సదరు టెండర్‌ను తయారీదారులకు కాకుండా సరఫరాదారులకు కేటాయించడం వల్ల స్మార్ట్ మీటర్ల ధరలు భారీగా పెంచారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాదు, సాఫ్ట్‌వేర్ మద్దతునిచ్చే సంస్థ ఇప్పటికే బ్లాక్‌లిస్ట్ అయిన కంపెనీ అని విమర్శలు వచ్చాయి.ఇతర రాష్ట్రాలతో పోల్చితే కర్ణాటకలో స్మార్ట్ మీటర్ ధరలు భారీగా పెరిగాయి. ఏషియానేట్ న్యూస్‌కు లభించిన డాక్యుమెంట్ల ప్రకారం, సింగిల్ ఫేజ్ మీటర్ ధర ?950 నుంచి ?4,998కి పెరిగింది. మరో రకమైన సింగిల్ ఫేజ్ మీటర్ ధర ?2,400 నుంచి ?9,000కి పెరిగింది. త్రిఫేజ్ మీటర్ ధర అయితే ఏకంగా ?2,500 నుంచి ?28,000కి పెరిగింది. గతంలో ఏపీలోనూ ఇలాంటి ఆరోపణలే వచ్చాయి.ఆంధ్రప్రదేశ్ లో రూ.ఏడు వేలు మీటరును రూ.36 వేలు విక్రయించారని ఆరోపణలు వచ్చాయి. గతంలో టీడీపీ నేత.. సోమిరెడ్డి పేర్కొన్న వివరాల ప్రకారం.. ఇతర రాష్ట్రాలు ఒక్కో స్మార్ట్ మీటర్‌ను రూ.4 వేలకు కొంటుంటే వైసీపీ ప్రభుత్వం రూ.36 వేల కు కొనుగోలు చేసింది ఈ స్మార్ట్ మీటర్ల కొనుగోలులో రూ.17 వేల కోట్ల అక్రమాలు జరిగాయి. ఈ భారాన్ని అప్పటి ప్రభుత్వం కరెంటు బిల్లుల్లో వేసి వసూలు చేయాలని నిర్ణయించింది. పొలాల్లో వ్యవసాయ బావులకు వాడుతున్న మోటార్లకు కూడా స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, మోటార్లకన్నా మీటర్ల ధర రెట్టింపు ఉందని అన్నారు. 'రాజస్థాన్‌లో స్మార్ట్ మీటర్ ధర, నిర్వహణ కలిపి రూ.7900 కోట్ చేశారు. ఛండీగఢ్ ప్రభుత్వ కంపెనీ రూ.7100 కోట్ చేసింది. మన రాష్ట్రంలో మాత్రం స్మార్ట్ మీటర్ ధర, నిర్వహణ కలిపి ఏకంగా రూ.36,975కు టెండర్ ఖరారు చేశారు. అని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్‌కు ?900 సబ్సిడీ ఇస్తోంది. ఇతర రాష్ట్రాల్లో ఈ మొత్తాన్ని టెండర్ కంపెనీలకు మంజూరు చేసి, ప్రజలపై భారం తగ్గించగా, కర్ణాటక ప్రభుత్వం మాత్రం మొత్తం డబ్బును టెండర్ సంస్థలకు చెల్లించడంతోపాటు వినియోగదారుల నుంచి కూడా అధిక వసూళ్లు చేపట్టింది. ఒక్కో మీటర్‌పై ?9,260 అదనంగా ఖర్చు అవుతోందని ఏషియానేట్ ప్రత్యేక నివేదిక వెల్లడించింది.బెస్కాం, మెస్కాం, హెస్కాం, జెస్కాం, సెస్కాం కలిసి మొత్తం 8 లక్షల స్మార్ట్ మీటర్ల కోసం ?7,408 కోట్ల అదనపు వ్యయం అయింది. ఈ భారీ మొత్తాన్ని ఎవరికి లాభంగా మళ్లించారు? ఏ కారణంతో స్మార్ట్ మీటర్ల ధరలు భారీగా పెంచారు? టెండర్‌లో జరిగిన గోల్‌మాల్‌కు ఎవరు బాధ్యత వహించాలి? ఈ ప్రశ్నలు సంధిస్తూ హౌస్ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని ప్రతి పక్షం బీజేపీ డిమాండ్ చేస్తోంది.

## ఏపీలో ఏప్రిల్ నెలలో
## 'మన ఇంటికి మన మిత్ర' కార్యక్రమం

అమరావతి :ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ పై అవగాహన కల్పించడానికి ఏప్రిల్ నెలలో 'ప్రతి ఇంటికి మనమిత్ర' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి స్మార్ట్ఫోన్లలో 9552300009 నంబర్ను సేవ్ చేసి సేవల గురించి వివరిస్తారని ఎంఢీఉ శాఖ కార్యదర్శి భాస్కర్ వెల్లడించారు. ప్రస్తుతం 210 సేవలు అందుతున్నాయని చెప్పారు. అన్ని రకాల ధ్రువపత్రాలను వాట్సాప్లోనే అందిస్తామని తెలిపారు.

# పోసాని ఎక్కే గుమ్మం... దిగే గుమ్మం...

విజయవాడ, మార్చి 26పోసాని కృష్ణమురళికి బెయిల్ లభించింది. కానీ ఆ ఆనందం ఆయనకు ఎక్కువ రోజులు నిలవలేదు. ప్రతి సోమవారం తో పాటు గురువారం సిఐడి కార్యాలయానికి వచ్చి సంతకాలు చేయాల్సి ఉంది. సిఐడి కోర్టు బెయిల్ ఇచ్చినప్పుడే ఈ షరతు పెట్టింది. దీంతో పోసాని కృష్ణ మురళికి బెయిల్ అయితే లభించింది కానీ.. కేసుల నుంచి విముక్తి కలిగేలా కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. గత నెల 26న ఆయన అరెస్ట్ అయ్యారు. కేసుల మీద కేసులు నమోదయ్యాయి. కస్టడీల మీద కస్టడీలు కొనసాగాయి. చివరకు 24 రోజుల అనంతరం ఆయన జైలు నుంచి విముక్తి పొందారు.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు పోసాని కృష్ణ మురళి. ఫోటో మార్ఫింగ్ చేసి సైతం ఆయన కామెంట్స్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. తొలుత ప్రకాశం జిల్లా పోలీసులు గత నెల 26న హైదరాబాదులో కృష్ణ మురళిని అదుపులోకి తీసుకున్నారు. అది మొదలు ఆయనపై కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి. ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లా జైలులకు తరలిస్తూ ఆయన కస్టడీ 24 రోజులు పాటు కొనసాగింది. కొద్ది రోజుల కిందట అన్ని కేసులలో ఆయనకు బెయిల్ లభించింది. కానీ ఇంతలో సిఐడి పీటి వారెంట్ ఇచ్చింది. దీంతో పోసానిని కర్నూలు నుంచి గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. అయితే న్యాయస్థానంలోనే తనకు ఆరోగ్యం బాగా లేదంటూ పోసాని కృష్ణ మురళి కన్నీటి పర్యాంతం అయ్యారు. అయినా సరే అప్పట్లో న్యాయస్థానం ఆయన రిమాండ్ ను కొనసాగించింది.ఈ నెల 21న పోసాని కృష్ణ మురళి సిఐడి కోర్టులో బెయిల్ పిటిషన్ వేశారు. మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. దీంతో కోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. రెండు లక్షల పూచికత్తుతో ఆయనకు బెయిల్ ఇచ్చింది కోర్టు. ప్రతి సోమ, గురువారాల్లో సిఐడి కార్యాలయానికి వచ్చి సంతకం చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. మీడియాతో కేసుల గురించి అస్సలు మాట్లాడకూడదు అని సూచించింది. అదే సమయంలో పోసాని కృష్ణ మురళికి సిఐడి విచారణకు సహకరించాలని కూడా ఆదేశాలు ఇచ్చింది. దీంతో పోసాని కృష్ణ మురళికి ఉపశమనం దక్కలేదని తేలిపోయింది. తదుపరి కొనసాగింపు కూడా ఉంటుందని స్పష్టమైంది.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పోసాని కృష్ణ మురళి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కాస్త యాక్టివ్ గానే కనిపించారు. అయితే ఉన్నట్టుండి ఆయన ఓ రోజు కీలక ప్రకటన చేశారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని తేల్చేశారు. ఇకనుంచి రాజకీయాలు మాట్లాడనని కూడా చెప్పుకొచ్చారు. అయితే గతంలో పోసాని కృష్ణ మురళి చేసిన కామెంట్స్ ను టిడిపి, జనసైనికులు మరిచిపోలేదు. అందుకే పాత కేసులు తెరపైకి వచ్చాయి. పోసాని అరెస్టు జరిగింది. ఆయనకు బెయిల్ లభించింది. అయితే అది మనశ్శాంతి లేని బెయిల్ అని తేలిపోయింది. సో ముమ్ముందు పోసాని వ్యవహార శైలి బట్టి కేసుల తీవ్రత ఉంటుందని విశ్లేషకులు సైతం తేల్చి చెబుతున్నారు.

ఇక పీకల్లోతు కష్టాల్లో బోరుగడ్డ

బోరుగడ్డ అనిల్ కుమార్(విషయంలో హైకోర్టు తీవ్ర వ్యాఖ్యానాలు చేసింది. ఆయన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో బోరుగడ్డ మరోసారి కేసుల ఉచ్చులో పడాల్సి వచ్చింది. గత వైసిపి ప్రభుత్వంలో కూటమినేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడేవారు బోరుగడ్డ. వ్యక్తిగత కామెంట్లకు సైతం వెనుకడుగు వేసే వారు కాదు. చాలా రకాలుగా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, చంద్రబాబు, లోకేష్ లపై వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబ పరంగా కూడా విమర్శలు చేశారు. అనుచిత వ్యాఖ్యలు కొనసాగించారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు చుక్కలు కనిపిస్తున్నాయి. తాజాగా కోర్టు ధిక్కరణ కింద కూటమి ప్రభుత్వానికి ఆయన అస్త్రం అందించారు. దానిపైనే కేసులు నమోదు కావడంతో ఆయన హైకోర్టు ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది.రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండేవారు బోరుగడ్డ. ఆ సమయంలో తన తల్లికి అనారోగ్యం ఉందంటూ ఆయన మధ్యంతర బెయిల్ పొందారు. అయితే సకాలంలో రాజమండ్రి జైల్లో తిరిగి లొంగిపోలేదు. అదే ఇప్పుడు ఆయనకు ఇబ్బందికరంగా మారింది. పోలీసులు అనిల్ కుమార్ పై హైకోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు బోరుగడ్డ ఎందుకు సకాలంలో జైల్లో లొంగి పోలేదని ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో బోరుగడ్డ ఇరకాటంలో పడినట్లు అయ్యింది. వాస్తవానికి బోరుగడ్డ లొంగి పోవాల్సింది ముందు రోజు సాయంత్రం. కానీ ఆయన తరువాత రోజు ఉదయం రాజమండ్రి జైలుకు వచ్చి సరెండర్ అయ్యారు. దీంతో రాజమండ్రి జైలు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. బోరుగడ్డకు నోటీసులు జారీ చేసింది.బోరుగడ్డ లొంగిపోవడం వెనుక పెద్ద ఎపిసోడ్ నడిచింది. తన తల్లి అనారోగ్యానికి సంబంధించి సమర్పించిన డాక్టర్ ధృవీకరణ పత్రం ఫేక్ అని పోలీసులు గుర్తించారు. వెంటనే వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారణలో ఉండగానే.. బెయిల్ గడువు ముగిసింది. ఇంతలోనే తనకు బెయిల్ పొడిగించాలని మరోసారి బోరుగడ్డ కోర్టును ఆశ్రయించారు. దీనిపై సైతం కోర్టు విచారణ చేసింది. కానీ పోలీసులు బలమైన ఆధారాలు సమర్పించడంతో బెయిల్ పొడిగించడం కుదరదని తేల్చి చెప్పింది. అంతేకాదు ఎక్కడున్నా సరే.. అత్యవసరంగా వచ్చి అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది.

దీంతో జైలు అధికారుల ముందు లొంగిపోయారు బోరుగడ్డ. కానీ ఆయనపై పోలీసులు నమోదు చేసిన నకిలీ డాక్టర్ సర్టిఫికేట్ కేసు సహా.. హైకోర్టును తప్పుదోవ పట్టించారన్న కేసులు మాత్రం విచారణలో ఉన్నాయి. తాజాగా వీటిపై విచారణ జరిపిన కోర్టు.. బూరుగడ్డ వంటి వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమని.. ఇలాంటి వారిని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది.ప్రధానంగా తప్పుడు డాక్టర్ సర్టిఫికెట్ సమర్పించి మధ్యంతర బెయిల్ పొందిన వైనంపై విచారణ నివేదికలను సీల్డ్ కవర్లో కోర్టు ముందు ఉంచాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది.

నిర్దేశించిన సమయంలోపు జైలు అధికారుల ముందు ఎందుకు హాజరు కాలేదు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది కోర్టు. దీనిపై ప్రత్యేకంగా పిటిషన్ వేయాలని.. కేసు నమోదు చేయాలని ఆదేశించడం గమనార్హం.

# బొలివియాలోనూ... నిత్యానందుడి ఆరాచకాలు

హైదరాబాద్, మార్చి 26, కైలాస దేశాన్ని సృష్టించడం ద్వారా ప్రపంచం మొత్తాన్ని ఆశ్చర్యపరిచిన స్వయం ప్రకటిత సన్యాసి నిత్యానంద మరోసారి వార్తల్లో నిలిచారు. నిత్యానంద ఇప్పుడు కైలాస సరిహద్దులను విస్తరించాలనుకుంటున్నాడని చెబుతున్నారు. ఇందుకోసం దక్షిణ అమెరికాలోని బొలీవియాపై దాడి చేశారు. నిత్యానంద తన శిష్యులతో కలిసి అక్కడ 4.8 లక్షల హెక్టార్ల భూమిని ఆక్రమించారు. ఈ సమాచారం అందిన వెంటనే, భారతదేశం నుండి బొలీవియా వరకు ప్రభుత్వాలు కార్యాచరణలోకి దిగాయి.నిత్యానంద తోపాటు అతని శిష్యులు మొదట బొలీవియాలోని గిరిజనుల భూమిని మోసపూరితంగా కొనుగోలు చేశారు. భూమిని కొనుగోలు చేసిన తర్వాత, నిత్యానంద దానిని కైలాస విస్తరణగా ప్రకటించడానికి ప్రయత్నించాడు. కానీ అంతకు ముందే భూమి కొనుగోలు వార్త మీడియాకు లీక్ అయింది. నిత్యానంద, ఆయన శిష్యులు కలిసి బొలీవియాలోని 4 లక్షల 80 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని తమ పేర్లపైకి మార్చుకున్నారని ఆరోపించారు. ఈ భూమిని 1000 సంవత్సరాలకు లీజుకు తీసుకున్నట్లు పత్రాలు సృష్టించుకున్నారు. భూమికి లీజు మొత్తం సంవత్సరానికి రూ. 8.96 లక్షలు, నెలవారీ మొత్తం రూ. 74,667, రోజువారీ మొత్తం రూ. 2,455 గా ప్రతిపాదించారు.ఈ మేరకు బొలీవియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ, బొలీవియా "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస" అని పిలువబడే దేశంతో దౌత్య సంబంధాలను కొనసాగించడం లేదని, ఎందుకంటే అంతర్జాతీయ సమాజంలో మరే ఇతర దేశం కూడా వారిని ఒక దేశంగా గుర్తించలేదని పేర్కొంది. అంతర్జాతీయ కథనాల ప్రకారం, కైలాస ప్రతినిధులు భూమిని స్వాధీనం చేసుకోవడానికి బొలీవియాలో చాలా నెలలుగా ఉన్నారు. ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి స్థానిక నాయకుల సహాయం తీసుకున్నారు. ఒప్పందం ఖరారైన తర్వాత, నిత్యానంద బృందం ప్రజల నుండి ఒప్పందంపై సంతకం చేయించుకుంది.అయితే, ఈ వార్త వెంటనే స్థానిక మీడియాకు లీక్ అయింది. మీడియాలో వార్తలు వచ్చిన తర్వాత, నిత్యానంద, అతని శిష్యులు స్థానిక జర్నలిస్టులను బెదిరించారని, అయతే ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగినప్పుడు, నిత్యానంద ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేసిందని చెబుతున్నారు.2019 నుండి భారతదేశం నుండి పరారీలో ఉన్నాడు. అతనిపై అనేక తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. దేశం విడిచి పారిపోయిన నిత్యానంద కైలాస అనే నకిలీ దేశాన్ని స్థాపించారు. దానికి సొంత కరెన్సీ, రాజ్యాంగం ఉందని చెప్పుకుంటున్నారు. 2010 సంవత్సరంలో, నిత్యానందకు సంబంధించిన ఒక అశ్లీల సీడీ బయటకు వచ్చింది. దాని కారణంగా అరెస్టు కూడా చేశారు పోలీసులు. 2012లో నిత్యానందపై అత్యాచారం కేసులు నమోదయ్యాయి. 2019లో, ఇద్దరు బాలికలను కిడ్నాప్ చేసి బందీగా ఉంచినందుకు నిత్యానందపై కేసు నమోదైంది. ఇక తర్వాత నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. నిత్యానంద దేశం విడిచి పారిపోవడం

# తెరపైకి మరో భార్య బాధితుడు

బెంగళూరు, మార్చి 26, చెన్నై టెక్ బిలియనీర్ ఇంటి వ్యవహారం రచ్చకెక్కింది. లక్ష కోట్ల కంపెనీలకు అధిపతి అయిన ప్రసన్న శంకర్ భార్య బాధితుడు అయ్యాడు. ఆయన వ్యక్తిగత జీవితం హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ హెచ్ఆర్ టెక్ స్టార్టప్ 'రిప్లింగ్' సహ వ్యవస్థాపకుడు, అనేక స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన ప్రసన్న శంకర్ నారాయణ ప్రస్తుతం తన భార్య దివ్య శశిధర్ తో విడాకుల వివాదంలో చిక్కుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేస్తారేమోనని భయపడి ప్రస్తుతం తాను పరారీలో ఉన్నానని ప్రసన్న శంకర్ నారాయణ స్వయంగా సోషల్ మీడియాలో పోస్టు చేశారు.. దీంతో ఇది దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో పోలీసులు ఈ విషయంపై స్పందించారు.. తాము అరెస్టు చేయమని చెప్పడంతో ఈ వివాదానికి కాస్త బ్రేక్ పడినట్లయింది.. ఈ క్రమంలో ప్రసన్న శంకర్ పోలీసులపై కూడా పలు ఆరోపణలుచేశారు.హెచ్ఆర్ టెక్ స్టార్టప్ 'రిప్లింగ్' సహ వ్యవస్థాపకుడు, అనేక స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడిదారుడిగా ప్రసన్న శంకర్ నారాయణ వ్యవహరిస్తున్నారు. ప్రసన్న శంకర్ నారాయణ, దివ్య దంపతులు.. వారికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో అమెరికా కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలైంది. దివ్య, అమె కుమారుడు అమెరికా పౌరులు. ఈ నేపథ్యంలో, భరణంగా నెలకు తొమ్మిది కోట్ల రూపాయలు చెల్లించాలని దివ్య డిమాండ్ చేయగా, దీనిపై చర్చలు జరుగుతున్నాయి. టెక్ వ్యవస్థాపకుడు ప్రసన్న శంకర్ సోషల్ మీడియాలో సంచలన ఆరోపణలు చేశారు. తన నుండి విడిపోయిన భార్య, చెన్నై పోలీసులు తనను వేధిస్తున్నారని ఆరోపించారు. తిరుచ్చిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి పట్టభద్రుడయిన శంకర్, సింగపూర్‌కు చెందిన క్రిప్టో సోషల్ నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు. తన భార్యకు వివాహేతర సంబంధం ఉందని తెలుసుకున్న తర్వాత తనకు కష్టాలు ఎదురయ్యాయని ఆరోపించాడు. తన భార్య ద్రోహానికి ఆధారాలు దొరికిన తర్వాత, ఆమె విడాకుల కోసం భారీగా పరిహారాన్ని కోరిందని శంకర్ పేర్కొన్నాడు. చర్చలు నిలిచిపోయినప్పుడు, ఆమె తనపై గృహ హింస ఆరోపణలు చేస్తూ తప్పుడు పోలీసు ఫిర్యాదు దాఖలు చేసిందని ఆరోపించాడు. భారతదేశంలో కాకుండా అమెరికాలో విడాకుల కోసం దాఖలు చేయడం ద్వారా ఆమె ప్రయోజనం పొందడానికి ప్రయత్నించిందని, ఎందుకంటే భారతదేశంలో తాను విడాకులకు దరఖాస్తు చేసుకున్నానని కూడా అతను చెప్పాడు. ప్రసన్న శంకర్ నారాయణ, దివ్య దంపతులు. వారికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో అమెరికా కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలైంది. దివ్య, ఆమె కుమారుడు అమెరికా పౌరులు. ఒప్పందంలోని నిబంధనల ప్రకారం, అతను తన భార్యకు సుమారు రూ.9 కోట్ల రూపాయలు, అలాగే నెలకు రూ.4.3 లక్షలు చెల్లించాల్సి ఉంది, అదే సమయంలో వారి కొడుకు ఇద్దరి కస్టడీలో ఉండాలి. తన భార్య దివ్యకు వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయమై గొడవలు జరిగాయని అంటున్నాడు ప్రసన్న. తన కుమారుడిని కిడ్నాప్ చేసినట్టు దివ్య ఫిర్యాదు చేసిందని, అంతర్జాతీయ పిల్లల అక్రమ రవాణాకు సంబంధించిన సెక్షన్లతో కేసు నమోదైందని తెలిపాడు. అమెరికా పోలీసులు, కోర్టు ఈ ఆరోపణలను విచారించి, అవి నిరాధారమైనవని తేల్చి తనకు అనుకూలంగా తీర్పునిచ్చాయన్నాడు. ఆ తర్వాత కూడా నేను దాడి చేసి అత్యాచారం చేసినట్టు, నగ్న వీడియోలు సర్క్యులేట్ చేస్తున్నట్టు దివ్య తనపై సింగపూర్ లో ఫిర్యాదు చేయగా, సింగపూర్ పోలీసులు తనకు క్లీన్ చిట్ ఇచ్చారని తెలిపాడు.అమెరికా కోర్టు ప్రసన్నకు ప్రతి వారాంతంలో కుమారుడితో గడిపేందుకు అనుమతినిచ్చింది. వారం క్రితం దివ్య తన కుమారుడితో అమెరికా నుంచి చెన్నైకి వచ్చింది. అమెరికా కోర్టు ఆదేశాల మేరకు, ప్రసన్న తన స్నేహితుడు గోకుల్ ద్వారా కుమారుడిని వీకెండ్ లో తీసుకువెళ్ళాడు. అయితే, దివ్య తన కుమారుడిని ప్రసన్న కిడ్నాప్ చేశాడని చెన్నై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే కుమారుడు తనతో సంతోషంగా ఆడుకుంటున్నాడని ప్రసన్న సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. దివ్య ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయని పోలీసులు, డబ్బుల కోసం డిమాండ్ చేశారని ప్రసన్న ఆరోపించారు. కొడుకును కిడ్నాప్ చేసినట్టు తన భార్య దివ్య ఫిర్యాదు చేయడంతో, ప్రస్తుతం తాను చెన్నై పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నానని. పోలీసులు ట్రాక్ చేస్తున్నారని ప్రసన్న శంకర్ వాపోయాడు. ప్రసన్న శంకర్ ఒక కామ పిశాచి అని దివ్య సంచలన ఆరోపణలు చేశారు. రహస్యంగా మహిళల వీడియోలు రికార్డు చేసేవాడని తెలిపారు. ఈ కారణంగానే అతడు సింగపూర్ లో అరెస్టయ్యాడని, ఆ తర్వాత విడుదలయ్యాడని చెబుతున్నారు. ఏది ఏమైనా వీరి వ్యవహారం ప్రస్తుతం రచ్చకెక్కింది. విడాకులకు దారి తీసిన పరిస్థితులను తన ఎక్స్ వేదికగా వెల్లడించాడు ప్రసన్న శంకర్ నారాయణ? తన భార్య దివ్యకు వివాహేతర సంబంధం ఉందని.. దీనిపై గొడవలు జరిగాయని తెలిపాడు.. తన భార్య తనపై అత్యాచారం, గృహ హింస, అపహరణ ఆరోపణలు చేసిందని.. పోలీసులలోని తన సంబంధాలను ఉపయోగించుకుని నిరాధారమైన ఆరోపణలతో తనను హింసించిందని ప్రసన్న శంకర్ ఆరోపించారు.అయితే భర్త ప్రసన్న శంకర్ నారాయణపై భార్య దివ్య సంచలన ఆరోపణలు చేశారు. ప్రసన్న శంకర్ నారాయణ ఒక కామపిశాచి అని, రహస్యంగా మహిళల వీడియోలు రికార్డు చేసేవాడని ఆరోపించారు. ప్రసన్న శంకర్ నారాయణ, దివ్య దంపతుల విడాకుల వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## నకిరేకల్ పిఎస్ లో కేటీఆర్ పై కేసు నమోదు

నల్గొండ నకిరేకల్ పోలీసు స్టేషన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కేసు నమోదయింది. టెన్త్ పరీక్షలో మాస్ కాపీయింగ్ నిందితులతో మున్సిపల్ చైర్మన్ కు సంబంధాలు ఉన్నాయని కేటీఆర్ ట్వీట్ చేసారు. దాంతో కేటీఆర్ పైన నకరికల్ మున్సిపల్ చైర్మన్ రజిత శ్రీనివాస్ పిర్యాదు చేసారు. తమపై తప్పుడు ఆరోపణలు చేశారని పిర్యాదులో పేర్కొన్నారు. కేటీఆర్ పై నకిరేకల్ పీఎస్ లో రెండు కేసులు నమోదు అయ్యాయి.


# పొంచి ఉన్న ఆయిల్ సంక్షోభం...

పశ్చిమాసియాలో ఎలాంటి సంఘర్షణలు ఎదురైనా భారతీయ వాణిజ్య రంగానికి సంక్షోభం తప్పదు. చమురు, సహజ వాయువు, ఎరువులు, తదితర ముఖ్య అవసరాలు సరిగ్గా సరఫరా కాక, వాణిజ్యంలోనే కాదు, ప్రజల జీవన విధానంలో కూడా ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా చమురు సంక్షోభం సంభవిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర ఒక్కసారిగా పెరిగిపోతుంది. మనకు ఎఉ?కవగా చమురును, గ్యాస్‌ను సరఫరా చేసేది రష్యా, ఇరాన్ దేశాలే. ఆయా దేశాల నుంచి సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే మన దేశం భారీగా అంతర్జాతీయ మార్కెట్‌కు మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో రష్యా నుంచి మనదేశానికి ముడి చమురు దిగుమతులు రోజువారీ సరాసరిన (మిలియన్ పెర్ డే) 1.41 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశం. జనవరి నాటికి రోజువారీ 1.49 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోగా అంతకన్నా ఇప్పుడు తగ్గడం గమనార్హం. కార్గో ట్రాకింగ్ ఏజెన్సీ వోర్టెక్స్ వివరాల ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో రోజువారీ మొత్తం 4.77 మిలియన్ బ్యారెళ్లుగా చమురు దిగుమతులు జరిగాయి. జనవరిలో రోజువారీ మొత్తం 4.76 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతులు కాగా పెద్దగా మార్పు లేదు. అయితే ఈ మార్చి, ఏప్రిల్ నెలల్లో మరింతగా చమురు దిగుమతులు క్షీణిస్తాయని వోర్టెక్స్ చెబుతోంది. దీనికి కారణం అమెరికా ఆఫీస్ ఆఫ్ ఫారెస్ అసెట్స్ కంట్రోల్ (ఒఎఫ్ఎసి) జనవరి 10 న విధించిన ఆంక్షలే.అయితే ఈ లోటును పశ్చిమాసియా దేశాలు భర్తీ చేస్తాయని ఎపిఎసి అనాలిసిస్ వోర్టెక్స్ అధినేత ఇవాన్ మేథ్యూ వెల్లడించారు. రష్యా చమురు ఉత్పత్తిదారులైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సర్గుట్ నెఫ్ట్ గ్యాస్‌లతో పాటు దాదాపు 180 ట్యాంకర్లపై తాజాగా జనవరి 10న అమెరికా ఆంక్షలు విధించింది. రష్యాకు రెవెన్యూ రాకుండా అడ్డుకోవడమే దీని వెనుక ఉన్న ఆంతర్యం. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగించడానికే రష్యా ఈ ఆదాయాన్ని ఖర్చు పెడుతోందని అమెరికా ఆరోపిస్తోంది. ఫలితంగానే రష్యా చమురు కార్గో నౌకలు ఫిబ్రవరి 27 నాటికి అమెరికా ఆంక్షల సుడిలో చిక్కుకోవలసి వచ్చింది.2024 మొదటి ఏడు మాసాలు (జనవరి జులై) ఇజ్రాయెల్, జోర్డాన్, లెబనాన్ దేశాలకు భారత్ నుంచి వాణిజ్యంలో సంఘర్షణలు తప్పలేదు. భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు 63.3 శాతం వరకు ఎగుమతులు పతనమయ్యాయి. దీని విలువ 1.3 బిలియన్ డాలర్లు. ఆర్గానిక్ కెమికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, డైమండ్స్, ఎగుమతులకు గండి పడిందని వాణిజ్య విభాగం వెల్లడించింది. అలాగే జోర్డాన్‌కు ఎగుమతుల్లో 38 శాతం అంటే 638 మిలియన్ డాలర్ల వరకు, లెబనాన్‌కు 7% అంటే 198 మిలియన్ డాలర్ల వరకు ఎగుమతులు పతనమై భారత్‌కు నష్టాలు సంభవించాయి.2024 వరకు అంతకు ముందు ఏడేళ్లుగా ఏటా 3% వంతున ముడిచమురు ఉత్పత్తిలో తగ్గుదల కనిపిస్తోంది. ఉత్పత్తిలో తగ్గుదల ఉంటున్నా వినియోగం పెరుగుతుండడంతో భారత్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తోంది. 2017 నుంచి 2024 వరకు 86 నుంచి 89 శాతం వరకు దిగుమతులపైనే దేశం ఆధారపడవలసి వచ్చింది. భారత ఇంధన వినియోగ చిత్ర 2024 ఆర్థిక సంవత్సర నివేదికలో ఇదో భాగం. దేశం ఇంధనాన్ని సేకరించడం, ఉత్పత్తి, వినియోగం తాలూకు ఆమూలాగ్ర డేటాను ఈ నివేదిక అందిస్తోంది. కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ నేతృత్వంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ (బిఇఇ)ఈ నివేదికను రూపొందించింది.2024 ఆర్థిక సంవత్సరంలో మొత్తం సరఫరా అయిన ఇంధనం 910 మిలియన్ టన్నులు కాగా, ఇందులో బొగ్గు నుంచి 60%, చమురు నుంచి 28%, గ్యాస్ నుంచి 7%, శిలాజేతర వనరుల నుంచి 5% సరఫరా అయింది. స్వదేశీ చమురు ఉత్పత్తి 2017 ఆర్థిక సంవత్సరంలో 36 మిలియన్ టన్నులు కాగా, 2024 నాటికి 29.4 మిలియన్ టన్నులకు తగ్గిపోయింది. వార్షిక రేటు 3% వరకు తగ్గుతూ వస్తోంది. ఈ తగ్గుదలకు అనేక కారణాలు దోహదం చేస్తున్నాయి. ఈ కొరతను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు 2019లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ లైసెన్సింగ్ (హెచ్ఇఎల్‌పి) వంటి ప్రక్రియను అమలుచేసే చర్యలను తీసుకుంది.ఎంపికైన చమురు క్షేత్రాల్లో తగిన సాంకేతిక విధానాలు అమలు చేసి చమురు ఉత్పత్తిని సాధించడమే ఈ విధానం లక్ష్యం. చిన్న, మధ్యతరహా స్థాయిలో చమురు పరిశోధనలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ద్వారా ఆయా సంస్థలను ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ నిర్వహణలోని ఒఎన్‌జిసి, ఆయిల్ ఇండియా సంస్థలు క్రమంగా 65 శాతం, 11 శాతం వరకు 20232024 సంవత్సరంలో చమురును అందించగలిగాయి. మిగతా 24 శాతం ముడిచమురు ఉత్పత్తి ప్రొడక్షన్ షేరింగ్ కాంట్రాక్ట్ (పిఎస్‌సి) లేదా రెవెన్యూ షేరింగ్ కాంట్రాక్ట్ (ఆర్ఎస్‌సి) ద్వారా లభించింది. 2024 ఏప్రిల్ 1 నాటికి సమతుల్యతలో తిరిగి పొందగలిగిన చమురు నిల్వలు 671.4 మిలియన్ టన్నులుగా భారత్ అంచనా వేసింది. అంతకు ముందు సంవత్సరం నాటి 669.47 మిలియన్ టన్నుల నిల్వలతో పోల్చుకుంటే 0.3 శాతం ఎక్కువ.స్వదేశీ చమురు ఉత్పత్తి కన్నా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో చమురు దిగుమతులపై ఆధారపడడం మరింత ఎక్కువ అవుతుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద చమురు దిగుమతి దారైన భారత్ 2024లో 234 మిలియన్ టన్నుల చమురును సేకరించుకోగలిగింది. సరఫరా కావలసి చమురులో 86% 2017లోను, 89% 2024 లోనూ దిగుమతి చేసుకోవలసి వచ్చింది. కొవిడ్ మహమ్మారి సమయంలో చమురు దిగుమతులు తాత్కాలికంగా 202122 లో తగ్గాయి. భారీ స్థాయిలో దిగుమతి చేసుకున్నామంటే రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం భారీగా పెరుగుతున్నట్టే భావించక తప్పదు. 2024 ఏప్రిల్ 1నాటికి ఏడాదికి 256.8 మిలియన్ టన్నుల చమురును రిఫైనింగ్ చేసే సామర్థ్యం భారత్‌కు ఉందని తేలింది. దీంతో ప్రపంచంలో అమెరికా, చైనా, రష్యా తరువాత నాలుగో రిఫైనర్‌గా భారత్ నిలుస్తోంది.

# హీటెక్కుతున్న పాలిటిక్స్...

హైదరాబాద్, మార్చి 26, తెలంగాణలో అటు బీఆర్ఎస్ ఇటుబీజేపీ మధ్యలో కాంగ్రెస్ ఇలా ప్రధాన పార్టీలు ప్రత్యర్థి పార్టీల నేతలపై వరుస ఫిర్యాదులు చేస్తుండటంతో రాజకీయ వేడి మరింత పెరిగింది. తాజాగా బీఆర్ఎస్ సోషల్ మీడియా యాక్టివిస్టులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు బీజేపీ నేతలు.. తప్పుడు పోస్టులతో ప్రజలను బీఆర్ఎస్ సోషల్ మీడియా యాక్టివిస్టులు తప్పుదోవ పట్టిస్తున్నారని.. వారి పోస్టులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది బీజేపీ. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలతో రెండు పార్టీల మధ్య వివాదం తీవ్రమైంది.ఈ వ్యాఖ్యలపై మండిపడుతున్న బీఆర్ఎస్ నాయకులు.. కేసీఆర్‌పై బండి సంజయ్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారని ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ స్థాయి మరచి అసత్య ఆరోణలు చేస్తున్నారని మండిపడ్డారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్.దొంగ నోట్ల ప్రెస్‌పై గతంలోనూ కేసీఆర్‌పై ఆరోపణలున్నాయని తాజాగా బండి సంజయ్ వ్యాఖ్యలను మరోసారి సమర్థించారు బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు..అంతకుముందు కేసీఆర్ పై గవర్నర్‌కు గజ్వేల్ కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు .. గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకావడం లేదని, ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఫిర్యాదులతో తెలంగాణ పాలిటిక్స్ హీటెక్కుతున్నాయి.. మొత్తానికి పార్టీల ఫిర్యాదుల పరంపరకు ఎప్పుడు బ్రేక్ పడుతుందో తెలియాలంటే.. వేచి చూడాల్సిందే అంటున్నాయి పొలిటికల్ వర్గాలు..

# రోడ్డు ప్రమాదంలో 13 మందికి తీవ్ర గాయాలు



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది బుధవారం తెల్లవారుజామున విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న భారీ కంటైనర్ ను వెనుక నుండి ఆరంజ్ ట్రావెల్ , సాయి కృష్ణ ట్రావెల్స్ బస్సులు ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో 13 మందికి తీవ్ర గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా వుంది. క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రి తరలించారు. .. అరెంజ్ ట్రావెల్ బస్సు డ్రైవర్ క్యాబిన్ లో ఇరుక్కు పోవడం తో క్రేన్ సహాయం తో బయటకు తీసారు. ఘటనతో జాతీయ రహదారి పై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పాడింది. సంఘటన స్థలానికి ఏసీబీ మధుసూదన్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్ రెడ్డి చేరుకొని సుమారు రెండు గంటల పాటు శ్రమించి వాహనాలను తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేసారు. సిన పోలీసులు.

# ఆరు పథకాల అమలు కాలేదని బీజేపీ నిరసన

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామన్న ఆరు పథకాలు అమలుపరచలేదని పెద్ద ఎత్తున మహిళల నుండి దరఖాస్తులను సేకరిస్తున్న బిజెపి శ్రేణులు ఈ కార్యక్రమంలో మునుగోడు బిజెపి కన్వీనర్ దూదలబిక్షం, శాగ చంద్రశేఖర్ రెడ్డి, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

తరువాత బీజేపీ నాయకులు మాట్లాడుతూ

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా ఆరు పథకాలు అమలు పరచాలని మరియు ఆసరా పింఛన్లు 4000 రూపాయలు మహిళలకు 2500 రూపాయలు ఇస్తామని చెప్పి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతున్న అమలుపరచలేదని దానికి నిరసనగా మునుగోడు నియోజకవర్గంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో దరఖాస్తుల స్వీకరిస్తున్నాం ఈ కార్యక్రమానికి మహిళల నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తుంది... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అమలుపరిచే వరకు బిజెపి పార్టీ ప్రజల తరఫున పోరాడుతుందని తెలిపారు.

# అప్పులు ఉన్నా ఐటీ ఠీవి

## తెలంగాణపై లోకసభలో కేంద్రమంత్రి

హైదరాబాద్, మార్చి 26, తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా ఎదుగుదల పథంలో ఉన్నప్పటికీ, దాని అప్పుల భారం గురించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో కీలక వివరాలను వెల్లడించింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ప్రకారం, తెలంగాణ రాష్ట్ర అప్పు ప్రస్తుతం రూ.4,42,298 కోట్లుగా ఉంది. ఈ మొత్తంతో దేశంలోని రాష్ట్రాల అప్పుల జాబితాలో తెలంగాణ 24వ స్థానంలో నిలిచింది. ఈ అప్పులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెచ్చినప్పటికీ, అదే సమయంలో రాష్ట్రంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. గత ఆరు సంవత్సరాల్లో 10,189 ఐటీ కంపెనీలు ప్రారంభమవ్వడం దీనికి నిదర్శనం.కేంద్ర మంత్రి హర్ష మల్హోత్రా ఇచ్చిన సమాచారం ప్రకారం, ఈ కంపెనీలు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చాయి. గత ఐదేళ్లలో ఈ సంస్థల ద్వారా రూ.14,865 కోట్ల టర్నోవర్ సాధించడం గమనార్హం. అయితే, అదే కాలంలో 3,369 ఐటీ సంస్థలు మూతపడటం కూడా ఆందోళనకర విషయం. ఈ గణాంకాలు తెలంగాణలో ఐటీ రంగం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, దాన్ని నిలబెట్టుకోవడంలో సవాళ్లు ఉన్నాయని సూచిస్తున్నాయి.రాష్ట్రంలో అప్పులు పెరగడానికి వివిధ కారణాలు ఉండవచ్చు. మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఇతర ఖర్చులు ఇందులో భాగంగా ఉంటాయి. అయినప్పటికీ, ఐటీ రంగం ద్వారా వచ్చే ఆదాయం ఈ అప్పుల భారాన్ని తగ్గించే దిశగా ఒక అవకాశంగా కనిపిస్తోంది. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చడంలో సాధించిన విజయం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అయితే, సంస్థలు మూతపడకుండా నిరంతరం వృద్ధిని కొనసాగించేందుకు వ్యూహాత్మక చర్యలు అవసరం.మొత్తంగా, తెలంగాణ ఆర్థిక స్థితి ఒక వైపు అప్పుల భారంతో కొనసాగుతుండగా, మరోవైపు ఐటీ రంగంలో అవకాశాలతో సమతుల్యం పాటిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను సమర్థవంతంగా నిర్వహించగలిగితే, భవిష్యత్తులో ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది. ఐటీ కంపెనీల సంఖ్యను పెంచడంతో పాటు వాటి దీర్ఘకాలిక ఉనికికి ప్రణాళికలు రూపొందించడం ద్వారా అప్పులను నియంత్రించే దిశగా అడుగులు వేయవచ్చు.

# అధికారుల అత్యుత్సాహం

అదిలాబాద్, మార్చి 26, మంచిర్యాల జిల్లా కేంద్రంలో మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. జిల్లా కేంద్రంలోని వంద ఫీట్ల రోడ్డులో నివాసముంటున్న ఓ దళిత కుటుంబంపై శనివారం సాయంత్రం మున్సిపల్ అధికారులు, సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇంటి పన్ను కట్టలేదని కుటుంబాన్ని బయటకు రమ్మని, మహిళ అని కూడా చూడకుండా వారి కోడలు పిల్లలను లోపల ఉండగానే దౌర్జన్యంగా గేటుకు తాళం వేసినట్లు బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులు గడువు ఇవ్వాలని కోరిన మాట వినలేదని చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్నామని చెప్పినా పట్టించుకోకుండా నానా హంగామా చేసి పరువు తీశారని వాపోయారు. దళితులమనే చిన్న చూపుతోనే మున్సిపల్ అధికార యంత్రాంగం హేళన చేసి పరువు తీశారని, మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘించి తమను మనస్తాపానికి గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.ట్యాక్స్ కట్టలేదని చెప్పడానికి ఇద్దరు, ముగ్గురు వచ్చినా సరిపోతుంది కదా చాలా మంది ఎందుకు వచ్చారని అడగటంతో ఇంటి వద్ద గొడవ జరిగింది. ఇష్టం వచ్చినట్లు మాట్లాడకూడదని, నోటీసులు ఇచ్చి వెళ్లిపోవాలని బాధిత కుటుంబం కోరింది. పైసలు కట్టకపోతే రౌడీయిజం చేయడానికి వచ్చారా అని స్థానికులు మంచిర్యాల మున్సిపల్ అధికారులు, సిబ్బందిని నిలదీశారు. బకాయి ఉంటే ప్రశ్నించండి, నోటీసులు ఇచ్చి వెళ్లిపోవాలి కానీ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడం ఏంటని నిలదీశారు. ప్రజల్ని కొట్టి, వారి మీద దాడిచేసి డబ్బులు వసూలు చేయడానికి రావడం ఏంటని ప్రశ్నించారు.మీరు అధికారుల్లాగ ప్రవర్తించండి, రౌడీలు, గూండాల మాదిరగా అంత మంది రావడం ఏంటి, వచ్చి సామాన్యులపై రౌడీయిజం సరికాదని స్థానికులు అన్నారు. పర్మిషన్ ఉంటే మాత్రం ఐడీ కార్డులు వేసుకుని చాలా మంది ఒక్క ఇంటి మీదకు వచ్చి గుండాయిజం చేసి, వారి ఇంటి గేటుకు తాళం వేయడం సరికాదంటూ అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. బిల్లులు చెల్లించకపోయినా, ట్యాక్స్ కట్టకపోయినా ప్రజలకు దాని వల్ల ఏం నష్టం జరుగుతంది, ఏ ప్రయోజనాలు కోల్పోతారో చెప్పాలి కానీ దౌర్జన్యం సరికాదని అధికారులకు హితవు పలికారు. మంచిర్యాలలో జరిగిన ఘటన జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది'మేం దళిత సామాజిక వర్గానికి చెందిన వాళ్లం. మున్సిపల్ అధికారులు 15 నుంచి 20 మంది వరకు మా ఇంటి మీదకు వచ్చారు. మున్సిపల్ టాక్స్ కట్టలేదు. మీ టైం అయిపోయింది అన్నారు. మాకు ఒక్కరోజు టైం ఇవ్వండి సార్ అని అడిగాం. కోడలు, పిల్లలు లోపలు ఉన్నారు. అనారోగ్యం వల్ల పైసలు కట్టలేకపోతున్నాం. కొంచెం టైం ఇస్తే బకాయి పైసలు కట్టే?స్తం సార్ అంటే వినలేదు. బతిమిలాడినా వినకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది మా గేటుకు తాళం వేశారు. పక్కింటి వాళ్లు మా బాధలేక సాయం చేయడానికి వచ్చారు. దళితులం అయినందుకే మా కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలని చూశారు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని' గుర్రంస్వామి కోరారు

## 3న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణ రథోత్సవ వేడుకలు

తుగ్గలి మండల పరిధిలోని గల ఎద్దులదొడ్డి గ్రామం నందు మార్చి 3న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణ రథోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు. గురువారం తెల్లవారుజామున పంచభూతాల సాక్షిగా వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు అశేష జన వాహిని మధ్య శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు.4వ తేదీ శుక్రవారం రోజున వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు.కావున భక్తాదులందరూ పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణ రథోత్సవాలను విజయవంతం చేయాలని గ్రామ ప్రజలు తెలియజేశారు.

# ఎవరికి ఎర్త్... ఎవరికి బెర్త్...

హైదరాబాద్, మార్చి 26, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తవుతుంది. దీంతో మంత్రివర్గ విస్తరణ గురించి కొంతకాలంగా ప్రచారం జరుగుతూనే ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఎప్పుడెప్పుడు మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని ఆశావాహులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణకు సమయం ఆసన్నమైంది. ఉగాది సందర్భంగా ఈ విస్తరణ జరిగే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ నివాసంలో కీలక సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు నేతలు హాజరైన ఈ భేటీలో మంత్రివర్గ విస్తరణపై చర్చలు జరిగాయి. పార్టీ అధిష్ఠానం ఈ విషయంలో నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఎవరికి కట్టబెట్టాలనే దానిపైనా అధిష్ఠానం ఓ అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది.కొత్త మంత్రివర్గంలో రెండు బీసీ, ఒక రెడ్డి, ఒక ముస్లిం, ఒక ఎస్సీ సామాజిక వర్గాలకు అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. బీసీ కోటాలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్లు వినిపిస్తుండగా, ఎస్సీ కోటాలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి పేరు ప్రముఖంగా ఉంది. రెడ్డి కోటాలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మధ్య పోటీ నెలకొంది. మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ మీర్ అమీర్ అలీఖాన్‌కు అవకాశం ఉండగా, ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన విజయశాంతి పేరు కూడా చర్చలో ఉంది.అయితే, ప్రస్తుత మంత్రివర్గంలోని ఇద్దరు మంత్రులను తొలగించే అవకాశం ఉందని సోషల్ మీడియాలో ఊహాగానాలు సాగుతున్నాయి. మంత్రి కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావును తప్పించే సూచనలు కనిపిస్తున్నాయి. వరుస వివాదాల్లో చిక్కుకున్న కొండా సురేఖ పదవి కోల్పోతారనే చర్చ పార్టీ వర్గాల్లోనూ జరుగుతోంది. కొత్త మంత్రివర్గ జాబితా మరో రెండు రోజుల్లో బయటపడే అవకాశం ఉంది. ఈ విస్తరణతో రేవంత్ రెడ్డి టీమ్‌లో కొత్త ఊపు వస్తుందని కాంగ్రెస్ శ్రేణులు ఆశిస్తున్నాయి.

నలుగురికి అవకాశం

తెలంగాణలో కేబినెట్ విస్తరణకు సమయం ఆసన్నమైంది. ఈమేరకు కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక చొరవ చూపుతోంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ అగ్రనేతలైన రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, మీనాక్షి నటరాజన్, కేసీ వేణుగోపాల్‌లతో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సమావేశంలో క్యాబినెట్‌లో నలుగురు కొత్త మంత్రులను చేర్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ఈ నిర్ణయం ఉందని తెలుస్తోంది.కొత్తగా మంత్రులుగా చేరనున్న వారిలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జి. వివేక్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఉన్నట్లు సమాచారం. ఈ నలుగురూ విభిన్న సామాజిక వర్గాల నుంచి వచ్చినవారు కావడం గమనార్హం. వాకిటి శ్రీహరి ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ బీసీలకు ప్రాధాన్యతనిచ్చే కాంగ్రెస్ విధానాన్ని ప్రతిబింబిస్తారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రోడ్లు?భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోదరుడిగా, పార్టీలో సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. జి. వివేక్, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతగా, పార్టీకి కొత్త ఊపు తెచ్చే అవకాశం ఉంది. సుదర్శన్ రెడ్డి నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రాంతీయ సమతుల్యతను సాధించేందుకు ఎంపికయ్యారు.ప్రస్తుతం తెలంగాణ క్యాబినెట్‌లో 12 మంది మంత్రులు ఉండగా, గరిష్టంగా 18 మంది వరకు ఉండే అవకాశం ఉంది. ఈ విస్తరణతో ఆరు ఖాళీల్లో నాలుగు భర్తీ కానున్నాయి. ఈ చర్చల్లో ప్రాంతీయ, సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, గత ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ విస్తరణతో పార్టీలో అసంతృప్తిని తగ్గించి, ప్రభుత్వ పనితీరును మరింత బలోపేతం చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.

ఈ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఒరవడిని సృష్టించనుంది. కొత్త మంత్రుల ఎంపికతో ప్రభుత్వంలో సమతుల్యత, సామాజిక న్యాయం స్పష్టంగా కనిపించనున్నాయి.

# బీసీ ఉచ్చులో బీజేపీ

హైదరాబాద్, మార్చి 26, బీసీ రిజర్వేషన్ బిల్లు శాసన సభలోను, శాసన మండలిలో ఆమోదం పొందింది. ఇక బీసీ రిజర్వేషన్లు పెరగనున్నాయి. ఇప్పటి దాకా విద్య ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో బీసీలకు 29 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. దాన్ని పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా కుల గణన నిర్వహించింది. ఈ గణనలో 56.36 శాతం బీసీలు రాష్ట్రంలో ఉన్నట్లు తేలింది. ఈ మేరకు బీసీలకు 42 శాతానికి రిజర్వేషన్ల పెంచుతూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు సంబంధింత బిల్లులకు చట్ట సభలు ఆమోద ముద్ర వేశాయి. అంటే ఇక నుంచి విద్యా సంస్థల్లో, ప్రభుత్వ నియామకాల్లో, అదే రీతిలో పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పోరేషన్ వంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల ఫలాలు బీసీలకు దక్కనున్నాయి. ఇంతటితో పని పూర్తి అయినట్లు కాలేదు. కేవలం రాష్ట్ర ప్రభుత్వంలోని చట్ట సభలు బిల్లుకు ఆమోద తెలిపి కేంద్రానికి పంపనుంది.దేశంలో రిజర్వేషన్ల పెంచాలన్నా, తగ్గించాలన్నా, ఆయా కులాల జాబితాను మార్చాలన్నా రాష్ట్రాలకు అధికారం లేదు. ఈ అంశం కేంద్ర జాబితాలోది. కేంద్రమే నిర్ణయం తీసుకోవాలి. ఇక చట్ట సభల ఆమోదం పొందిన ఈ రిజర్వేషన్ల పెంపు బిల్లును రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపనుంది. ఆ బిల్లును పార్లమెంట్ మూడింట రెండు వంతుల మెజార్టీతో ఆమోదించాలి. ఎందుకంటే సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ప్రకారం ఎస్సీ,ఎస్టీ, బీసీలకు ఇచ్చే రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు. అలా మించితే రాజ్యాంగ సవరణ చేసి షెడ్యూల్ -9లో చేర్చాలి. ఈ రిజర్వేషన్లు బీసీలకు రిజర్వేషన్ పెంచి ఇస్తే ప్రస్తుతం ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10 శాతం కలుపుకుంటే మొత్తం 67 శాతానికి చేరుకుంటుంది. ఇది సుప్రీం కోర్టు తీర్పులకు వ్యతిరేకం. అలా సవరణ చేయాలంటే అందుకు సరైన కారణాలు వెల్లడించారు. అందుకు తగిన గణాంక సమాచారం అందుబాటులో ఉంటే అప్పుడు తగిన కారణాలతో రిజర్వేషన్లు 50 శాతం కంటే ఎక్కువగా పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయి. ఈ కారణలతోనే రేవంత్ సర్కార్ బీసీ కమిషన్ ఏర్పాటు చేసి లీగల్‌గా ఎదుర్కనే రీతిలో పటిష్టంగానే బీసీ గణన చేపట్టింది. సమగ్ర కుటుంబ సర్వే తర్వాతనే బీసీ లెక్కలను తెల్చి చెప్పింది. ఆ తర్వాత చట్టసభల్లో ఈ బిల్లులకు ఆమోద ముద్ర పడింది. ఇక ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల పెంపు బంతి కేంద్రం కోర్టులో పడేసింది. పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మద్దతు ఇస్తే రాజ్యాంగ సవరణ వీలవుతుంది. అప్పుడే రాష్ట్రంలో పెంచిన బీసీ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి.కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందే బీసీ గణన చేపడతామని చెప్పింది. బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ ముఖ్యనేత రాహుల్ గాంధీ చెప్పారు. తెలంగాణ ఎన్నికల్లో ఇదే ప్రస్తావించారు. అందుకు అనుగుణంగా రేవంత్ సర్కార్ ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపింది. అయితే దేశవ్యాప్త కులగణన విషయంలో మోదీ సర్కార్ సానుకూలంగా స్పందిస్తుందా అన్నది వేచి చూడాలి. ఎందుకంటే పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీసీలంతా ఐక్యంగా ఉండాలని, బీసీ లెక్కలు అవసరం లేదన్న రీతిలో మోదీ నర్మగర్భంగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇప్పుడు తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు పెంపు బిల్లుకు ఆమోద ముద్ర వేస్తే అది కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా ఓ అస్త్రంగా మారనుంది. తెలంగాణలో కాంగ్రెస్ ను గెలిపించినందుకు మేం బీసీలకు మేలు చేసేలా రిజర్వేషన్లు పెంచామని, పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టింది చేసి చూపించామని చెప్పుకునే పరిస్థితి ఉంటుంది. అలా బీసీ ఓటు బ్యాంకు కాంగ్రెస్‌కు దగ్గరయ్యే అవకాశం లేకపోలేదు. ఇలా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేలా మోదీ సర్కార్ తెలంగాణ బీసీ రిజర్వేన్ల పెంపు బిల్లుకు సానుకూలంగా స్పందిస్తుందా లేదా చూడాలి.తెలంగాణ బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుకూలంగా ఎన్డీఏ ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తే తేనె తుట్ట కదిపినట్లే. ఇదే రీతిలో అన్ని రాష్ట్రాల నుంచి రిజర్వేషన్ల పెంచాలన్న డిమాండ్లు వస్తాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి ఈ సమస్య ఎదురుకావచ్చు. ఒక వేళ ఈ రిజర్వేషన్ల బిల్లుపై ఎలాంటి చర్చ లేకుండా పక్కన పెడితే బీసీ వ్యతిరేక పార్టీగా బీజేపికి తెలంగాణలోను, దేశవ్యాప్తంగా ముద్రపడే అవకాశం ఉంటుంది. ఇలాంటి డిమాండ్లే ఏపీ నుంచి, ఇతర ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నుంచి వచ్చే అవకాశం ఉంది. వారిని కాదని కేంద్రంలో బలహీనంగా ఉన్న బీజేపీ పార్టీ నిర్లయం తీసుకోలేని పరిస్థితి. ఒక వేళ తీసుకుంటే ఆ సక్సెస్ తన ఖాతాలో పడుతుందా లేక మొదటి నుంచి బీసీ రాగం వినిపించిన కాంగ్రెస్ ఖాతాలో పడుతుందా అన్న డైలమా కమలనాథుల్లో లేకపోలేదు. రానున్న రోజుల్లో ఈ బీసీ ఉచ్చు నుంచి బీజేపీ ఎలా తప్పుకుంటుందో వేచి చూడాలి. అయితే తెలంగాణలోని రాజకీయ పార్టీలను తీసుకుని ప్రధానికి కలవాలని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ రిజర్వేషన్ల బిల్లు ఎందాక ముందుకు సాగి ఆచరణలోకి వస్తుందో మాత్రం వేచి చూడాలి.

## వైరల్ అవుతున్న కోమటిరెడ్డి కామెంట్స్

హైదరాబాద్, మార్చి 26, కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనను మించిన నేత లేరన్న భావనలో ఉన్నట్లుంది. మంత్రి వర్గ విస్తరణపై కోమటిరెడ్డి చేసిన కామెంట్స్ ఇప్పుడు కాంగ్రెస్ లో కాక రేపుతున్నాయి. తనకు మంత్రి పదవి వస్తుందని అనుకుంటున్నానని అనడం వరకూ ఓకే కానీ, సామర్థ్యాన్ని బట్టి మంత్రులను ఎంపిక చేయాలని కోరడంలో ఆంతర్యమేంటని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. భువనగిరి పార్లమెంటు నియోజవర్గంలో జరిగిన ఎన్నికలు జరిగితే తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించానని తలిపారు. అదే సమయంలో ప్రజల పక్షాన తాను నిలబడతానని అన్న కోమటిరెడ్డి తనకు హోంశాఖ అంటే ఇష్టమంటూ మనసులో మాటను బయటపెట్టారు. అయితే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక విషయం గుర్తుంచుకోవాల్సి ఉంటుంది. 2018 ఎన్నికల్లో మునుగోడు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచి పార్టీ నాయకత్వంపై అలిగి బీజేపీలోకి వెళ్లిన కోమటిరెడ్డి తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీ చేసి ఎందుకు ఓటమి పాలయ్యారంటూ ప్రశ్నిస్తున్నారు. అంత కెపాసిటీ ఉంటే నాడు ఉప ఎన్నికల్లోనూ గెలిచేవారివిగా అంటూ కొందరు సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు. తనకు తాను తోపు అని ఊహించుకుంటే సరిపోదని, ప్రజలు ఆదరిస్తేనే ఎవరైనా ఎమ్మెల్యే అవుతారని తెలిపారు. కాంగ్రెస్ అధినాయకత్వం పై అలిగి బీజేపీ లోకి వెళ్లిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తర్వాత ఎందుకు మళ్లీ కాంగ్రెస్ లోకి వచ్చారని నిలదీస్తున్నారు. డబ్బు ఉంటేనే సరిపోతుందా? అని ఫైర్ అవుతున్నారు.. మీ సోదరుడు లాగా పార్టీని నమ్ముకుని ఉండకుండా ఎందుకు పార్టీని మార్చాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. కోమటిరెడ్డి కుటుంబానికి రెండు మంత్రిపదవులు ఇవ్వడమేంటని కూడా కాంగ్రెస్ అభిమానులు ప్రశ్నిస్తున్నారు. పార్టీలు తమ ప్రయోజనాల కోసం మారేవారికి మంత్రి పదవులు ఇవ్వకూడదని కొందరు ఇప్పటికే పార్టీ నాయకత్వానికి ఫిర్యాదులు పంపినట్లు తెలిసింది. పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని, దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా మోస్తూ ఆ పార్టీ నీడలోనే కష్టాలు పాలయిన నేతలకు మాత్రమే మంత్రి పదవి ఇస్తే బాగుంటుందని, అంతే తప్ప ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చారంటూ మంత్రి పదవులు అప్పజెపితే ఫిరాయింపులకు అధినాయకత్వమే ప్రోత్సహించినట్లవుతుందని కూడా వ్యాఖ్యానిస్తున్నారు. గడ్డం వివేక్ కు కూడా ఇదే విధానం వర్తిస్తుందని, కాంగ్రెస్ ను నమ్ముకున్న వారికే మంత్రి పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీలో డిమాండ్ ఊపందుకుంది. మంత్రి వర్గ విస్తరణ వేళ ఇది పార్టీ హైకమాండ్ కు తలనొప్పిగా మారింది.

# కాంగ్రెస్ వైపే..కేసీఆర్...?

హైదరాబాద్, మార్చి 26, సీఆర్ ఎప్పుడూ లేనిది ఇటీవల చంద్రబాబు గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారు. ఆయన ఎన్డీఏ కూటమిగా తెలంగాణలో అడుగుపెడుతున్నారని కూడా ఆరోపిస్తున్నారు. తాను ఒంటరిగానే పోటీ చేస్తానని.. అధికారంలోకి వస్తానని చెబుతున్నారు. అసలు చంద్రబాబు పొత్తులతో పోల్చుకోవాల్సిన అవసరం కేసీఆర్ కు లేదు. కానీ రాజకీయ నాయకుల మాటలకు అర్థాలే వేరు అన్నట్లుగా ఆలోచిస్తే.. కేసీఆర్ మాటల్లో లోతైన అర్థం ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని చెన్నైలో నిర్వహించిన సమావేశం తెలంగాణ రాజకీయాల్లో మార్పులు తీసుకువచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇండియా కూటమిలో కీలకమైన పార్టీ డీఎంకే. ఆ పార్టీ ఓ విధానం తీసుకుని సమావేశం ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ కూటమిలోని పార్టీ కాబట్టి కాంగ్రెస్ సీఎం హాజరయ్యారు. కేటీఆర్ కూడా డీఎంకే నేతలు వచ్చి పిలిచినప్పుడే వస్తానని చెప్పారు. ఆ ప్రకారం హాజరయ్యారు. ఈ సమావేశం ఎజెండా బీజేపీని టార్గెట్ చేయడం . అదే జరిగింది బీజేపీ దక్షిణాదికి అన్యాయంచేస్తోందని అందరూ వాదించారు. ఈ వాయిస్ వినిపించిన వారిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కూడా ఉన్నాయిచెన్నై సమావేశం తర్వాత తెలంగాణ సమీకరణాలు మారిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే వారిలో రేవంత్, కేటీఆర్ ఉంటారు. అదే ఫార్ములా తెలంగాణకు అన్వయించేందుకు ఓ అవకాశం ఏర్పడినట్లే . ఇప్పటికిప్పుడు కాకపోయినా భవిష్యత్ రాజకీయాలకు ఇదో పునాది అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నారు. బీజేపీతో పొత్తు కోసం గతంలో బీఆర్ఎస్ ప్రయత్నించిందని స్వయంగా మోదీ చెప్పారు. తాను అవసరం లేదని చెప్పానన్నారు. భవిష్యత్ లోనూ బీఆర్ఎస్ తో పొత్తులు ఉండబోవని చెప్పారు. ఏపీ తరహాలో తెలంగాణలో కూడా ఎన్డీఏ ఉంటుందన్న ప్రచారం ఇటీవలి కాలంలో ఊపందుకుంది. టీడీపీ, బీజేపీ తెలంగాణలో కలుస్తాయని అంటున్నారు. దక్షిణ తెలంగాణలో పట్టు సాధించాలంటే.. టీడీపీ, జనసేనతో కలవడం మంచిదని బీజేపీ హైకమాండ్ అనుకుంటోందని చెబుతున్నారు. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ బలంగా ఉంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఒంటరిగా పోటీ చేస్తే అటు ఉత్తర తెలంగాణలో.. ఇటు దక్షిణ తెలంగాణలోనూ పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే వస్తాయన్న ఆందోళన ఉంది. బీజేపీ కలుపుకునే అవకాశం లేదు కాబట్టి మెల్లగా కాంగ్రెస్ వైపు వెళ్లే ప్రయత్నంలో ఓ అడుగు చెన్నైలో పడిందన్న అభిప్రాయం వినిపిస్తోంది ముందు ముందు జరగబోయే పరిణామాలు తదుపరి రాజకీయ దశా, దిశను మార్చే అవకాశం ఉంది

# మహిళా రైతులకు డ్రోన్లు...

వరంగల్, మార్చి 26, వసాయ రంగంలోనూ యంత్రాల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. సాగు విస్తీర్ణం పెరగడంతో కూలీల కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో.. విత్తు నాటే సమయం నుంచి పంట ఇంటికొచ్చే సమయం వరకు పలు సందర్భాల్లో వివిధ రకాల యంత్రాలను రైతులు వినియోగిస్తున్నారు. దీంతో రైతులకు అవసరమైన యంత్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై అందిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో నిలిచిపోయిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంను రేవంత్ సర్కార్ మళ్లీ అమలు చేసేందుకు నిర్ణయించింది. అయితే, ఈసారి మహిళలకే వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.తెలంగాణ ప్రభుత్వం మహిళా రైతులకు శుభవార్త చెప్పింది. వ్యవసాయ యాంత్రీకరణలో తొలిసారిగా మహిళా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. 2018లో అప్పటి ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు యాంత్రీకరణ పనిముట్లను అందజేసే కార్యక్రమాన్ని నిలిపివేసింది. గతంలో ఎస్సీ, ఎస్టీలకు 90శాతం, ఇతరులకు 50శాతం సబ్సిడీ ఉండేది. ప్రస్తుతం అందరికీ 50శాతం సబ్సిడీతో ఈ యాంత్రీకరణ పరికరాలను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.వ్యవసాయ యాంత్రీకరణలో తొలిసారిగా మహిళా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 10,812 యూనిట్లు అందజేసేందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు మార్గదర్శకాలతో కూడిన ఆదేశాలు జారీ చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 24.90 కోట్ల సబ్సిడీని రైతులకు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే.. ఈనెల 31వ తేదీలోగా పథకాన్ని అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, ప్రస్తుతం సమయం తక్కువగా ఉండటంతో లబ్ధిదారుల ఎంపికలో అధికారులు తలమునకలయ్యారు.వ్యవసాయ పనుల్లో రైతులకు దోహదపడే 14 రకాల యంత్ర పరికరాలను 50శాతం సబ్సిడీతో మహిళా రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా చేతిపంపులు, పవర్ స్ప్రేయర్లు, డ్రోన్లు, రోటోవేటర్లు, విత్తనాలు/ఎరువులువేసే పరికరాలు, ట్రాక్టర్లతో దమ్ముచేసే పరికరాలు, పవర్ టిల్లర్లు, ఎద్దులతో బోదలు పోసే పరికరాలు, ట్రాక్టర్లతో బోదలుపోసే పరికరాలు, పవర్ వీడర్స్, బ్రష్ కట్టర్స్, ట్రాక్టర్లు, మొక్కజొన్న కోత పరికరాలు, గడ్డిచుట్టే పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించనుంది.ఈ నెలాఖరులోగా మహిళా రైతుల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరించనున్నారు. జిల్లాలకు కేటాయింపుల ఆధారంగా ఆయా మండలాలకు నిధులు, లబ్ధిదారుల సంఖ్య కేటాయింపులు చేయనున్నారు. లక్ష రూపాయల లోపు యూనిట్ ఉంటే మండల వ్యవసాయ శాఖ అధికారి కన్వీనర్ గా ఉన్న కమిటీ, లక్షకు మించితే కలెక్టర్ చైర్మన్ గా ఉన్న కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేయనుంది. ఎంపికయిన వారికి సబ్సిడీపై వారు కోరుకున్న యంత్రాలను అందిస్తారు.

# ఆ ముగ్గురిలో ఎవరు..?

హైదరాబాద్, మార్చి 26, తెలంగాణ బీజేపీకి రేపో, మాపో కొత్త చీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు. బీజేపీ స్టేట్ చీఫ్ ఎంపిక ఇప్పటికే తుది దశకు చేరుకుంది. పార్టీ చీఫ్ పేరును ప్రకటించడానికి బీజేపీ హైకమాండ్ సిద్ధమైంది. చీఫ్ పేరుపై జాతీయ నాయకత్వం ఓ అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో రోజు రోజుకీ బీజేపీ బలపడుతుండడంతో ఆ పార్టీ హైమాండ్ తెలంగాణపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే అధ్యక్షుడిని ఆచితూచి ఎంపికచేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసేందుకు కావల్సిన లక్షణాలు, అందరినీ కలుపుకుని ముందుకెళ్లడం, అన్ని ప్రాంతాలకు సుపరిచితుడై, స్థాయి, హోదా ఉన్న నాయకుడిని స్టేట్ చీఫ్ గా ఎంపిక చేయాలని పార్టీ హైకమాండ్ నిర్ణయించినట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలోనే అధ్యక్షుడి పేరు కోసం రాష్ట్రానికి చెందిన కీలక నేతలైన కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్‌లతో చర్చించి.. నామినేషనల్ వేయించాల్సిందిగా పార్టీ అధిష్టానం నిర్ణయించినట్టు సమాచారం.కేంద్ర మంత్రి శోభకారంద్లాజేను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు, సంస్థాగత ఎన్నికలకు ఇంఛార్జిగా నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమె తెలంగాణ రాష్ట్రంలో పర్యటించనున్నారు. హైదరాబాద్ కు చేరుకుని హైకమాండ్ సూచించిన నాయకుడి నుంచి నామినేషన్ స్వీకరించనున్నారు. ఒక్కటే నామినేషన్ దాఖలు చేసి అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎంపిక చేసి మోదీ నాయకత్వం అధికారికంగా ప్రకటించనుంది. ఇప్పటికే ఇదంతా పార్టీ అధిష్టానం చూసుకుంటుందని రాష్ట్ర బీజపీ కీలక నేతలు చెబుతున్నారు.అయితే బీజేపీ పార్టీ రాష్ట్రంలో రోజురోజుకీ బలపడుతుండడంతో పార్టీ కొత్త చీఫ్ గా ఎవరు ఎంపిక అయితారో అని సొంత పార్టీ నాయకులు, ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే అధ్యక్షుడి ఎంపిక ఉత్కంఠను రేపుతోంది. మామూలుగా చీఫ్ రేసులో ఎంపీలు ముందుంటారు. ఇద్దరు, ముగ్గురు మినహా మిగిలిన ఎంపీలు అందరూ తమకంటే తమకు పార్టీ చీఫ్ పోస్టు కావాలని ఆశతో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే అధ్యక్ష ఎన్నిక తర్వాత కేంద్ర కేబినెట్ లోకి మరొకరికి ఛాన్స్ ఉందని సమాచారం.కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ వంటి నేతల పేర్లు టీబీజేపీ చీఫ్ రేసులో ఉన్నట్టు టాక్ వినిపిస్తోంది. అయితే తాను పార్టీ అధ్యక్ష రేసులో లేనని బండి సంజయ్ ఇప్పటికే పలు మార్లు క్లారిటీ ఇచ్చేశారు. టీబీజేపీ చీఫ్ కు సంబంధించి జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని ఈటల రాజేందర్ చెబుతున్నారు. ఇటీవల మూడు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ జరిగితే.. రెండు స్థానాలను బీజేపీ గెలుచుకుని మంచి రాజకీయ బలాన్ని పెంచుకుంటుంది. ఈ నేపథ్యంలోనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ జెండా రెపరెపలాడాలని కసరత్తు చేస్తోంది. అయితే కొత్త చీఫ్ ఎవరు అయితారు.. పార్టీలో ఏమైనా మార్పులు చేర్పులు ఉంటాయా.. అనేది కూడా హాట్ టాపిక్ గా మారింది.టీబీజేపీ కొత్త చీఫ్ రేసులో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ పేరుతో పాటు మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు పేరు కూడా షార్ట్ లిస్ట్ అయినట్టు టాక్ వినిపిస్తోంది. మరి టీబీజేపీ చీఫ్ పదవి ఎవరిని వరిస్తుందో చూడాలి.

# పిర్యాదుదారుడే నిందితుడు

సికింద్రాబాద్ సుడో పోలీస్ కేసును 30 గంటల్లోనే సికింద్రాబాద్ బోయిన్ పల్లి పోలీసులు ఛేదించారు..ఫిర్యాదు దారుడే అసలు నిందితుడని తెల్చడంతో పాటు సహకరించిన అతడి స్నేహితుడ్ని కూడా కటకటాల వెనక్కు నెట్టారు. 5లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.గ్లోబల్ కంపేనీ లో ఉద్యోగం చెస్తున్న అరుణ్ కుమర్ కు కంపేనీ డబ్బును కాజేయలని దుర్బుద్ధి పుట్టింది. మరో బ్రాంచిలో డబ్బులు డెలివరీ ఇచ్చే సమయంలో పోలీసులు తనిఖీ పేరుతో ఆపి బ్యాగు తీసుకోని వెళ్ళిపోయరంటూ కట్టుకథ అల్లి బోయిన్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.. దీంతో సుడో పోలీస్ గా అనుమనించిన పోలీసులు దర్యాప్తు జరపగా. సీసీ కెమెరాల్లో ఎటువంటి అనవాళ్ళు లభించకపోవడంతో..అతని మోబైల్ ను పరిశీలించిన అందులో కూడ ఎటువంటి అనుమానం కలగకుండా కాల్ డేటా ను డిలిట్ చేశాడు. దీంతో కాల్ లిస్ట్ తెప్పించి పరిశీలించిన పోలీసులు. సంఘటనకు ముందు అతని మిత్రుడు సమరేంద్ర తో మాట్లాడినట్టు గుర్తించి..అతని ఇంటికి వెళ్ళి తనిఖీ చేయగా..ఐదు లక్షలు లభ్యమయ్యాయి..దీంతో సూత్రదారి అరుణ్ తో పాటు తన ఇంట్లో స్వాహా నగదును దాచుకున్న సమరేంద్ర ను ఆరెస్ట్ చేసి ఐదు లక్షలు నగదు పోలీసులు స్వాధీనం చెసుకొని ఇద్దరిని రిమాండ్ కు తరలించారు.

# సూర్యాపేట డీఎస్పీ రవి పై వేటు ?


సూర్యాపేట డిఎస్పీ రవిపై వేటు పడినట్లు సమాచారం.. నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో మెంచు చక్రయ్య గౌడ్ మర్డర్ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సూర్యాపేట డి.ఎస్.పి రవి పై వేటు పడింది. డీజీపీ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మెంచు చక్రయ్య గౌడ్ కుటుంబం సభ్యుల మధ్య గొడవలు ఉన్నాయని హత్యకు ముందుగా పోలీసులకు కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. ఈ కేసు విషయంలో నిర్లక్ష్యం వహించిన సూర్యాపేట డీఎస్పీ రవి, తుంగతుర్తి సిఐ శీను పై బదిలీ వేటు పడింది. ఎస్పైకి మెమో జారీ చేసారు. అయితే, ఉత్తర్వులు ఐజి కార్యాలయం నుండి ఇంకా అధికారికంగా వెలువడలేదని సమాచారం.

# ఘాట్ కేసర్ కు మారనున్న గులాబీ మీటింగ్

హైదరాబాద్, మార్చి 26, బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్ని వరంగల్ బదులు ఘట్‌కేసర్‌లో నిర్వహించాలని ఆ పార్టీ భావిస్తోంది. తొలుత వరంగల్‌లో నిర్వహిస్తారని ప్రచారం జరగడంతో ఈ మేరకు స్థానిక బీఆర్ఎస్ నేతలు వరంగల్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న దేవన్నపేట, కడిపికొండ సమీపంలోని భట్టుపల్లి స్థలాన్ని కూడా పరిశీలిస్తున్నారు.అనూహ్యంగా పార్టీ అధినేత కేసీఆర్ సభ నిర్వహణ స్థలాన్ని మార్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మేడ్చల మల్కాజ్ గిరి జిల్లా పరిధి ఘట్ కేసర్ సమీపంలో సభ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు అక్కడి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు సభ నిర్వహణకు అనువైన స్థలాన్ని పరిశీలించాల్సిందిగా సూచించినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. సభా స్థలం మార్పుపై అధికారికంగా పార్టీ నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడనప్పటికీ.. ఘట్ కేసర్ ను ఫైనల్ చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీ 2001 ఏప్రిల్ 27వ తేదీన ఆవిర్భవించగా.. పార్టీ ఏర్పడి 20 ఏళ్లు అవుతున్న సందర్భంగా 2021 నవంబర్ 29 దీక్ష దివస్ రోజున 'విజయ గర్జన సభ' పేరున భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు అప్పట్లో పార్టీ సన్నాహాలు చేసింది. ఈ మేరకు వరంగల్ నగర శివారులోని దేవన్నపేట సమీపంలో ఉన్న నిరుప్ నగర్ తండా స్థలాన్ని పరిశీలించారు. మొత్తంగా 1100 ఎకరాల్లో సభ నిర్వహించేలా ప్లాన్ వేశారు.అందులో 300 ఎకరాల్లో సభా ప్రాంగణం, నాలుగు చోట్లా 800 ఎకరాల్లో వెహికిల్ పార్కింగ్ కోసమని అంచనా వేశారు. కానీ అప్పటికే ఆ చుట్టుపక్కల మొత్తం రైతులు వరి, పత్తి, తదితర పంటలు సాగు చేసుకుంటుండగా, ఆ పొలాలన్నీ చదును చేసేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడి రైతులు తీవ్రంగా వ్యతిరేకించి, ఆందోళనలు చేపట్టారు.రోడ్డెక్కి నిరసనలు చేపట్టడంతో పాటు పొలాల వద్దే మకాం ఏర్పాటు చేసుకుని తమ భూములను చదును చేయకుండా కాపలా ఉన్నారు. అప్పటి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఇలా.. ఎవరు వచ్చినా అడ్డుకుని తమ నిరసనను వెల్లగక్కారు. కాగా అప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడం, అంతలోనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో విజయ గర్జన సభను పార్టీ వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.గతంలో విజయ గర్జన సభ రద్దు కాగా.. పార్టీ ఏర్పడి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా 2025 ఏప్రిల్ 27న నిర్వహించనున్న రజతోత్సవ సంబరాలను పార్టీ అధిష్టానం మరోసారి వరంగల్ నే ఎంచుకుంది. ఈ మేరకు కొద్ది రోజుల కిందట పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ నేతలతో సమావేశమై వరంగల్ లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో ఆ పార్టీ నేతలు దేవన్నపేట, భట్టుపల్లి ప్రాంతాల్లోని స్థలాలను పరిశీలిస్తున్నారు.అక్కడి రైతులతో మాట్లాడి స్థలాలను వెకెట్ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఇంతలోనే పార్టీ నిర్ణయం మారినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ రజతోత్సవ సంబరాలను హైదరాబాద్ కు అతి సమీపంలో ఉన్న మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా పరిధి ఘట్ కేసర్ లో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు అక్కడి ఎమ్మెల్యే మల్లారెడ్డికి సమాచారం అందించినట్లు సమాచారం. సభ నిర్వహణకు స్థలం పరిశీలించాల్సిందిగా సూచించడంతో మల్లారెడ్డి ఈ మేరకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలిసింది.ఓ వైపు వరంగల్ లో సభ నిర్వహణ కోసం దేవన్నపేట సమీపంలో ప్రాంతాన్ని పరిశీలిస్తుండగా, మరో వైపు ఘట్ కేసర్ పేరు అనూహ్యంగా తెర మీదకు వచ్చింది. దీంతో సభ ఎక్కడ జరుగుతుందోననే చర్చ జరుగుతోంది. హైదరాబాద్ కు దగ్గర్లో ఉన్న ఘట్ కేసర్ లో నిర్వహిస్తారా.. లేదా గతంలో వరంగల్ విజయ గర్జన సభ క్యాన్సిల్ అయ్యింది కాబట్టి వరంగల్ లోనే నిర్వహిస్తారా అనేది హాట్ టాపిక్ గా మారింది.కాగా రెండు, మూడు చోట్ల స్థలాన్ని పరిశీలించి, ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడే సభ నిర్వహించే అవకాశం ఉంటుందని పార్టీ నాయకులు అంటున్నారు.

కాగా సభ నిర్వహణ స్థలం మార్పుపై అధికారికంగా గులాబీ పార్టీ నాయకులు ఇంతవరకు స్పందించకపోవడంతో వరంగల్ లోనే సభ ఉంటుందని స్థానిక నాయకులు చెబుతున్నారు. మరి పార్టీ అధినేత సభ నిర్వహణపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.. ఏ స్థలాన్ని ఫైనల్ చేస్తారో చూడాలి.

# నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం




ప్రపంచ రంగస్థల దినోత్సవం ప్రతి ఏట మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా రంగస్థల కళాకారులచే జరుపబడుతున్న ఉత్సవం. ఇది 1961లో ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ వారిచే ప్రారంభించబడింది.

నాటకం సర్వజననీయం, సర్వకాలీనం. ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన కళల్లో నాటక కళ ఒకటి. ఒక దేశం ప్రేరణా, ప్రమేయం లేకుండా ఈ నాటక కళ వివిధ దేశాల్లో విడివిడిగా ఎదిగింది. దాదాపుగా ఒకే కాలంలో పాశ్చాత్య దేశాల్లోనూ, భారతదేశంలోనూ నాటక ప్రక్రియ మొదలయ్యింది. కాలాన్ని బట్టీ, ప్రదేశాన్ని బట్టీ, సంస్కృతిని బట్టీ నాటకం రూపం మారుతుందేగానీ అంతర్లీనంగా దాని మూల సూత్రం మాత్రం అందరికీ ఒక్కటే ఉంటుంది. అందువల్లే నాటకం బహుళాదరణ పొందిన రంగస్థల ప్రక్రియగావిరసిల్లుతుంది. ప్రస్తుతమున్న నాటకం కాలక్రమేణా రూపం మార్చుకుంటా విశ్వజననీయమయ్యింది. దాని గుర్తుగానే ప్రపంచ రంగస్థల దినోత్సవం పుట్టింది.

1961లో వియన్నాలో ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ వారు నిర్వహించిన 9వ ప్రపంచ కాంగ్రెస్‌లో ఆనాటి అధ్యక్షుడు 'ఆర్వికివియా' ప్రపంచ రంగస్థల దినోత్సవ ప్రతిపాదన చేశాడు. సభ్యులందరూ ప్రతిపాదనను అంగీకరించారు. ఆ తరువాత ఏడాది పారిస్‌లో జరిగిన రంగస్థల సమాఖ్యలో పూర్తి స్థాయిలో మొదలయ్యింది.

రంగస్థల దినోత్సవం ప్రపంచమంతా విస్తరించి ఐక్యరాజ్య సమితి, యునెస్కో లచే ప్రాధాన్యత పొందింది. ఈ వేడుకలలో భాగంగా అన్ని దేశాల్లో జరుగుతున్న నాటకాలు, ప్రదర్శనలు, ప్రక్రియల ప్రమాణాలపై పరిశీలకులు, నాటక ప్రియులు వచ్చి సమీక్షించుకుంటారు. ప్రతి సంవత్సరం నాటకరంగంలో నిష్ణాతులైన ఒకరిని సమన్వయకర్తగా ఎంచుకొని, ప్రముఖుల మాటగా వారి మనోగత సారాన్ని ఆ సంవత్సరపు సందేశంగా రంగస్థల ప్రపంచానికి అందిస్తారు.1962లో మొదటి ప్రపంచ రంగస్థల దినోత్సవ సందేశాన్ని జీన్ కాక్టే (ఫ్రాన్స్) అందించాడు.

ప్రపంచవ్యాప్తంగా అనేక రూపాలలో నాటకాన్ని ప్రోత్సహించడం.

ప్రజలకు నాటకం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కలిపించడం.

విస్తృత స్థాయిలో నాటక సంస్థలకు ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులకు అవగాహన కలిపించి వారి ద్వారా నాటకరంగాన్ని అభివృద్ధి చేయడం.

మానసిక ఉల్లాసంకోసం నాటకాన్ని ఆస్వాదింపజేయడం.

నాటకం ద్వారా పొందుతున్న మానసిక ఉల్లాసాన్ని ఇతరులతో పంచుకోవడం.

# పోలవరం నిర్వాసితుల పరిహారం, పునరావాసం పై మంత్రి నిమ్మల సమీక్ష

అమరావతి కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ప్రాధాన్యత ఇస్తుందో, ప్రాజెక్టు కోసం తమ విలువైన భూములు, ఆస్థులు, ఇళ్ళ త్యాగం చేసిన నిర్వాసితుల క్షేమం కూడా అంతే ముఖ్యం అని అన్నారు మంత్రి నిమ్మల రామానాయుడు. అమరావతి సచివాలయంలో పోలవరం నిర్వాసితులకు అందాల్సిన పరిహారం, పునరావాసం పై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు గత అయిదేళ్ళలో ఒక్క రూపాయి నష్టపరిహారం గానీ, కాలనీల నిర్మాణానికి అరబస్తా సిమెంట్ పనులు కూడా చేయలేదు అని, గత జగన్ ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోకపోవడంతో, తమను తెలంగాణలో కలిపేయమని నిర్వాసితులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు అని అన్నారు. నాడు 2017లో రూ. 800 కోట్లు జమ చేసిన చంద్రబాబే, మరలా ఏడేళ్ళ తరువాత నిర్వాసితుల కష్టాలు తీర్చేలా, మరో 800 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసి, సంక్రాంతి కానుక అందించారు అని గుర్తు చేసారు.

జగన్ సిఎం అయ్యాక పోలవరం నిర్వాసితుల వైపు కన్నెత్తి కూడా చూడకపోగా, పునరావాస కాలనీల్లో ఒక్క ఇంటిని కూడా పూర్తి చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చిన రూ. 3385 కోట్ల రియంబర్స్మెంట్ నిధులను కూడా, ప్రాజెక్టు నిర్మాణానికి గానీ, నిర్వాసితులకు గానీ, అందించకుండా దారి మళ్ళించి దోచుకున్న దుర్మార్గుడు జగన్ అని విమర్శించారు.

పోలవరం ప్రాజెక్టును విధ్వంశం చేసినట్లే, నిర్వాసితులను సైతం నిలువునా జగన్ ముంచేశాడు అని అన్నారు. రాడార్ సర్వే ప్రకారం మొత్తం 75 పునరావాస కాలనీలకు గానూ, 26 కాలనీలను నాటి టీడీపీ ప్రభుత్వమే పూర్తి చేయగా, మిగిలిన 49 పునరావాస కాలనీల నిర్మాణ పనులను సైతం వేగవంతం చేసేలా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామని తెలిపారు.

నిర్వాసిత గ్రామాల్లో ఏప్రియల్ నెలాఖరులోగా గ్రామసభలు, ఆర్అండ్ఆర్ కాలనీల గుర్తింపు, పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు మంత్రి నిమ్మల. మిగిలిన నిర్వాసిత కాలనీల్లో నిర్మాణ పనులు పూర్తి చేసేలా, జూలై 15 లోగా టెండర్ల ప్రక్రియ పూర్తవ్వాలి అని, కొత్తగా గుర్తించిన కాలనీలు సైతం 2026 జూన్ కల్లా పూర్తి చేసి, నిర్వాసితులను తరలించేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఫేజ్-2లో 45.72 మీటర్లకు ఆర్అండ్ఆర్ కు సంబందించిన అంచనాలను కూడా సిద్దం చేసి, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి నిధులు సాధిస్తాం అని తెలిపారు. ఈ సమీక్ష లో ఆర్ అండ్ ఆర్ కమిషనర్ రాంసుందర్ రెడ్డి, ఈ ఎన్ సి ఎం. వెంకటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్ట్ పరిపాలన్నాధికారి కే. అభిషేక్, స్పెషల్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, మరియు పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్, ఎపిఈడబుల్యూఐడిసి, హౌసింగ్, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్లు, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి అధ్యక్షతన జరిగిన ఎన్డీయే ఎంపిల సమావేశానికి ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) హాజరు





ఢిల్లీ కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అధ్యక్షతన జరిగిన ఎన్డీయే ఎంపిల సమావేశంలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఎన్డీయే కూటమిలోని పార్లమెంట్ సభ్యుల నియోజకవర్గాల సమస్యలు, కేంద్ర పథకాల అమలు, నిధుల అవసరాల గురించి తెలుసుకునేందుకు కేంద్రమంత్రులకు కొంతమంది ఎంపిలను గ్రూపులుగా అప్పగించి ప్రతి మూడు నెలలకొకసారి సమావేశం కావాలని ఆదేశించింది. కేంద్రమంత్రి హార్టీప్ సింగ్ కి అధ్యక్షతన వున్న ఎన్డీయే ఎంపిల గ్రూపులో ఎపికి చెందిన కేశినేని శివనాథ్ (చిన్ని), ఎంపి బస్తిపాటి నాగరాజు పంచలింగాల వున్నారు.

కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అధ్యక్షతన మంగళవారం రాత్రి ఢిల్లీలోని ఆయన నివాసంలో పలువురు ఎన్డీయే ఎంపిలతో డిన్నర్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ తో ఆంధ్రప్రదేశ్ కి ఏరోస్పెస్, డిఫెన్స్ పారిశ్రామిక రంగాలు వచ్చే విధంగా సహకరించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి కి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ది గురించి వివరించారు.

కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ తమకి పార్లమెంట్ లో కొనసాగాల్సి విధానం, పార్లమెంట్ నియోజకవర్గాల అభివృద్దికి సంబంధించి సలహాలు సూచనలు ఇచ్చినట్లు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే

కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి, ఐక్యరాజ్యసమితి మాజీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ లక్ష్మి ముర్దేశ్వర్ పూరి దంపతులు ఇచ్చిన విందు ఆత్మీయమైన అతిథ్యం మరుపురాని విధంగా వున్నాయని కొనియాడారు. హర్దీప్ సింగ్ పురి సతీమణి లక్ష్మి ముర్దేశ్వర్ పూరి సౌతిండియా వంటకాలు దగ్గర వుండి తయారు చేయించినందకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఢిల్లీ రాష్ట్రానికి చెందిన ఎంపి వి సతీష్(బిజెపి), గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఎంపి భరత్‌సిన్హ్ దాభి ఠాకూర్(బిజెపి), కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎంపి బి వై రాఘవేంద్ర(బిజెపి),ఎంపి ఎమ్.మల్లేష్ బాబు (జె.డి.యు), మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎంపి డాక్టర్ రాజేష్ మిశ్రా (బిజెపి), ఓడిషా రాష్ట్రానికి చెందిన సంగీతా కుమారి సింగ్ డియో (బిజెపి), రాజ్య సభ ఎంపి మమతా మొహంతా (బిజెపి) , ఉత్తర ప్రదేశ్ కి చెందిన రాజ్యసభ ఎంపి డాక్టర్ దినేష్ శర్మ (బిజెపి), వెస్ట్ బెంగాల్ కి చెందిన ఎంపి సమిక్ భట్టాచార్య (బిజెపి), బిహార్ కి చెందిన ఎంపి విజయ లక్ష్మి కుష్వాహ (జె.డి(యు)), ఆంధ్రప్రదేశ్ కి చెందిన ఎంపి కేశినేని శివనాథ్ (టిడిపి), ఎంపి బస్తిపాటి నాగరాజు పంచలింగాల (టిడిపి), అస్సాంకి చెందిన రాజ్యసభ ఎంపి రంగ్వ్రా నార్జారీ (యు.పి.పి.ఎల్) పాల్గొన్నారు.

# ఆన్లైన్ గేమ్స్ తో జీవితాలు నాశనం చేసుకోవద్దు

## పెరుగుతున్న ఆన్లైన్ గేమింగ్ మోసాలు

## తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి




తాండూర్ రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ జా (ఐపీఎస్)మంచిర్యాల డిసిపి ఏ.భాస్కర్ ఐపీఎస్ గారి ఉత్తర్వుల మేరకు బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ పర్యవేక్షణలో భాగంగా తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి మంగళవారం రోజున సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోలీసు శాఖ వారి తరఫున ప్రజలకు ముందస్తు సమాచారం తెలియజేయడం జరుగుతుంది. యువతను పెడదారి పట్టించి ప్రాణాలు తీయడమే కాకుండా వారి తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మెదిరిస్తున్న ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్ పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని వీటి బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి అన్నారు.ఆన్‌లైన్ ఆటలకు బానిసలుగా మారి ఎంతో మంది టీనేజర్లు, యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చిన్నతనం నుంచే పిల్లలను తల్లిదండ్రులు ఆన్ లైన్స్ గేమ్స్ కు దూరంగా ఉంచాలి. బాల్యంలో గారాబం చేసి ఆడుకునేందుకు స్మార్ట్ ఫోన్‌లు, ట్యాబ్‌లు, ల్యాప్ టాప్‌లు ఇవ్వడం ఆన్‌లైన్ గేమ్స్‌కి పిల్లలను బానిసలను చేస్తోందన్నారు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య సరైన సంబంధాలు లేకపోవడం వల్ల కూడా పిల్లలు ఆన్‌లైన్ గేమ్స్ వైపు ఆకర్శితులవుతున్నారు. ఎవరి ప్రపంచంలో వారు ఉండటం వలన ఇలాంటి పరిస్థితులకు దారితీస్తోందన్నారు.ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్ ఆడి యువత పిల్లలు డబ్బులు పోగొట్టుకోకూడదని వీటిపట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ వాటికి దూరంగా ఉండే విధంగా మన ఆలోచన తీరును మార్చుకోవాలన్నారు యూట్యూబ్ వాట్సప్ ఇన్స్టాల్ క్రికెట్ బెట్టింగ్ ఏదైనా ఆన్లైన్ గేమ్ లకు ఎక్కువ శాతం ప్రతి ఒక్కరు దూరంగా ఉండడమే మంచిదన్నారు.

# అవినీతిని సహించేది లేదు.

## దాసరి పనిందర్. జిల్లా రిజిస్ట్రార్.




వరంగల్‌సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఎలాంటి అవినీతిని సహించేది లేదని ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్టర్ దాసరి ఫణిందర్ అన్నారు బుధవారం ఆయన ప్రజా క్రాంతి పత్రికతో మాట్లాడారు ఉమ్మడి జిల్లాలో ఉండబడిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను అవినీతికి దూరంగా ఉంచడం కోసం స్టాంప్లు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఎక్కువగా ప్రయత్నిస్తూన్నట్లు ఆయన తెలిపారు ఆ క్రమంలో జిల్లాలో ఉండబడిన అన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను తనిఖీలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న సబ్ రిజిస్టర్లు ఇతర సిబ్బంది ఎలాంటి అవినీతికి పాల్పడిన కఠినమైన శిక్షలు ఉంటాయి అన్నారు రిజిస్ట్రేషన్ చేసే సమయాలలో సబ్ రిజిస్టర్లు నిజాయితీగా ఉండిన వాటిని చేయాలని ఆయన తెలిపారు మధ్యతళారులు కొంతమంది పనిగట్టుకుని అధికారులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన పేర్కొన్నారు ఆ క్రమంలో అక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్టర్లు వారి వలలో పడవద్దని పేర్కొన్నారు ఇటీవల కొంతకాలంగా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న సబ్ రిజిస్టర్లు కిందిస్థాయి సిబ్బంది అక్రమార్కుల వలన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జైలు పాలు అవుతున్నారని జిల్లా రిజిస్టర్ తెలిపారు స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు చెప్పిన విధంగా కింది స్థాయిలో పనిచేస్తున్న సబ్ రిజిస్టర్లు ఆ సూచనలు పాటిస్తూ పనిచేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు మధ్యదళారుల మాటలు నమ్మి సబ్ రిజిస్టార్ చెప్పి తప్పుడు ధృవపత్రాలు సమర్పించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని ఆయన మండిపడ్డారు అలాంటివారిని కార్యాలయం సమీపంలోనికి రావని వద్దని ఆయన సబ్ రిజిస్టార్లను కోరారు కార్యాలయంలో ఎలాంటి పైరవీలు లేకుండా పారదర్శకంగా ఉండటం కోసం తాను ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు అవినీతికి పాల్పడిన అధికారులను కాపాడే ప్రయత్నాలు ఎవరు చేయరని ఆయన అన్నారు అవినీతికి పాల్పడితే ఉద్యోగ భద్రతకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు అదే విధంగా అవినీతి కార్యక్రమాలలో పాల్గొన్న అధికారులను జైలు పాలై వారి కుటుంబం అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని హితవు పలికారు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అవినీతి రైతంగా ఉన్నప్పుడు ప్రజలకు మేలు చేసిన వారు అవుతాం అని ఆయన అన్నారు ప్రజల కోసం పనిచేసినప్పుడు ఉన్నతమైన ప్రమాణాలు కలిగిన అధికారులుగా ప్రజల మనసుల్లో చిరకాలం ఉండే అవకాశం ఉందని ఆయన తెలిపారు తాను పనిచేసిన కాలంలో ఎక్కడ ఎలాంటి అవినీతికి పాల్పడలేదన్నారు గతంలో తాను అదిలాబాద్ జిల్లా రిజిస్టర్ గా కరీంనగర్ ఆడిట్ రిజిస్టర్ గా వరంగల్ ఉమ్మడి జిల్లా ఆడిట్ రిజిస్టర్ గా పనిచేసే ప్రస్తుతం వరంగల్ జిల్లా రిజిస్టర్ గా తను విధులను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# తొలి ఉచిత గ్యాస్ సిలిండర్

## మార్చి 31 వరకే అవకాశం

## -ఇప్పటివరకు పొందని వారు వెంటనే బుక్ చేసుకోవాలి

## – ఆహారం, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విజయవాడ ప్రతి పేద ఆడబిడ్డకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని, దీపం-2 పథకంలో తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.ఇప్పటి పొందని వారు వెంటనే బుక్ చేసుకోవాలన్నారు ఇప్పటివరకు 98 లక్షల మంది తొలి ఉచిత సిలిండర్ వినియోగించుకున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు.01నవంబర్ 2024న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా దీపం 2 పథకానికి శ్రీకారం చుట్టారు. దీపం -2 పథకంతో ప్రతి పేద వాడి ఇంట్లో దీపపు కాంతులు విరాజిల్లుతున్నాయి.కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా దీపం-2 పథకం రూపొందించడం జరిగింది.దీపం-2 పథకానికి రూ.2,684 కోట్లు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.ఉచిత సిలిండర్ కావాల్సిన వారు సాధారణ పద్ధతిలో ముందుగా సొమ్ము చెల్లించవలసి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లోబుక్ చేసిన 24 గంటల లోపు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల లోపు గ్యాస్ డెలివరీ ఇస్తారు.ఆ తర్వాత సిలెండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు చెల్లించిన పూర్తి సొమ్మును లబ్దిదారుల ఖాతాల్లో తిరిగి జమ అవుతుందన్నారు

ఒక సంవత్సరంలో 3 గ్యాస్ సిలిండర్లు ఇలా ఉచితంగా పంపిణీ చేస్తారు. అయితే వీటిని ఒకేసారి కాకుండా నాలుగు నెలలకు ఒకసారి బుక్ చేసుకునే అవకాశం కల్పించారు.

ప్రతి ఏడాది ఏప్రిల్ – జూలై (01), ఆగష్టు ?నవంబర్ (01), డిసెంబర్ ?మార్చి (01) మధ్య ఉచిత గ్యాస్ సిలెండర్ బుక్ చేసుకోవచ్చని అయన వెల్లడించారు.

# సబ్ క యోజన -సబ్ క వికాస్ ప్రణాళికలు రూపొందించాలి

## .జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




జయశంకర్ భూపాలపల్లి,జిల్లాలో సమగ్ర ప్రణాళికా అమలుకు సంబంధించి "సబ్ క యోజన – సబ్ క వికాస్" కింద జిల్లా, మండల ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో సబ్ కి యోజన – సబ్ కి వికాస్" కింద జిల్లా, మండల ప్రణాళికలు రూపకల్పనపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు ప్రణాళికలు రూపకల్పనపై పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా మరియు మండల స్థాయిలో ప్రణాళికా రూపకల్పన ఎంతో కీలకమైనదని, ఇందులో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన అభివృద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంచి ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరాన్ని ఆయన పేర్కొన్నారు. అంతేకాక, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఆయా ప్రణాళికలు సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా ఉంచుకుని రూపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, స్థానిక వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా అభివృద్ధిని వేగవంతం చేయడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్,

డిపిఓ నారాయణరావు, డిఆర్డీఓ నరేష్, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు , ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకై లారీ డ్రైవర్లు సమయపాలన పాటించాలి

## జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



జయశంకర్ భూపాలపల్లి, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మరియు ట్రాఫిక్ జామ్ సమస్య ఉత్పన్నం కాకుండా ఇసుక లారీ డ్రైవర్లు పక్కాగా సమయపాలన పాటించాలని నిర్దేశిత సమయంలోనే ఇసుక లారీలు రోడెక్కాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపీఎస్

ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు, మరియు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఇసుక లారీలకు జాతీయ రహదారిపై అనుమతి లేదని, హోల్డింగ్ పాయింట్స్ లో చెక్పోస్టుల్లో ఇసుక లారీలు నిలిపిఉంచి, సమయపాలన ప్రకారం నడుచుకోవాలని పేర్కొన్నారు. ఇసుక లారీల ట్రాఫిక్ నియంత్రణకు రేగొండ కాటారంలో రెండు చెక్పోస్ట్ మరియు హోల్డింగ్ పాయింట్స్ ఏర్పాటు చేయడం జరిగిందని రేగొండలో ఎంటి ( ఖాళీ ) లారీలు, కాటారంలో ఇసుక లోడ్ లారీలు, పోలీసుల నిర్దేశిత సమయపాలన ప్రకారం నడుచుకోవాలని, ఉదయం, సాయంత్రం సమయపాలన పాటించాలని అన్నారు. రోడ్డుపై వాహనాలు ఆపి ఉండడం మూలంగా ప్రమాదాలు జరుగుతుండడంతో పాటు, ట్రాఫిక్ జామ్ అవుతుందని, రోడ్డుపై ఇసుక లారీలు పార్కింగ్ చేయకుండా 24 గంటలు పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేశామని ఎస్పీ గారు పేర్కొన్నారు. అలాగే లారీ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలతో పాటు, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణ, ఓవర్ స్పీడ్, పార్కింగ్ విధానం తదితర అంశాల అంశాలపై కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు, ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు జిల్లాలో కట్టుదిట్టంగా ట్రాఫిక్ నిబంధనలను అమలు చేస్తున్నామని, ఇసుక లారీ డ్రైవర్లు సైతం పోలీసులకు సహకరించాలని ఎస్పీ కిరణ్ కరే కోరారు.

# భవిష్యత్తు అంతా టూరిజమే













అమరావతి రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న మూడవ జిల్లా కలెక్టర్ల సమావేశం 2 వ రోజు ప్రారంభంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా జిల్లా అభివృద్ధి ప్రణాళికల పై రాష్ట్రస్థాయిలో చర్చిస్తున్నాం. దాదాపు 30 ఏళ్ల క్రితం నేను టూరిజాన్ని ప్రోత్సహించేందుకు ప్రయత్నిస్తుంటే ప్రతిపక్ష సభ్యులు అడ్డు పడుతుంటే అప్పుడు నేను కమ్యునిజం లేదు, క్యాపిటలిజం లేదు, సోషలిజం లేదు, భవిష్యత్తు అంతా టూరిజానిదే అని అన్నప్పుడు కమ్యునిస్టులు నాపై విరుచుపడారు. పేదరికం నిర్మూలనకు సంపదను సృష్టించే టూరిజం తదితర అంశాలకే భవిష్యత్తు అంతా ప్రధాన్యత నిస్తుందని, భౌతిక వాదమే వస్తుందని అన్నాను. దాదాపు 30 ఏళ్ల తదుపరి నిన్న మంగళవారం తెలంగాణా బడ్జెట్ సమావేశాల సందర్భంగా తెలంగాణా శాసన సభ్యలో సిపిఐ సభ్యులు ఇదే అంశాన్ని ప్రసావిస్తూ, పైసా ఖర్చు లేనిది టూరిజమే నని రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి పర్చాలని ఆంద్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 30 ఏళ్ల క్రితం అంటే అందరికీ కోపం వచ్చిందని సిపిఐ శాసన సభ్యులు ఉటంకించారన్నారు. తెలంగాణాలో అనేక పర్యాటక ప్రాంతాల ఉన్నాయి, వాటి అభివృద్ధిపై శ్రద్ధ పెట్టాలని ఆయన కోరారు. నేను 30 సంవత్సరాల క్రితం అన్న విషయాన్ని అర్థం చేసుకోవడానికి ఇంత కాలం పట్టిందని అన్నారు.

కాబట్టి నేను చెప్పేదంతా జిల్లా కలెక్టర్లు అందరూ అర్థం చేస్తుకుని క్షేత్ర స్థాయిలో రియల్ టైమ్ లో అమలు పరిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. మన రాష్ట్రంలో ఐదు జోన్ లు ఉన్నాయి. జోన్-1 లో విశాఖపట్నం, జోన్-2 లో రాజమండ్రి, జోన్-3 లో రాజదాని అమరావతి, జోన్-4 లో తిరుపతి మరియు జోన్-5 లో అనంతపురం పవర్ హబ్ లుగా ఉన్నాయి. ఆ పవర్ హబ్ల ఆధారంగా ఆయా జోన్లలోని అన్ని జిల్లాలను అభివృద్ధి పర్చే విధంగా జిల్లా కలెక్టర్లు జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు పరిస్తే రాష్ట్ర భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుంది.

చప్రతి జోన్కు ఒక సీనియర్ అధికారిని ఇన్ చార్జిగా ఉంచాము, ప్రతి జిల్లాకు ఇన్ చార్జి మంత్రి కూడా ఉన్నాడు. వీరందరూ కలిసి ఆయన జిల్లాలను, ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ద పర్చాలో సమగ్రంగా చర్చించి క్షేత్ర స్థాయిలో తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. గ్రామాల్లోని వాస్తవ విషయాలను తెలుసుకుని అందుకు తగ్గట్టుగా అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించే విధంగా మరియు గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని వాటిని రియల్ టైమ్ లో పరిష్కరించేందుకై వచ్చే మాసం నుండి సీనియర్ అధికారులు అంతా గ్రామాల్లో మూడు నాలుగు రోజులు పృటించాలని అన్నారు.

## అప్సర హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు





హైదరాబాద్ సంచలనం రేపిన అప్సర హత్య కేసులో రంగారెడ్డి కోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఆమెను హత్య చేసిన నిందితుడు పూజారి సాయికృష్ణకు జీవితఖైదు విధించింది. కొన్నేళ్లుగా అప్పర అనే మహిళతో వివాహేతర సంబంధం నడిపిన సాయికృష్ణ 2023లో ఆమెను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని మ్యాన హోల్ లో పడేసి, అప్పర కనిపించడంలేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడిపై అనుమానం రావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా సాయికృష్ట నిందితుడని తేలింది.

## కేటీఆర్ పై కేసులు పెడితే ఊరుకోం

నకిరేకల్ నల్గొండ జిల్లా నకిరేకల్ లో ఈ నెల 21న లీకైన పదవ తరగతి తెలుగు పేపర్ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. ఈ కేసులో నకిరేకల్ అధికార పార్టీ ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులను వదిలేశారంటు బిఆరెస్ నాయకులు చేసిన ఆరోపణలపై దూమారం లేస్తుంది. కేటీఆర్ ట్వీట్ చేసిన అంశాన్ని కాంగ్రెస్ నేతలు సీరియస్ గా తీసుకున్నారు. బిఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై నకిరేకల్ పోలీస్ స్టేషన్ లో ఒక ఎస్సి ఎస్టీ కేసు తో పాటు మరో రెండు కేసులు నమోదు చేశారు.అధికార పార్టీ తీరును బిఆరెస్ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తే మూల్యం తప్పదని హెచ్చరిస్తున్నారు. నకిరేకల్ మాజీ బిఆరెస్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య స్పందిస్తూ పదవ తరగతి పేపర్ లీక్ వ్యవహారం లో పోలీసులు స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే వీరేశం అనుచరులను ఎందుకు వదిలేశారో చెప్పాలంటూ మీడియా ముఖంగా ప్రశ్నించారు.తమ నాయకునిపై తప్పుడు కేసులు పెడితే బయపడబొమని,కోర్ట్ లపై తమకు నమ్మకం ఉందని అన్నారు..

## పాతబస్తీలో ఎంఐఎంను ఎదుర్కోంటాం

హైదరాబాద్ పాతబస్తీలో ఎంఐఎం ఆగడాలు సాగనివ్వకుండా అడ్డుకట్ట వేస్తామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా నూతన అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ అన్నారు. కుర్మగూడ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంఐఎం నేతలు కనుసన్నల్లో ప్రభుత్వం, కొందరు అధికారులు వ్యవహరిస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పను ల్లో సైతం పక్షపాత ధోరణి అవలంభిస్తున్నారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా అభివృద్ధిని అడుకుంటే బీజేపీ చూస్తూ ఉరుకోదని హెచ్చ రించారు. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో పాతబస్తీలో అధిక డివిజన్లలో బీజేపీ జెండా ఎగరవేసేందుకు సమష్టి కృషి చేస్తామని చెప్పారు. ప్రధాని మోదీ చేపడుతున్న ప్రభుత్వ పథకాలలో ప్రజలలోకి మరింతగా తీసుకు వెల్లుతామని చెప్పారు..కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్ .నేతలు మహేష్, యూగేందర్.ప్రమోద్. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రామోజీ ఫిలిం సిటీ ముట్టడి

రంగారెడ్డి పేదల ఇండ్ల స్థలాల రామోజీ ఫీల్మ్ సిటీ యాజమాన్యం కబ్జా చేసిందంటూ రామోజీ ఫీల్మ్ సిటీని ఇండ్ల స్థలాల లబ్దిదారులు ముట్టడించారు. లబ్దిదారులకు సిపీఎం మద్దతు నిలిచింది.

రంగారెడ్డి జిల్లా ఇబ్రాహీంపట్నం. మండలంలోని నాగాన్ పల్లి లో సర్వే నెంబరు 189.203 లలో రామోజి యాజమాన్యం కబ్జా చేసినా పేదల ఇంటి స్థలాలను ఇవ్వాలని సీపీఎం అద్వర్యంలో చలోరామోజీ ఫిల్మ్ సిటీ కార్యక్రమం నిర్వహించింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జన్ వెస్లీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గోన్నారు. రామోజి ఫిల్మ్ సిటీ ఆధీనం లో ఉన్నా ఇండ్ల స్థలాలు భూములను పేదలకు ఇవ్వాలని ఆర్ఎఫ్పీ ఇంటి స్థలాల కమిటీ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఫీలిం సిటీ గేట్లను తోసుకుంటూ లోపలికి వెళ్ళిన లబ్దిదారులు, .తమకు ప్రభుత్వం కేటాయించిన భూమిలో భీష్మించు కుర్చున్నారు.

## ఇఫ్తార్ విందులు కాదు-ముస్లిం మైనార్టీ హక్కులు కాపాడండి

### వక్స్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఏపీ అసెంబ్లీలో తీర్మానించండి
### షేక్ సైదా ఏపీసీసీ అధికార ప్రతినిధి




బద్వేలుదేశంలో 20 శాతం పైగా ఉన్న ముస్లిం మైనార్టీ హక్కులను కాలరాస్తూ గత పది సంవత్సరాలుగా దేశంలో పాలన చేస్తున్న బిజెపి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ముస్లిం వ్యతిరేక చర్యలను ఖండించవలసిన సమయం ఆసన్నమైందని పవిత్ర రంజాన్ మాసంలో వక్ఫ సవరణ బిల్లును పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం కాకుండా తిరస్కరించ వలసి ఉన్నదని,అలాగే రాష్ట్ర శాసనసభలో వక్ఫ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని నేడు విజయవాడ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్ర తన భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్ సైదా అన్నారు.

ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి ముస్లింలు పట్ల ప్రేమ చూపిస్తూ మరోపక్క బీజేపీ ప్రవేశపెట్టిన ముస్లిం నల్ల చట్టాలకు జై కొట్టడం ఏ మాత్రం సమర్ధనియం కాదని ఆయన నిశితంగా విమర్శించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఆ రాష్ట్ర ముస్లిం సంఘాలు ప్రజాస్వామ్యవాదులు లౌకికవాదులు హాజరుకాకుండా బహిష్కరించాలని అలాగే దేశవ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రజాస్వామ్య వాదులు గత కొంత కాలంగా వక్ఫ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నా, బిజెపి మంకు పట్టుతో ముస్లిం మైనార్టీలపై విద్వేషం వెళ్లగకుతుందని నిశితంగా విమర్శించారు.

కోట్లాది రూపాయలు విలువైన వక్ఫ ఆస్తులను అంబానీలకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్ర పన్నుతున్నదాని ఆయన తీవ్రంగా విమర్శించారు. వక్ఫ కమిటీలలో అన్య మతస్తులను ఏ విధంగా నియమిస్తారని ఆయన ప్రశ్నించారు. తిరుపతి, శ్రీశైలం, కనకదుర్గమ్మ దేవాలయ పాలకవర్గాలలో అన్యమతస్తులను రాష్ట్ర ప్రభుత్వ నియమిస్తుందా? అని షేక్ సైదా ప్రశ్నించారు. ఇఫ్తార్ విందులను ముస్లిం మైనార్టీ సంఘాలు లౌకికవాదులు ప్రజాస్వామిక వాదులు బహిష్కరించాలని ఆయన కోరారు.

దేశంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారి ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పక్షాలను కూడగట్టి బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి చేస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను ఎండ గట్టు తూ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు వెలుపల బయట పెద్ద ఎత్తున పోరాడుతుందని, అలాగే రాష్ట్రంలో వైఎస్ షర్మిల రెడ్డి గారి సారధ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్డీఏ కూటమి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తుందని సైదా అన్నారు. రాష్ట్ర మైనార్టీ డిపార్ట్మెంట్ అబ్జర్వర్ షేక్ బాజీ మాట్లాడుతూ దేశంలో మోడీ, అమిత్ షా విధ్వంసకర ఆలోచన విధానంతో ముస్లింలను అణగదొక్కేందుకు పెద్ద ఎత్తున కుట్ర పన్నుతున్నారని రాష్ట్రంలో బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని ఆయన ఎద్దేవా చేశారు వక్ఫ సవరణ బిల్లును వ్యతిరేకించాలని అలాగే రాష్ట్రంలో హజ్ కెళ్లే యాత్రికుల కోసం ఏర్పాటుచేసిన విజయవాడ విమానాశ్రయంలో ఎంబార్కుషన్ సెంటర్ ను ఎత్తివేయడం సమంజసం కాదని ఆయన తీవ్రంగా విమర్శించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ కుర్షిదా , ఏపీ సి సి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి ఎండీహెచ్ఎస్ బేగ్, ఏఐసీసీ మాజీ సభ్యులు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ బషీర్, ఏపీ సీసీ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ అన్సారీ, విజయవాడ సిటీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాల్లో భాగంగా ప్రభుత్వ ఉద్యోగ పత్రం అందజేత

సిద్దిపేట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం కారుణ్య నియామకాల్లో భాగంగా 8 నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయిన హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ సలీముద్దీన్, కుమారునికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేసిన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం కారుణ్య నియామకాల్లో భాగంగా 8 నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయిన హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ సలీముద్దీన్, కుమారుడు సయ్యద్ సోహెల్ పాషా కు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు విడతలవారీగా కారుణ్య నియామకాలలో ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. నీతి నిజాయితీగా ఉద్యోగాలు చేస్తూ డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, ఏఓ యాదమ్మ, సూపరిండెంట్ ఫయాజుద్దీన్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాడ్మింటన్ లో కాంస్య పతకం సాధించిన పల్లెం రాజలింగు




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మార్చి 26:** ఇటీవల గోవాలో జరిగిన జాతీయ వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలలో మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన పల్లెం రాజలింగు (మాజీ సింగరేణి కార్మికుడు) పాల్గొని కాంస్య పతకం సాధించారు. 75 సంవత్సరాల విభాగం డబుల్స్ పోటీలో విజేతగా నిలిచి కాంస్య పతకం అందుకున్నారు. జాతీయ స్థాయిలో గెలుపొందిన పల్లెం రాజలింగు వచ్చే నెల అంతర్జాతీయ స్థాయిలో థాయిలాండ్ లో జరుగనున్న పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజలింగు మాట్లాడుతూ గతంలో రెండుసార్లు అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారని 75ఏళ్ల వయస్సులో ఆడే అవకాశం సత్తా ఉన్న ఆర్థిక స్థోమత లేక వెళ్ళకపోయినట్లు

## సింగరేణి సేవా సమితి ద్వారా మహిళలకు ఉపాధి శిక్షణ

## -సేవాసమితి అధ్యక్షురాలు గాజర్ల స్వరూప రాణి దేవేందర్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మార్చి 26:** మందమర్రి ఏరియాలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ తరగతులను బుధవారం సేవ అధ్యక్షురాలు శ్రీమతి గాజర్ల స్వరూప రాణి దేవేందర్ సందర్శించారు. మందమర్రి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లోని సేవ సెంటర్ లోనీ శిక్షణ తరగతులు టైలరింగ్, బ్యూటిషన్ మగ్గం వర్క్ మరియు ఫ్యాషన్ డిజైనింగ్ సెంటర్ లను పరిశీలించారు.

అలాగే కంప్యూటర్ డిసిఏ కోర్స్ శిక్షణ ముగించుకున్న వారికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం సింగరేణి సేవా సమితి ద్వారా మహిళలకు, యువతులకు, యువకులకు ఎన్నో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ సంవత్సరం మందమర్రి ఏరియాలో మహిళలకు, యువతులకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం, బ్యూటిషన్ మరియు కంప్యూటర్ కోర్స్ లు ప్రారంభించామన్నార్. ఈ వృత్తి శిక్షణ కోర్సలు నేర్చుకుంటున్న మిమ్మల్ని చూస్తే చాలా సంతోషంగా ఉందన్నారు. మహిళలు తమ కాళ్ల మీద వారు నిలబడాలని వారు ఎంతో కొంత సంపాదించుకొని వారి కుటుంబాలకు అండగా నిలబడాలన్నారు. సింగరేణి సేవా సమితి ద్వారా ఎన్నో కోర్సులను ప్రవేశపెడుతున్నామని. అలాగే మీరు కుట్టినవి విక్రయించడానికి హైదరాబాదులోని శిల్పారామంలో, ప్రతి సంవత్సరం జరుగు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ నాంపల్లిలో స్టాల్స్ నిర్వహిస్తున్నామన్నారు. మహిళలందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ మెంబర్స్ శ్రీమతి కవిత, శ్రీమతి మనీ శిక్షకురాలు, అభ్యర్థులు పాల్గొన్నారు.



# పెండింగ్ ఇంటి పన్ను పై 90 శాతం వడ్డీ రాయితీ



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మార్చి 26:** పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలను 2024-25 ఆర్థిక సంవత్సరపు ఆస్తి పన్నుతో కలిసి ఒకేసారి చెల్లించే వారికి, బకాయిల వడ్డీపై 90% వడ్డీ మాఫీ చేయటం జరిగిందని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు తెలిపారు.

ఇంతకుముందు వడ్డీతో కలిపి పూర్తిగా చెల్లించిన వారికి, వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్నులో సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు ఈ సదవకాశమును సద్వినియోగం చేసుకొని ఓ.టి.ఎస్ పథకం కింద ఆస్తి పన్ను బకాయిలను వెంటనే చెల్లించి, 90% వడ్డీ మాఫీ పొందాలన్నారు. ఆస్తి పన్నులు చెల్లింపులు చేయనిచో తెలంగాణ పురపాలక చట్టం 2019 నందలి సెక్షన్ 87 ప్రకారం మీ యొక్క ఆస్తులను జప్తు చేయటం జరుగుతుందనీ నీటి బిల్లుల చెల్లింపులు చేయకపోతే కుళాయి కనెక్షనులను తొలగించటం జరుగుతుందన్నారు.

## దానం పల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం,



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 26 (ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా: అందోల్ మండలంలోని దానం పల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు, ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద,రూ, 5, లక్షల వ్యయంతో గ్రామంలోని మెయిన్ రోడ్ నుంచి, హనుమాన్ మందిరం వరకు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు, చాలా కాలంగా ఇక్కడ రోడ్డు లేకపోవడంతో, గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో, గ్రామం అభివృద్ధి చెందుతుందని, మాజీ సర్పంచ్ ముప్పారం రాములు, శంకర్,మౌనిక రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాములు, సంతృప్తి వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆరే ఆనందరావు, నాయకులు తులసి రామ్, యాదగిరి,శీను, కవళి దుర్గయ్య, నర్సింలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు..

## ధరణిలో పెండింగ్ దరఖాస్తుల సమీక్ష

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 26:** బుధవారం మూడు చింతలపల్లి తహసీల్దారు కార్యాలయాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి తనిఖీ చేసారు. ధరణిలో పెండింగ్ వివరాలపై అదనపు కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ధరణిలో ఎన్ని పెండింగ్ ఉన్నాయని ఎంఆర్ఓ ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ తొందరగా క్లియర్ చేయాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ నర్సింహారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రవీంద్ర భారతిలో ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



**ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** రవీంద్రభారతిలో శ్లోక స్కూల్ విద్యార్థులు చేసిన భరతనాట్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. శ్లోక పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు చేసిన నాట్యం వీక్షకులను ఆకట్టుకుంది

## నిర్మల్ జిల్లాలోని ముస్లిం సోదరులకు మరియు వారి కుటుంబ సభ్యులకు పవిత్ర “రంజాన్” (ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా ముందస్తుగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల





**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** ఈరోజు నిర్మల్ పట్టణంలో పనిచేస్తున్న ముస్లిం సోదరులకు రంజాన్ మాస ఉపవాసాల సందర్భంగా జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.

30 రోజులు నమాజ్ మరియు ఉపవాస దీక్షలు పూర్తి చేసుకొంటూ మరియు తమ విదులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా పోలీస్ అధికారులు అందరూ సహకరించినందుకు ధన్యవాదలు. రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి 02 నుండి ప్రారంబం అయ్యాయి,ఒక నెల పాటు ఉపవాసం ఉంది అల్లా ను ప్రార్ధిస్తారు. రంజాన్ మాసం లో ముస్లిం సోదరులు ఎక్కువ సమయం ప్రార్ధనలు చేస్తారు .

ఇస్లాం యొక్క అయిదు సూత్రాలలో ఉపవాసం ఒకటి. కుటుంబం మరియు స్నేహితులతో కలసి భోజనం చేస్తారు. ఏదయినా తప్పులు జరిగితే క్షమించమని అల్లాహ్ ను ప్రార్దిస్తారు. సాయత్రం ఉపవసనికి ముగించటానికి చేసేది ఇఫ్తార్.ఈ ఇఫ్తార్ విందులో పోల్గోన్నదుకు అందరికి కృతజ్ఞతలు.

ఈ కార్యక్రమలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, అవినాష్ కుమార్ ఐపిఎస్,రాజేష్ మీన ఐపిఎస్, ఏ.ఓ యునుస్ అలి, ఇన్స్పెక్టర్ లు అజయ్ కుమార్,గోవర్ధన్ రెడ్డి, నైలు, గోపినాథ్,ప్రేమ్ కుమార్,ప్రవీణ్ కుమార్,కృష్ణ,మల్లేష్, సమ్మయ్య,ఆర్ ఐ లు రాం నిరంజన్,శేఖర్, రామకృష్ణ, రమేష్, అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్.ఎచ్.ఓ లు ఆర్.ఎస్ఐ లు తదితర సిబ్బంది పాల్గొన్నారు

## వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు5000/- రూపాయల జరిమానా.



**రాజన్న సిరిసిల్ల, ( ప్రజాబలం ),** వ్యక్తిపై దాడి కేసులో ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు 5000/- రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు.

వివరాల మేరకు సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన అంకరపు ప్రభాకర్ తండ్రి నరసయ్య అను అతను తేదీ04-06-2017 రోజున పాత పగలు దృష్టిలో పెట్టుకుని తన ఇంటికి ఉన్న టు లేట్ బోర్డును ఇంటి పక్కన ఉన్నటువంటి కాముని వనిత, కాముని అరుణ, వడ్డేపల్లి సుజాత అను వారు తీసివేసినారు అనుకోని వారిని బూతు మాటలు తిట్టి వారిపై కర్రతో దాడి చేసినారు అని కాముని వనిత సిరిసిల్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినారు. ఇట్టి సంఘటనపై అప్పటి సిరిసిల్ల ఏఎస్ఐ అనంతరెడ్డి అంకరపు ప్రభాకర్ మీద కేసు నమోదు చేసినారు. దర్యాప్తు అధికారి ఎండి లియాకత్ అలీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్సై శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేష్ కోర్టులో పదిమంది సాక్షలను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ నేరం రుజువు కావడంతో నిండితుడైన అంకరపు ప్రభాకర్ కి ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు 5000/- రూపాయల జరిమానా విధించినట్టు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు.

## జిల్లాలో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 26 :** జిల్లాలో భూ సంబంధిత సమస్యల పరిష్కారం కొరకు జిల్లా,సబ్-డివిజన్, మండల స్థాయిలలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి.ఎ.భాస్కర్తో కలిసి మంచిర్యాల,బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు, బెల్లంపల్లి, జైపూర్ ఎ.సి.పి.లు, తహశిల్దార్లు, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యల పరిష్కారం కొరకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి కమిటీలో తహశిల్దార్,ఎస్.హెచ్.ఓ.ల పరిధిలో నివాస ప్రాంతాలు, నిర్మాణ అనుమతులు, సరైన అనుమతులు లేని అక్రమ కట్టడాలపై ప్రత్యేక అధికారులైన మండల పంచాయతీ అధికారి, మున్సిపల్ కమీషనర్ల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి రిజిస్టర్ వివరాలు నమోదు చేసి గ్రీవెన్స్ నంబర్ కేటాయించాలని, దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారించాలని,కనీసం 15 రోజులు,గరిష్టంగా 21 రోజులలోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కోర్టులో పరిష్కారమయ్యే సమస్యలపై సంబంధిత అర్జీదారులకు అవగాహన కల్పించి తగు సూచనలు చేయాలని తెలిపారు. సబ్-డివిజన్ స్థాయిలో రాజస్వ మండల అధికారి, ఎ.సి.పి.ల పరిధిలో మండల స్థాయి కమిటీ పనితీరును 15 రోజులకు ఒకసారి పరిశీలించి సమస్యల పరిష్కారంలో మండల కమిటీకి తగు సూచనలు చేయాలని, డివిజన్ స్థాయిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత మండల స్థాయి కమిటీకి సిఫారసు చేసి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా స్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్,డి.సి.పి.ల పరిధిలో మండల,సబ్-డివిజన్ స్థాయి దరఖాస్తుల ప్రక్రియపై సమీక్షించి దరఖాస్తుల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను కమిటీల ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.అనంతరం మండల,సబ్-డివిజన్ కమిటీల వారిగా వచ్చిన దరఖాస్తులు, తీసుకున్న చర్యలపై సమీక్షించారు. 20-30 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కారం అవుతున్నాయని, వయోవృద్ధుల సంబంధిత దరఖాస్తులు అధికంగా వస్తున్నాయని,ఒంటరి మహిళ,దివ్యాంగుల సంబంధిత దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.డి.సి.పి మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి, రెవెన్యూ సంబంధించిన భూసమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సింగరేణి అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించేలా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 26 :** జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల విక్రయం, కొనుగోలుపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.బుధవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వ్యవసాయ,రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడంపై ఏర్పాటు చేసిన సమావేశానికి డి.సి.పి. ఎ.భాస్కర్,జిల్లా వ్యవసాయ అధికారి కల్పన లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడంపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల వినియోగం వలన కలిగే నష్టాలను రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేసే దళారులు, విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలాలలో,గ్రామాలలో పోలీసు,రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనేలా రైతులకు వివరించాలని తెలిపారు.నకిలీ పత్తి విత్తనాలతో పట్టాదారు, కౌలు రైతులు పంట సాగు చేసినట్లయితే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు నిలిపివేయడం జరుగుతుందని,దళారులపై పి.డి. యాక్టు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.గ్రామాలలో దళారులు ఎవరైనా విడిగా పత్తి విత్తనాలు విక్రయించినట్లయితే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు.హెచ్.టి.కాటన్ సాగు చేసిన రైతులు గ్లైఫోసేట్ కలుపు మందు పిచికారీ చేయడం ద్వారా భూసారం తగ్గుతుందని, క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు.పోలీసు, రెవెన్యూ,వ్యవసాయ శాఖల సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించాలని,బస్టాండ్, రైల్వేస్టేషన్, హజిల్లా సరిహద్దు ప్రాంతాలలో చెక్పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టాలని తెలిపారు.దళారులు ఇతర రాష్ట్రాల నుండి నకిలీ విత్తనాలను తీసుకువచ్చి మోసానికి పాల్పడుతున్నారని, రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి పంట సాగు చేసి అధిక లాభాలు పొందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశిల్దార్లు,ఎ.డి.ఎ.లు, ఎస్.ఐ.లు, మండల వ్యవసాయ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భారత నౌక దళ ఉద్యోగానికి కొండాపూర్ గ్రామ విద్యార్థి వివేకవర్ధన్ ఎంపిక



**కోనరావుపేట -27 మార్చి (ప్రజాబలం దినపత్రిక)** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొండపూర్ గ్రామానికి చెందిన గొల్లపల్లి వివేకవర్ధన్ భారత నౌకాదళ ఉద్యోగానికి ఎంపికయ్యాడు వివరాల్లోకెళ్తే నిరుపేద కుటుంబమైన గొల్లపల్లి దేవరాజ్ లత వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తూ వారి కుమారుడు అయినా వివేకవర్ధాన్ ను హైదరాబాదులో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతూ ఉద్యోగ ప్రయత్నం చేయగా అతనికి ఉద్యోగం వరించింది భారత నౌక దళంలో ఎస్ ఎస్ ఆర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు కొండాపూర్ గ్రామస్తులు అతన్ని వారి తల్లిదండ్రులని అభినందించారు.

### వ్యక్తి పై దాడి కేసులో ఒక సంవత్సర జైలు శిక్షతో పాటు 5000/ రూపాయల జరిమానా.



**రాజన్న సిరిసిల్ల జిల్లా ,మార్చి-26 (ప్రజాబలం ప్రతినిధి)** వ్యక్తి పై దాడి కేసులో ఒక సంవత్సర%శీ% జైలు శిక్షతో పాటు 5000/-రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పువెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు.?వివరాల మేరకు.సిరిసిల్ల పట్టణం లోని గాంధీనగర్ కి చెందిన అంకరపు ప్రభాకర్ తండ్రి నర్సయ్య అను అతను తేది:- 04.06.2017 రోజున పాత పగలు దృష్టిలో పెట్టుకొని తన ఇంటికి వున్న టులేట్ బోర్డును ఇంటి పక్కన ఉన్నటువంటి కాముని వనిత, కాముని అరుణ, వద్దేపల్లి సుజాత అను వారు తీసివేసినారు అనుకొని వారిని బూతు మాటలు తిట్టి వారిపై కర్రతో దాడి చేసినారు అని కాముని వనిత సిరిసిల్ల పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసినారు ఇట్టి సంఘటనపై అప్పటి సిరిసిల్ల ఏఎస్ఐ అనంత రెడ్డి అంకారపు ప్రభాకర్ మీద కేసు నమోదు చేసినారు.దర్యాప్తు అధికారి ఎండి. లియకత్ అలీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.కోర్టు మానిటరింగ్ ఎస్ ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేష్ కోర్టులో పది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించారు కేసు పూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ నేరం రుజువు కావడంతో నింధితుడైన ఆంకరపు ప్రభాకర్ కి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు 5000/- రూపాయల జరిమానా విధించినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు.

## మహిళలు సమాజంలో వారికి ఉన్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 26 :** నేటి సమాజంలో మహిళలు వారికి ఉన్న హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు.బుధవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో భేటి బచావో- భేటి పడావో, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా మహిళ,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి మెంటల్ హెల్త్ అండ్ లీగల్ రైట్స్ అవగాహన కార్యక్రమనికి జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్,జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్,జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి డాక్టర్ అనిత లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ... నేటి సమాజంలో మహిళలు తమకు ఉన్న హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నేటి సమాజంలో స్మార్ట్ ఫోన్ వాడకం పెరగడం వలన మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయని, ఎక్కువ సమయాన్ని వృధా చేస్తూ సమస్య ఎదురైనప్పుడు ఎవరికి చెప్పుకోకుండా మానసిక ఒత్తిడి గురవడం, తొందరపాటు నిర్ణయాలు తీసుకొని చాలా మంది జీవితాలు కోల్పోతున్నారని అన్నారు.స్మార్ట్ ఫోన్ వాడకం తగ్గించి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, యోగ,వ్యాయామం వంటివి అలవాటు చేసుకోవాలని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురైనప్పుడు సహాయం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్.14416ను సంప్రదించాలని తెలిపారు. పని ప్రదేశాలలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీలు, లోకల్ కంప్లయింట్ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఫిర్యాదు చేయాలని తెలిపారు.మహిళా ఉద్యోగులు భద్రత కలిగిన వాతావరణంలో పని చేసే విధంగా చట్టాలు తోడ్పడతాయని తెలిపారు.

జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళల కోసం మానసిక సమస్యలు, న్యాయ హక్కులకు సంబంధించి మెంటల్ హెల్త్ అండ్ లీగల్ రైట్స్ వంటి కార్యక్రమం నిర్వహించడం చాలా మంచి విషయమని అన్నారు.మానసిక ఒత్తిడి, ఉపశమనాలకు సంబంధించి ఈ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను సద్వినియోగం చేసుకోవాలని,చట్టాలపై పెంపొందించుకున్న అవగాహనను మరింత మందికి తెలియజేయాలని, సురక్షితమైన సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు.మార్పు ప్రతి ఒక్కరి నుండి మొదలవ్వాలని తెలిపారు.

మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సునీల్ మహిళలు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పి.ఓ.ఎన్.సి.డి.డాక్టర్ ప్రసాద్, మోటివేషనల్ స్పీకర్ మధుకర్, ఐ.సి.డి.ఎస్.సి.డి.పి.ఓ.లు, సూపర్వైజర్లు, వైద్యాధికారులు, అంగన్వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు,ఆర్.పి.లు, సంబంధిత శాఖల అధికారులు,మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రియుడు మోజులో పడి బర్తను హత్య చేసేందుకు ప్లాన్

- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ చేసేందుకు ప్రయత్నం
- తవేరా వాహనంతో ఢీ కొట్టి చంపేందుకు ప్రయత్నం




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 26 ( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా: అందోల్ నియోజకవర్గం లోని, మునిపల్లి,మండల పరిధిలోని, పెద్ద గోపులారం గ్రామానికి చెందిన, ఓ యువతి ప్రియుడి మోజులో పడి కట్టుకున్న భర్తను హత్య చేసేందుకు భారీ కుట్ర చేసిందని, మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్, తెలిపారు, ఎస్సై రాజేష్ నాయక్ కథనం ప్రకారం,సంగారెడ్డి జిల్లాలోని మునిపల్లి, మండలం పెద్ద గోపులారం గ్రామానికి చెందిన, కొమిసెట్టిపల్లి రవి, ఝరసంఘం మండలం దేవరపల్లి, గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడని, అయితే ఇతనికి సంగారెడ్డికి చెందిన హరితను,2021,లో పెళ్లి చేసుకున్నారని తెలిపారు, ప్రతిరోజు మాదిరిగానే తన విధులకు దేవరపల్లి గ్రామం కు వెళ్తుండగా, శనివారం ఉదయం విధులకు వెళ్లి సాయంత్రం తిరిగి స్వగ్రామమైన పెద్ద గోపులారం కు తిరిగి వస్తున్న క్రమంలో, జహీరాబాద్ నుంచి తవేరా కార్ వెంబడించిందన్నరు, భర్తను ఎలాగైనా హత్య చేయాలని ప్రియుడితో కలిసి ప్లాన్ చేసిన భార్య, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ చేసేందుకు ప్రయత్నం చేశారని అన్నారు, తవేరా వాహనం తనను వెంబడించడం గమనించిన రవి, వెంటనే బుదేరా చౌరస్తాలోని తన సైకిల్ మోటార్ ను, నిలిపారని తెలిపారు, బైకు ఆపిన వెంటనే తవేరా మోటర్ నిలిపివేయడం జరిగిందన్నారు, అక్కడ కొద్దిసేపు ఆగిన రవి తిరిగి సైకిల్ మోటార్ పై ప్రయాణిస్తుండగా తన బైకును వెంబడిస్తున్న తవేరా కారు, వెంకట కాజా దర్గా వద్దకు రాగానే, రవి బైకును తవేరా కారు ఢీకొట్టడంతో, వెంటనే రవి తప్పించుకొని నేరుగా పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేశారని అన్నారు, ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు వెంటనే విచారణ ప్రారంభించి, కంకల్ టోల్ ప్లాజా వద్ద వివరాలు సేకరించారని అన్నారు, కట్టుకున్న భార్య ప్రధాన సూత్రధారిగా నిర్ధారణ చేశారని తెలిపారు, ప్రియుడి మోజులో పడి భర్తను హత్య చేసేందుకు, ప్రయత్నించిన రవి భార్య హరిత, ప్రియుడు మిరుదొడ్డి సాయి ప్రదీప్, దాసోజీ సాయికిరణ్ పై, కేసు నమోదు

## కూతురి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తండ్రి పై పోక్సో కేసు

### -అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచిన పోలీసులు




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మార్చి 26:** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో గల యాపల్ ఏరియాకు చెందిన ఆకుదారి సతీష్ 8వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల తన కూతురిపట్ల అసభ్యంగా ప్రవర్తించాడని, అడ్డుకోబోయిన భార్యను చేతులతో మరియు కర్రతో కొట్టాడు అని బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి మందమర్రి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, మహిళా పోలీస్ అధికారి చేత బాధితురాలు యొక్క వాంగ్మూలం నమోదు చేశామని పట్టణ ఎస్. ఐ శివనీతి రాజశేఖర్ తెలిపారు. బుధవారం నిందితుడు ఆకుదారి సతీష్ (ఆటో డ్రైవర్, పశువుల కాపరి)ను అదుపులోకి తీసుకొని విచారించగా నిందితునికి మరియు అతని భార్యకు మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయన్నారు. నిందితుని పెద్ద కూతురు అయిన బాధితురాలు తనకు పుట్టలేదు అన్న అనుమానంతో ఆమెపై ఎప్పుడు కోపంగా ఉండేవాడని బుధవారం ఇంట్లో పోచమ్మ పండుగ చేసుకుందామని బాధితురాలిని మధ్యాహ్నం హాస్టల్ నుండి తీసుకువచ్చిన తండ్రి ఆ తర్వాత బయటకు వెళ్లి మద్యం తాగి వచ్చి కోపంతో కూతురి బట్టలు చింపి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో, అడ్డుకోబోయిన నిందితుని భార్య ను కర్రతో కొట్టినాడన్నారు. ఇట్టి సంఘటనపై కేసు నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితున్ని జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచామన్నారు. ఆ తర్వాత బాధితురాలని కౌన్సిలింగ్ నిమిత్తం భరోసా సెంటర్ కి పంపించినట్లు ఆయన తెలిపారు.

